సమావేశము - IV
వాల్యూము - II
నెం. 1

వెల : రూ. 19-00
18 మార్చి , 2016
శుక్రవారం,
(శక సం. 1937,
ఫాల్గుణం - 28)

తెలంగాణ శాసన సభ కార్యకలాపాలు

అధికార నివేదిక

విషయ సూచిక

1.	నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు - వాగ్రూప సమాధానములు	...	01
2.	సభా సమక్షంలో ఉంచిన పత్రం	...	14
3.	ప్రభుత్వ ప్రతిపాదన : ప్రభుత్వ లెక్కల సమితిలో రెండు యాధృచ్ఛిక ఖాళీలను భర్తీ చేయుట గురించి	...	14
4.	ప్రకటన : ప్రభుత్వ లెక్కల సమితి సభ్యుల ఎన్నికల షెడ్యూల్ గురించి	...	14
5.	సభా కార్యక్రమము - వాయిదా తీర్మానం అనుమతి గురించి	...	15
6.	2016 -2017 సం.పు వార్షిక ఆదాయ - వ్యయ పట్టిక (బడ్జెటు) పై - సాధారణ చర్చ (కొనసాగింపు) (మూడవ రోజు)	...	15

* * *

తెలంగాణ శాసన సభ

ప్రధాన అధికారులు

సభాపతి	:	శ్రీ ఎస్. మదుసూధనాచారి
ఉప సభాపతి	:	శ్రీమతి పద్మా దేవేందర్ రెడ్డి
కార్యదర్శి	:	డా. ఎస్. రాజ సదారామ్
సంయుక్త కార్యదర్శి	:	డా. వి. నరసింహాచార్యులు
సహాయ కార్యదర్శులు	:	శ్రీ టి. బి. జయచందర్ శ్రీ ఎస్. దుర్గాప్రసాద్ శ్రీ సిహెచ్. ఉపేందర్ రెడ్డి శ్రీమతి వి.ఎస్. ప్రసన్నకుమారి
చీఫ్ రిపోర్టర్	:	శ్రీ పి. శ్రీనివాస్

తెలంగాణ శాసన సభ కార్యకలాపాలు

అధికార నివేదిక

(నాల్గవ సమావేశము - ఏడవ రోజు)

శుక్రవారము, మార్చి18, 2016

(సభ ఉ.గం. 10.00 లకు ప్రారంభమైనది)

(గౌరవ సభాపతి అధ్యక్ష స్థానములో ఉన్నారు)

నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు - వాగ్రూప సమాధానములు

MR. SPEAKER: Please resume your seats. Question No.1752, Minister for Excise and Prohibition......

గుడుంబా అమ్మకంపై నిషేధం

ప్రశ్న నెం. 41(1752) సర్వ శ్రీ వేముల వీరేశం (నక్రేకల్), గువ్వల బాలరాజు (అచ్చంపేట), బానోత్ శంకర్ నాయక్ (మహబూబాబాద్) - గౌరవ నీయులైన ఆబ్కారీ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) చీప్ లిక్కర్ తయారీ, అమ్మకాన్ని నిషేధించే ప్రతిపాదన వున్న విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, చీప్ లిక్కర్ తయారీలో నిమగ్నమైన కుటుంబాల పునరావాసానికి ఏదైనా కార్యచరణ ప్రణాళికను రూపొందించడమయిందా, ఆర్థిక సహాయాన్ని అందించడ మయిందా;

ఇ) గుర్తించిన అట్టి కుటుంబాల జిల్లా వారి వివరాలు ఏమిటి?

ఆబ్కారి శాఖ మంత్రి(శ్రీ టి.పద్మారావు) : అ) ఆబ్కారి శాఖలో "చీప్‌లిక్కర్" అనే పేరుతో ఎటువంటి లిక్కర్ కేటగిరీ లేదు.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

ఇ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

మెదక్ జిల్లాలో 466, అదిలాబాద్ జిల్లాలో 370, కరీంనగర్ జిల్లాలో 508, నల్గొండ జిల్లాలో 755, రంగారెడ్డి జిల్లాలో 413, వరంగల్ జిల్లాలో 1413, మహబూబ్ నగర్ జిల్లాలో 1728, హైదరాబాదులో 285, నిజామాబాద్ జిల్లాలో 215, ఖమ్మం జిల్లాలో 728 కుటుంబాలను మొత్తం మీద 6881 కుటుంబాలను గుడుంబా తయారు చేసే కుటుంబాలుగా గుర్తించడం జరిగింది. ప్రాణాంతక రసాయనాలను తయారు చేసే కుటుంబాలపై ఉక్కు పాదం మోపి అణచివేయడమే కాకుండా ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు వారి జీవనోపాధికి కూడా ఏర్పాట్లు చేయడం జరుగుతోంది. ఈ పద్ధతిని మహబూబ్ నగర్ జిల్లాలో మొట్టమొదటుగా ప్రారంభించడం జరిగింది. జిల్లాలోని జిల్లా కలెక్టరు చేతుల మీదుగా ఎస్.సి, ఎస్.టి, మైనారిటీ, బి.సి. కార్పొరేషన్ల నుండి ఒక్కొక్క కుటుంబానికి ఒక్కొక్క లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించడం జరుగుతోంది. ఈ లక్ష రూపాయలలో 80వేల రూపాయలు సబ్సిడీ రూపంలోను, 20వేల రూపాయలు బ్యాంక్ ఋణం లేదా బెనిఫిషరీ కాంట్రిబ్యూట్ రూపంలో ఉంటుంది. వరంగల్ జిల్లాలో గుర్తించిన 358కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి 50వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించడం జరిగింది. లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని మిగతా జిల్లాలకు కూడా అందించే విధంగా ఆయా జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వడం జరుగుతుంది.

శ్రీ వేముల వీరేశం : అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు గుడుంబా బారి నుండి ప్రజలను కాపాడాలి, రక్షించాలనే సంకల్పంతో ఆదేశించగానే ఎక్సైజ్ శాఖ వారు, ఎన్‌ఫోర్స్‌మెంట్ వారు చాలా గొప్పగా పని చేసి ఇప్పటికి 8జిల్లాలను గుడుంబా రహిత జిల్లాలుగా ప్రకటించినదుకు మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఇప్పటి వరకు ఏఏ జిల్లాలో ఎంత మంది మీద కేసులు ఉన్నాయి? పేపర్లలో చూసిన విధంగా పిడి యాక్టులు ఎంత మంది మీద ప్రయోగించారో, ఏఏ జిల్లాలో ఎన్ని పిడి యాక్టుల క్రింద కేసులు నమోదు అయ్యాయో,

ఆ వివరాలను తెలపాలని గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను. దాదాపు ఇప్పటికి 10,417 గ్రామాలను గుడుంబా రహిత గ్రామాలుగా విన్నాము. వాటిలో 10,339 గ్రామాల్లో పూర్తిగా అరికట్టారు. ఇంకా 68 గ్రామాల్లో అరికట్టాలనే వార్తలు చూసాము. అయితే అరికట్టాల్సిన 68జిల్లాలు ఏఏ గ్రామాల్లో ఉన్నాయి? అక్కడి తీవ్రత ఏ విధంగా ఉన్నదనే వివరాలను కూడా చెప్పాల్సిందిగా కోరుతున్నాను. మా నల్గొండ జిల్లాలోని రాయన్‌గూడెం గ్రామంలోని ప్రజలు 30-35 సంవత్సరాల యువకులే 40మంది బలి అయిపోయిన పరిస్థితి ఏర్పడింది. కాబట్టి, ధూల్ పేటలాంటి చోట 5 కోట్ల రూపాయలతో ఒక ప్రత్యేక ప్యాకేజి ద్వారా గుడుంబా తయారు చేస్తున్న బాధితుల్ని ఆదుకుంటామనే విషయాన్ని పేపర్లలో చూసాము. ఈ విషయమై ఎలాంటి మార్గదర్శకాలను ప్రభుత్వం పాటిస్తుందనే వివరాలను తెలపాల్సిందిగా కోరుతున్నాను. ఇందులో వితంతువులు, నిరక్షరాస్యులను కూడా గుర్తించి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేపర్లలో చూసాము. ఉపాధి అవకాశాలకు సంబంధించి ఏ జిల్లాల్లోనైనా ప్రారంభించారా, ఒకవేళ ప్రారంభిస్తే ఏ స్టేజ్‌లో ఉన్నాయనే పూర్తి వివరాలను గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ గువ్వల బాలరాజు: అధ్యక్షా, గుడుంబా రహిత జిల్లాలుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్లకు గౌరవ ముఖ్యమంత్రి గారు ఆదేశాలు ఇవ్వడంతోను, ఎక్సైజ్ శాఖ మంత్రి గారి చొరవతో మా నియోజక వర్గంలోని మా మా గ్రామాల్లో ప్రజలు పూర్తి విశ్వాసం ప్రభుత్వంపై ఉంచుతున్నారు. ప్రభుత్వం రిహాబిటేషన్ స్కీమ్‌ను అమలులోకి తీసుకు వచ్చింది కాబట్టి, గుడుంబా తయారీని దాదాపు 90-95శాతం బంద్ అయింది కాబట్టి, ఆయా కుటుంబాలను ఆదుకునే విధంగా ప్రభుత్వం చేపట్టిన రిహాబిటేషన్ స్కీమ్ క్రింద మంత్రి గారు చెప్పినట్లు మా జిల్లాలో వెయ్యికి పైగా ఎక్సైజ్ కేసులు నమోదు అయ్యాయని చెప్పారు. వారికి రిహాబిటేషన్ కల్పించే విధంగా ప్రభుత్వం తీసుకున్న చొరవతో నా సమాచారం మేరకు మా జిల్లాకు 75యూనిట్లు ఇవ్వడం జరిగింది. 75యూనిట్లలో స్యాచురేషన్ మోడ్‌లో మా నియోజక వర్గంలో ఉన్న దర్శన్‌గడ్డ తాండాకు చెందిన 51మంది పైన కేసుకు పెట్టారు. రిహాబిటేషన్ స్కీమ్ క్రింద.

10.10 ఉ. గౌరవ మంత్రి గారిని కలిసి మాట్లాడిన సందర్భంలో అందరికీ ఈ ప్రభుత్వం ఉపాధిని కల్పించి గుడుంబా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో వెళుతోందని తెలియజేశారు. శ్యాచురేషన్ మోడ్‌లో దర్శన్ గడ్డ తండాకు ఈ స్కీమ్‌లో అవకాశం ఇచ్చి, ఇంప్లిమెంట్ చేస్తామన్నారు. నా దగ్గర ఉన్న సమాచారం మేరకు ఈ స్కీమ్ అమల్లోకి వచ్చిందని తెలుసు. కానీ ఎప్పటి వరకు వారికి లోన్స్ అందుతాయనే విషయాన్ని తెలియపరచాలని కోరుతున్నాను. ఈ విషయాన్ని అడ్డం పెట్టుకుని ఎక్సైజ్ అధికారులు వ్యాపారస్థులను కొంత ఇబ్బంది పెడుతున్నారు. పండగల సందర్భంలో తెల్ల బెల్లం దొరకనటువంటి పరిస్థితి ఉంది. ఈరకంగా కాకుండా లిమిటేషన్ పెట్టి, ప్రజలకు పండుగల సందర్భంలో ఇబ్బందులు జరగకుండా చూడాలి. ఇతరత్రా కార్యక్రమాల్లో బెల్లం వాడడమనేది తెలంగాణాలో సాంప్రదాయంగా ఉన్నది. దయచేసి గుడుంబాను పూర్తి స్థాయిలో నివారించి, అరికట్టాలని కోరుకుంటున్నాము. ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చడం కోసం ప్రజాప్రతినిధిగా మా వంతు కృషి చేస్తాము. అలాగే వ్యాపారస్థులకు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఆదేశాలివ్వాలని మంత్రి గారిని నేను కోరుతున్నాను.

جناب ٹی راجا سنگھ (Janab T.Raja Singh): اسپیکر صاحب! آج ہمیں یہ پتہ چلا کہ حکومت گڑمبا بند کروانے کے لئے بہت کوشش کر رہی ہے اور میدک، حیدرآباد، ورنگل اور محبوب نگر وغیرہ اسی طرح کے کئی علاقوں میں جو کچی شراب بنتی ہے وہ سلسلہ بند ہو چکا ہے۔ لیکن میں آپ کے ذریعہ حکومت سے یہ پوچھنا چاہتا ہوں کہ جہاں جہاں پر گڑمبا بنتا ہے وہاں پر rehabilitation کے لئے حکومت نے کیا منصوبہ بنایا ہے؟ صاحب! دھول پیٹ ایک ایسا علاقہ ہے جو اب سے نہیں نظام کے دور سے یہاں پر گڑمبا تیار کرکے لوگ اپنا گزارہ کرتے ہیں اور آج تلنگانہ بننے کے بعد یہ حالت ہوگئی کہ لوگ کھانے کھانے کے محتاج ہو گئے۔ میں آپ کے ذریعہ سی ایم صاحب سے یہ گزارش کرنا چاہتا ہوں کہ پورے تلنگانہ میں جہاں جہاں گڑمبا بنتا ہے ان کے rehabilitation کیلئے وہ ایک بہت اچھی اسکیم بنائیں۔ صاحب! دھول پیٹ میں ایک زمانہ تھا جب 90% لوگ شراب بنایا کرتے تھے، لیکن آج صرف 20% بچے ہیں، لیکن آج دھول پیٹ میں ایسے کئی کلاکار اور فنکار ہیں جو بہت ہی خوبصورت گنیش جی کی مورتیاں بناتے ہیں، ایسے کئی business کرتے ہیں اور اپنا گزارہ کرتے ہیں، لیکن آج دھول پیٹ کے جتنے بھی تعلیم یافتہ نوجوان ہیں، وہ پڑھ لکھ کر آج کہیں پر job کے لئے جاتے ہیں تو ان کو ملازمت نہیں دی جاتی۔ میں آپ کے ذریعہ سی ایم صاحب سے یہ گزارش کرنا چاہتا ہوں کہ جتنے بھی تعلیم یافتہ نوجوان ہیں، ان کو کہیں سرکاری نوکری دیں اور ان کی مدد کریں۔ صاحب! گڑمبا ایک ایسی چیز ہے کہ اگر ہم اس کو جڑ سے ختم کرنا چاہتے ہیں تو ہمیں بہت بڑی planning کرنی ہوگی۔ اگر ہم اس پلان میں کامیاب ہو جائیں گے تو حکومت کو اور ہم سب کو ایک بہت اچھا credit آئے گا۔ اور ساتھ ہی ساتھ میں آپ کے ذریعہ متعلقہ منسٹر صاحب سے یہ گزارش کرنا چاہتا ہوں کہ آج Excise والوں کا دھول پیٹ میں بہت ظلم ہو رہا ہے۔ آج تقریباً 20 لوگوں پر پی ڈی ایکٹ لگا کر انہیں گرفتار کیا گیا، اور ساتھ ہی ساتھ خواتین پر بھی اب پی ڈی ایکٹ لگانے کا منصوبہ بنایا جا رہا ہے۔ میں آپ کے ذریعہ متعلقہ منسٹر صاحب سے گزارش کرنا چاہتا ہوں کہ جب تک ہم rehabilitation کا کام شروع نہیں کرتے تب تک Excise کا جو ظلم ہو رہا ہے، اس کے اوپر ہم روک لگائیں گے تو بہت ہی ٹھیک ہوگا۔ میں آپ سے ہاتھ جوڑ کر گزارش کرنا چاہتا ہوں کہ ایک بار ہم ایک اچھی سی کمیٹی بنا کر، تلنگانہ میں جہاں جہاں پر گڑمبا بنتا ہے، ان کے rehabilitation کے لئے ایک اسکیم بنائیں۔ میں تو یہ کہتا ہوں کہ دھول پیٹ میں جتنے لوگ گڑمبا بناتے ہیں، میں نے ان سب سے بات کی ہے اور پوچھا کہ آپ کیا چاہتے ہیں؟ انہوں نے بتایا کہ ہمیں پیسہ نہیں، ہمیں کام چاہئے۔ تو میں آپ کے ذریعہ سی ایم صاحب سے اور متعلقہ منسٹر صاحب سے یہ گزارش کرنا چاہتا ہوں کہ دھول پیٹ میں بہت ساری سرکاری زمین ہے، وہاں پر small scale industries قائم کرکے جو گڑمبا تیار کرتے ہیں، اگر حکومت کی طرف سے کوئی product ان کے ذریعہ سے بنوایا جائے تو تاریخ میں گڑمبے کی طرف کوئی آگے نہیں جائے گا اور ایک بہت ہی اچھا ان کے rehabilitation کا کام ہوگا۔ شکریہ۔

శ్రీ టి. పద్మారావు : అధ్యక్షా, గౌరవ శాసన సభ్యులు వేముల వీరేశం, గువ్వల బాలరాజు, రాజాసింగ్ గార్లు గుడుంబా గురించి మాట్లాడ్డం జరిగింది. చాలా వరకు కొన్ని వేల మందికి ముందుగా అవకాశం ఇచ్చి bind over చేయడం జరుగుతోంది. ఇప్పటి వరకు తెలంగాణ ప్రాంతంలోని పది జిల్లాల్లో 70 మందిపై పి.డి. యాక్టులు పెట్టి కేసులు పెట్టడం జరిగింది. ఈ కేసులు పెట్టడమే కాకుండా వారికి అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నాము. గ్రామజ్యోతి, మహిళా సమైక్యలతో, అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు మరియు మహిళా సంఘాలతో, కళా జ్యోతులచే ర్యాలీలను నిర్వహించి గుడుంబాను పూర్తిగా నివారించడం జరుగుతోంది. వేలాది గ్రామాల్లో వారిచే మేము గుడుంబాను విక్రయించడం మానివేశామని ప్రమాణాలు కూడా చేయించడం జరుగుతోంది. వరంగల్, హైదరాబాదు, రంగారెడ్డి జిల్లాల్లో కాకుండా తెలంగాణలో మిగిలిన 7 జిల్లాలను గుడుంబా రహిత జిల్లాలుగా ఆయా ప్రాంతాల జిల్లా కలెక్టర్లు ప్రకటించడం జరిగింది. గ్రామాల్లో , పట్టణాల్లో పునరావాస విషయంలో కొన్ని మార్పులు ఉంటాయి. గ్రామాల్లో ఉండే 6,885 కుటుంబాలకు ఆయా కలెక్టర్లచే లక్ష రూపాయలు ఆర్థిక సహాయాన్ని అంద చేసి జీవనోపాధి కలిగించే విధంగా జిల్లా కలెక్టర్లకు ఆదేశాలను ఇస్తున్నాము. మహబూబ్ నగర్, వరంగల్ జిల్లాల్లో ఇప్పటికే ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టాము. మహబూబ్‌నగర్ జిల్లాలో ఇప్పటికే 600 కుటుంబాలకు అదించడం జరిగింది. అదేవిధంగా వరంగల్ జిల్లాలో 358 కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం జరుగుతోంది. హైదరాబాదు విషయానికి వస్తే

ہمارے بھائی صاحب راجا سنگھ جی نے دھول پیٹ میں گڑمبا بنانے والوں کے rehabilitation کے لئے پوچھا تھا۔ چار پانچ سال پہلے حکومت کی جانب سے دھول پیٹ کیلئے ایک special package دیا گیا تھا۔ اس وقت تقریبا پانچ کروڑ روپے یہ کہہ کر دئے گئے تھے کہ جو بھی گڑمبے کے کاروبار میں لگے ہوئے ہیں وہ بند کرکے کوئی اور کاروبار کریں تو حکومت ان کا ساتھ دے گی تو اس وقت تقریبا ڈیڑھ کروڑ روپے beneficiaries کو دئے گئے تھے۔ وہ پیسے اس طریقہ سے دئے گئے تھے کہ گڑمبا بیچنے والوں کے جو کیس تھے انہیں لوگوں کو financial assistance دیا گیا تھا۔ اب ایسا نہیں ہوگا۔ یہ اسمبلی سیشن 29 یا 30 مارچ تک 10-11 دن اور چلنے والا ہے۔ اس کے بعد ہم حیدرآباد ڈسٹرکٹ کلکٹر اور آپ وہاں کے ایم ایل اے ہیں، اور ہمارے IAS Officers کی ایک کمیٹی constitute کریں گے۔ ایک ایسا پروگرام بنایا جائے گا کہ ہم ان کے لئے ایک چھوٹا موٹا industry قائم کریں گے، دھول پیٹ کے رہنے والوں کے لئے پیشہ کے لئے livelihood کو create کریں گے۔ اس طریقہ سے ہم ایک Committee کو constitute کریں گے۔ اس میں آپ بھی ممبر ہو جائیے، اور ساتھ میں ہمارے IAS Officers بھی رہیں گے۔ District Collector کو چیرمین بنا کر اس Committee کو constitute کریں گے۔ حکومت کی طرف سے already مختلف بینکوں میں پانچ کروڑ روپے ہیں جمع کئے گئے ہیں، زیادہ ضرورت پڑے تو ہم بیس پچیس کروڑ روپے اور دیں گے۔ ان کے لئے ایک permanent چھوٹا موٹا small scale industry یا پیشہ کے لئے کچھ training دے کر ان کی زندگی بنانے کے لئے حکومت کی طرف سے ہم پوری کوشش کریں گے۔

వేరుశనగ పంటకు కనీస మద్దతు ధర

ప్రశ్న నెం. 42 (1581) సర్వశ్రీ చల్లా వంశీచంద్ రెడ్డి (కల్వకుర్తి) – గౌరవనీయులైన సాగునీరు, మార్కెటింగు శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) రాష్ట్రంలోని వివిధ మార్కెట్లకు వేరుశనగ భారీ పరిమాణంలో చేరిన విషయం వాస్తవమేనా;

ఆ) దళారులు తక్కువ ధరకు సేకరిస్తున్నందు వల్ల వేరుశనగ రైతులు కనీస మద్దతు ధరను పొందలేక పోతున్న విషయం వాస్తవమేనా;

ఇ) ప్రభుత్వం రెండింతల ధరకు దళారుల నుండి వాటిని కొనుగోలు చేసి విత్తనంగా రైతులకు సరఫరా చేస్తునన విషయం వాస్తవమేనా;

ఈ) అయితే, ఈ విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటి?

సాగునీరు, మార్కెటింగు శాఖ మంత్రి(శ్రీ టి. హరీశ్ రావు): అ) 2015-16 సంవత్సరానికి ఇప్పటివరకు మొత్తం 4,88,826.63 క్వింటాళ్లు వేరుశనగ వివిధ మార్కెట్లకు వచ్చింది.

ఆ) లేదండీ. రైతులు వేరుశనగకు కనీస మద్దతు ధరకు మించిన ధరలను పొందుతున్నారు. వేరుశనగకు కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.4030/- గా వుంది.

ఇ) విత్తన ఉత్పత్తిదార్లు మూల విత్తనంతో నుండి ధృవీకృత విత్తనాన్ని ఉత్పత్తి చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు విత్తన ఉత్పత్తి దార్లు ఉత్పత్తి చేసిన విత్తనాన్ని సేకరించడమవుతున్నది.

ఈ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ సి. వంశీ చంద్ రెడ్డి : అధ్యక్షా, గౌరవ మంత్రి గారి సమాధానంలో ఇప్పటి వరకు 4,88,000 వేల క్వింటాళ్లు మార్కెట్‌కు చేరడం జరిగిందని తెలియచేశారు. గత సంవత్సరం ఇదే సమయానికి 295లక్షల క్వింటాళ్లు ఉన్నది. గత సంవత్సరం 295లక్షల క్వింటాళ్లు చేరితే, ఈ సంవత్సరం కేవలం 488,000 క్వింటాళ్లు వచ్చింది. దీనిని బట్టి రాష్ట్రంలో ఉన్న కరువు పరిస్థితులు, రైతుల పరిస్థితి చాలా స్పష్టంగా అర్థం అవుతుంది. మినిమమ్ సపోర్ట్ ధర రూ.4,030 గా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం జరిగింది.

10.20 ఉ. రైతులు మార్కెట్‌లో దళారులు చాలా తక్కువ ధరను చెల్లిస్తున్నారు. అందు వలన రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. దళారులు, రైతులను ఎంత ఇబ్బంది పెడుతున్నారంటే అనేక సందర్భాలలో రైతులు రోడ్ల మీదకు వచ్చి ధర్నాలు చేసినా కూడా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. కల్వకుర్తిలో ఫిబ్రవరి 11నాడు వేరుశనగ రైతులందరూ కలిసి రోడ్డుపైన బైఠాయించి ధర్నాలు చేశారు. జడ్చర్ల, మహబూబ్ నగర్ జిల్లాల మార్కెట్‌లలో కూడా ధర్నాలు చేశారు. ప్రతి సంవత్సరం మహబూబ్ నగర్ జిల్లాలో 6,050,000 ఎకరాలలో వేరుశనగ పంట వేస్తే, ఈ సంవత్సరం కేవలం 1,50,000 ఎకరాలలో వేరుశనగ పంట వేశారు. మా నియోజకవర్గంలో ఒక సబ్‌డివిజన్‌లో మాత్రమే గత సంవత్సరం 1775 ఎకరాల పంటను సాగుచేస్తే ఈ సంవత్సరం కేవలం 8000 వేల ఎకరాలు సాగు చేశారు. ప్రభుత్వం నాణ్యమైన విత్తనాలు సప్లై చేయకపోవడం, సమయానికి వర్షాలు పడకపోవడం, గత సంవత్సరం ఎకరానికి 6 క్వింటాల్ నుంచి 7 క్వింటాల్ yield వస్తే ఈ సంవత్సరం ఒకటి నుంచి ఒకటిన్నర క్వింటాల్ yield మాత్రమే రావడం జరిగింది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర రూ.4030లు. ఈ ధర ఏ మాత్రం సరిపోదు, బహుశా ఇది కేంద్రప్రభుత్వం నిర్ణయించిన ధర అని రాష్ట్రప్రభుత్వం అనుకోవచ్చు. Commission for Agricultural Costs and Prices వేరుశనగకు రూ.4030లు ప్రకటిస్తూ, రాష్ట్రాలల్లో ఉన్న వర్షాభావ పరిస్థితుల వల్ల అక్కడున్నటువంటి కరువు పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని మీరు వెసులుబాటు కల్పించి దీనికి అదనంగా రాష్ట్రప్రభుత్వాలు రైతులను ఆదుకోవడానికి ఒక buffer పెట్టుకొని రైతులకు మద్దతు ధర పెంచే ప్రయత్నం చేయండి. గ్రౌండ్‌నట్‌కి మిగతా పంటలకు ఒక చిన్న తేడా ఉంది. గ్రౌడ్‌నట్ అనేది సెల్ఫ్ పాలినేటెడ్‌క్రాప్. మిగితావన్నీ క్రాప్ పాలినేటెడ్ క్రాప్. ఈ సంవత్సరం పండిన విత్తనాలను , వచ్చే సంవత్సరం కొంచెం శుద్ధి చేసి ఉపయోగించుకోవచ్చును. రైతులకు రూ.4030లు దళారులు ఇస్తారు. దళారులు నుంచి రూ.9000లకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. ఇదే వేరుశనగను రైతులకు విత్తనాలు కావలసివచ్చినప్పుడు 30 కేజీల బస్తాను రూ2,790లు అని చెప్పి, అందులో ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని చెప్పి దాన్ని రూ.1390కి రైతులకే అమ్మడం జరుగుతుంది. అంటే సబ్సిడీ పోనూ, రైతుకు దొరికే విత్తనం ధర క్వింటా రూ.4633లు. సబ్సిడీ లేకుండా రూ.9300లు. ఇది ఎక్కడి న్యాయం. ప్రభుత్వ గణాంకాలు చాలా స్పష్టంగా చెబుతున్నాయి. వర్షాలు లేవు, పంట దిగుబడులు లేవు. ఈ పరిస్థితిలో ప్రభుత్వాన్ని నేను కోరేదేమనగా మీరు దళారులకు అనుకూలమైన ప్రభుత్వంగా కాకుండా రైతులకు అనుకూలమైనటువంటి ప్రభుత్వంగా ఉండండి. క్వింటాలు మద్ధతు ధరను రూ.7500కు తగ్గకుండా ప్రభుత్వాలు ప్రకటించాలని రైతులను అన్ని విధాల ఆదుకోవాలి కోరుతున్నాను.

శ్రీ టి. హరీశ్ రావు: అధ్యక్షా, గౌరవ సభ్యులు వంశీచంద్ రెడ్డిగారు అడిగిన ప్రశ్న వాస్తవానికి రెండు శాఖలకు సంబంధించినది. మార్కెటింగ్‌కు, వ్యవసాయశాఖకు సంబంధించినది. కేంద్ర ప్రభుత్వం రూ. 4030 ధరని చాలా తక్కువగా నిర్ణయించిందని సభ్యులు చెప్పారు. మొన్నటి దాక ఈ దేశంలో 10 సంవత్సరాలు పరిపాలించింది కాంగ్రెస్ పార్టీయేనని మీ ద్వారా వారికి గుర్తు చేస్తున్నాను. పది సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండి గ్రౌండ్‌నట్ రైతులకు అన్యాయం చేసింది. రైతులకు మద్దతు ధరను కాంగ్రెస్ పార్టీ పెంచలేదని సభ్యులు ఒప్పుకున్నందుకు వారిని అభినందిస్తున్నాను. ప్రస్తుతం నిన్న మార్కెట్‌లో గ్రౌండ్‌నట్ ధర రూ.5,800 నుంచి రూ.6,000లు గా ఉన్నది. గ్రౌండ్ నట్ సీడ్ వేరు. గ్రౌండ్ నట్ వేరు. మార్కెట్ యార్డ్‌కు సీడ్ రాదు. మార్కెట్ యార్డ్‌కు గ్రౌండ్ నట్ వస్తుంది. అది కూడా అయిల్ ప్రొడక్షన్ కోసం వెళుతుంది. అయితే సీడ్ విషయంలో మన వ్యవసాయ శాఖ క్రింద ఉండేటువంటి సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆయిల్ ఫెడ్ వారు ఈ సీడ్‌ను సేకరించడం జరుగుతుంది. ఈ సీడ్‌ను అయిల్ ఫెడ్ వారు రైతుల నుంచి రూ. 6,300లకు సేకరిస్తున్నారు. గత సంవత్సరం సీడ్ కొరతగా ఉండడం వలన టెండర్లను పిలచి ఓపెన్ మార్కెట్‌లో కొన్నప్పుడు రూ.9,000లు ధర పడడం జరిగింది. ఈ సంవత్సరం ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం కొనేటువంటి సీడ్ డైరెక్టుగా రైతుల నుంచే కొనాలని నిర్ణయం తీసుకుంది. దాని ద్వారా రైతు కొంతవరకైనా, ఉపయోగం పొందుతాడు. ఈ సంవత్సరం నుంచి టెండర్లకు పోకుండా మన రాష్ట్రానికి అవసరమయ్యే సీడ్ మొత్తాన్ని రైతుల నుంచి సేకరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీని ద్వారా రైతులకు తక్కువ ధరతో విత్తనాలను ప్రభుత్వం ఇవ్వగలుగుతుంది. కేంద్ర ప్రభుత్వంలో ఇప్పుడున్నటువంటి బిజెపి ప్రభుత్వంతో ప్రత్తి, వేరుశనగ రెండింటి ధరలు పెంచాలని రాష్ట్రప్రభుత్వం పక్షాన ఒత్తిడి తీసుకొస్తున్నాము. వచ్చే సంవత్సరానికి అయినా ఈ ధరను పెంచడం కోసం తిరిగి మన రాష్ట్ర ప్రభుత్వం పక్షాన కేంద్రప్రభుత్వానికి లేఖ రాయడంతోబాటు మరింత ఒత్తిడి తీసుకొస్తాము.

శ్రీ చల్లా వంశీచంద్ రెడ్డి: మంత్రిగారు మాట్లాడుతూ,అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది

కాంగ్రెస్ ప్రభుత్వమే మద్దతు ధరను నిర్ణయించిందని చెబుతున్నారు. మద్దతు ధర ప్రకటించేది పార్టీలు కాదు, ప్రభుత్వాలు కాదు. కమీషన్ ప్రకటిస్తుంది. ఏదైతే కమీషన్ ఉందో ఆ కమీషన్ నిర్ణయాలు తీసుకొంటుంది. నా కన్నా మంత్రి స్థానంలో వారు ఉన్నారు కాబట్టి వారికే ఈ విషయాలన్నీ తెలుస్తాయి. తెలిసినా కూడా కావాలనీ రాజకీయంగా మాట్లాడి తప్పుదోవ పట్టిస్తున్నారు. 2011-2012లో ఇదే కమీషన్ మేము అధికారంలో ఉన్నప్పుడు మద్దతు ధరను రూ.1,000లకు పెంచింది. 2012-2013 రూ.300లు పెంచారు. 2014-2015, 2015-2016లో కేవలం రూ.30లు మాత్రమే పెంచారు.

శ్రీ టి. హరీశ్ రావు: గౌరవ సభ్యులు చెప్పిన విధంగా ఈ సంవత్సరం వేరుశనగకు మద్దతు ధరను పెంచడం కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రప్రభుత్వం వద్దకు ప్రత్యేకంగా ఒక అధికార బృందాన్ని పంపించి వారి దృష్టికి రైతాంగం యొక్క సమస్యను తెలియజేసి, మద్దతు ధరను పెంచడానికి ప్రయత్నం చేస్తాము.

10.30 ఉ.

పోలీసు బలగాల పటిష్టత

ప్రశ్న నెం. 43(1575) సర్వ శ్రీ బీగల గణేష్ (నిజామాబాద్), దుర్గం చిన్నయ్య (బెల్లంపల్లి), చల్లా ధర్మారెడ్డి (పరకాల), రాథోడ్ బాపూరావు (బోథ్) - గౌరవనీయులైన హోం శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

(అ) రాష్ట్రంలోని పోలీసు దళాన్ని పటిష్టపరచి, ఆధునీకరించడానికి తీసుకుంటున్న చర్యలేమిటి;

(ఆ) ఆధునికసదుపాయాలతో హైదరాబాదు, సైబరాబాదు పోలీసు కమీషనరేట్లు గల పోలీసు

కమాండ్ కంట్రోల్ సెంటర్ భవన నిర్మాణ పనులను ఎప్పటిలోగా పూర్తి చేయడమవుతుంది;

(ఇ) పోలీసు శాఖలోని ఖాళీ పదవులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం వాస్తవమేనా;

(ఈ) అయితే, సదరు ప్రక్రియను ఎప్పటిలోగా పూర్తి చేయడమవుతుంది?

హోం శాఖా మంత్రి (శ్రీ నాయిని నర్సింహా రెడ్డి): (అ) పోలీసు శాఖను పటిష్టపరచి, ఆధునీకరించడం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల వివరాలను సభా సమక్షంలో ఉంచడమయింది.

(ఆ) కాంట్రాక్టు ఎంపిక చేసిన కాంట్రాక్టరుకు అప్పగించిన తేదీ నుండి 24 నెలల లోపల నిర్మాణం పనిని పూర్తి చేయడమవుతుంది. ప్రస్తుతం టెండర్ ప్రక్రియ కొనసాగుతున్నది.

(ఇ) అవునండీ.

(ఈ) పోలీసు శాఖలోని వివిధ పదవులలోగల ఖాళీలను భర్తీ చేసేందుకు నియామక ప్రక్రియ

కొనసాగుతున్నది. ఈ ప్రక్రియ ఈ సంవత్సరం చివరినాటికి పూర్తి అవగలదు.

శ్రీ నాయిని నర్సింహా రెడ్డి: అధ్యక్ష రాష్ట్రంలో ప్రపంచస్థాయి పోలీసు సేవలను అందించడానికి హైదరాబాదును సేఫ్ అండ్ స్మార్ట్ సిటీగా తీర్చి దిద్దే ప్రధాన లక్ష్యంతో బడ్జెట్ కేటాయింపులు జరుపుతున్నాము. నేరాల నివారణకు విజువల్ పోలీసింగ్ తోపాటు, నేరం జరిగిన వెంటనే పోలీసులు ఆ సంఘటనా స్థలానికి చేరుకునే విధంగా చూస్తున్నాం. ఈ ఉద్దేశ్యంతో వివిధ ఉపకరణాలతో ఆధునిక, సాంకేతికతో కూడిన బ్రాండెడ్‌వాహనాలను బ్లూకోర్ట్ మోటారు సైకిళ్లను కొని రాష్ట్ర ఆవిర్భావం అయిన వెంటనే హైదరాబాదు, సైబరాబాదులలో కేటాయించడం తోపాటు రాష్ట్రంలోని ప్రతి పోలీస్ స్టేషన్‌కు వాహనాలు, సుమోలు సమకూర్చడం జరిగింది. ఆన్‌లైన్ నేరాలు అదుపు చేయడం, మరియు ట్రాఫిక్ నివారణ కోసం ఐ.టి పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నాము. ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌లో దేశంలో మొట్టమొదటిసారిగా హైదరాబాదు, సైబరాబాదుల్లో cash less ఈ చలాన్ పద్ధతిని ప్రవేశపెట్టాము.

పారదర్శకత కోసం సిబ్బందికి బాడీ వార్నింగ్ కెమెరాలు కూడా ప్రవేశపెట్టాము. ఈ విషయంలో గతంలో చలాన్లు వేసి డబ్బులు తింటున్నారని కరప్షన్ జరుగుతోందని ఆరోపణలు వస్తే ప్రపంచంలో వున్నటువంటి, భారతదేశంలో లేనటువంటి ఈ చలాన్ సిస్టమ్‌ను ఇక్కడకు తీసుకువచ్చాము. ట్రాఫిక్ వాళ్లతో పోలీస్ వాళ్లకు ఘర్షణ కనుక జరిగితే, ఆర్గ్యుమెంట్ జరిగితే బాడీ కెమెరాల ద్వారా పూర్తిగా అదుపు చేసే విధంగా చేయడం జరుగుతోందని మనవి చేస్తున్నాం. హైదరాబాదు, సైబరాబాదుల్లో మొత్తం లక్షసి.సి. కెమెరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించాము. అంతేకాదు పబ్లిక్ సేఫ్టీ మేజర్స్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆక్ట్ ప్రకారం కమ్యూనిటి సి.సి. టి.వి. ప్రాజెక్టులు మొదలుపెట్టాము. రూ. 350 కోట్ల అంచనాలతో అత్యంత అధునాతనంగా ఇంటిగ్రేటెడ్ పోలీస్ కమాండెంట్ మరియు కంట్రోల్ సెంటర్, సిటి పోలీస్ కమీషనరేట్ ప్రధాన కార్యాలయాన్ని బంజారాహిల్స్‌లో నిర్మిస్తున్నాం. దీనిని 24 నెలల్లో నిర్మిస్తాము. ఈ

సెంటర్‌లో రాష్ట్ర మొత్తం మీద ట్రాఫిక్ వ్యవస్థ అనుసంధానం చేయబడుతుంది. క్రైమ్ మరియు క్రిమినల్ డాటా బేస్ ఇంటిగ్రేటెడ్ ఇంటలిజెన్స్ వ్యవస్థ అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ వ్యవస్థను ప్రపంచ శ్రేణికి సంకేతం కలిగి వుంటుందని మనవి చేస్తున్నాను.

రాష్ట్రంలో పోలీస్ స్టేషన్ బిల్డింగ్‌లు, రిసప్షన్ సెంటర్లను ఏర్పాటు చేసి, ఎవరైతే కంప్లయింట్‌దార్లు వస్తారో వారికి రిసప్షనిస్టు ద్వారా సకల మర్యాదలు చేసి వారి సమస్యలను పరిష్కారం చేసే విధంగా ప్రయత్నం చేస్తున్నాం. ఆ విధంగా పోలీస్ స్టేషన్లను తీర్చిదిద్దుతున్నామని మనవి చేస్తున్నాను. వరంగల్ పోలీస్ కమీషనరేట్‌ను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని మనవి చేస్తున్నాను. శాంతి భద్రతల పరిరక్షణకు నేరాల నిరోధనకు, నేర పరిశోధనకు, సైబర్ నేరాల అదుపు కోసం పోలీసు శాఖకు సిబ్బందికి కావాల్సిన ఆధునిక సామాగ్రిని గ్యాడ్జెట్స్‌ని సమకూర్చడం జరుగుతోంది. మెరుగైన సేవల కోసం ప్రతి పోలీస్ స్టేషన్‌కు నిధులు కేటాయిస్తున్నాం. హైదరాబాదు సైబరాబదు పోలీస్ స్టేషన్‌లలో ఒక్కొక్క దానికి నెలకు రూ. 75,000 చొప్పున జిల్లా కేంద్రాల్లో వున్న పోలీస్ స్టేషన్లకు రూ. 50,000 చొప్పున రూరల్ పోలీస్ స్టేషన్లలో రూ. 25,000 చొప్పున కేటాయించడం జరిగింది. భారతదేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో ఇటువంటి ఫెసిలిటీ లేదు ఇలాంటి కేటాయింపులు లేవు. ఈ తెలంగాణ రాష్ట్రమే మొట్టమొదటిసారిగా ఈవిధంగా నిర్ణయం తీసుకొని మా ముఖ్యమంత్రి గారు కేటాయింపులు చేశారు. గ్లీ పోలీస్ విధానం ప్రవేశ పెట్టాము, సిబ్బందికి ఈ విషయంలో ట్రైనింగ్ కూడా ఇస్తున్నాం. రాష్ట్రంలో షీ టీమ్‌లను ఏర్పాటు చేసి మహిళల రక్షణ కోసం మంచి మంచి కార్యక్రమాలు చేపడుతున్నాం. హైదరాబాద్‌లో 100 షీటీమ్‌లు వున్నాయి. మిగతా 9 జిల్లాలలో కూడా 100 షీటీమ్‌లను ఏర్పాటు చేసి మహిళలకు రక్షణగా ఈ కార్యక్రమాలు వుంటాయని మనవి చేస్తున్నాను.

ఉగ్రవాదులు, తీవ్రవాదులు, అసాంఘిక శక్తుల చర్యలలో చనిపోయిన గాయపడిన పోలీసు సిబ్బంది, ఆఫీసర్లకు ఇస్తున్న ఎక్స్‌గ్రేషియాను దేశంలో ఎక్కడా లేని విధంగా గణనీయంగా పెంచాము. కానిస్టేబుల్‌కు రూ. 25,00,000 నుంచి రూ. 40,00,000కు పెంచాము. Head constable నుంచి S.I. వరకు రూ. 25,00,000 నుంచి రూ. 40,00,000 వరకు పెంచాము. Inspector నుంచి Additional S.P. వరకు రూ. 30,00,000 నుంచి రూ. 50,00,000 వరకు చేశాము. S.P. నుంచి I.P.S. అధికారుల వరకు రూ. 30,00,000 నుంచి కోటి రూపాయల వరకు చేయడం జరిగింది. హోంగార్డులకు కొత్తగా రూ. 30,00,000 ఇచ్చేవిధంగా కూడా ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది. ఇప్పటికే 10,500 కానిస్టేబుళ్లను, 539 S.I. ల నియామకానికి 4 నోటిఫికేషన్లు ఇవ్వడం జరిగింది. ఈ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ఈ సంవత్సరం చివరికల్లా పూర్తవుతుంది. సివిల్ పోలీస్ ఫోర్స్‌లో మొట్టమొదటిసారిగా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం కూడా జరిగింది. కమల్‌నాథన్ కమిటీ ద్వారా పోలీసు శాఖ విభజన పూర్తి అయిన వెంటనే మిగిలిన ఖాళీలను భర్తీ చేస్తామని కూడా చెబుతున్నాం. ఈ రోజు హైదరాబాదు, సైబరాబాదుల్లోనే కాకుండా రాష్ట్రంలో చాలా అధునాతనమైనటువంటి కమాండెంట్ కంట్రోల్ బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసి టెర్రరిజం కాని రౌడీయిజం కాని గూండాయిజం కాని ఎక్కడ ఎప్పుడు జరిగినా హైదరాబాద్‌కు సమాచారం వచ్చే విధంగా కమాండెంట్ కంట్రోల్‌ను ఏర్పాటు చేసి, భారతదేశంలో ఎక్కడా లేని విధానాన్ని ముఖ్యమంత్రి గారు నిర్ణయించి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. అసాంఘిక శక్తులను కంట్రోల్ చేయడానికి, టెర్రరిజం గూండాయిజాన్ని కంట్రోల్ చేయడానికి పూర్తి సామర్థ్యంతో మా పోలీస్ డిపార్ట్‌మెంట్ పని చేస్తుందని మనవి చేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ బి. గణేష్‌గుప్తా: అధ్యక్షా హోం శాఖా మాత్యులు చాలా సుధీర్ఘంగా సమాధానం చెప్పారు, చాలా సంతోషం. రాష్ట్రవ్యాప్తంగా కొత్త వాహనాలు పెట్టామని, షీ టీమ్స్ ప్రవేశపెట్టామని పోలీస్ కమాండెంట్ సెంటర్ నిర్మిస్తున్నామని తద్వారా క్రైమ్ శాతం తగ్గించగలిగామని చెప్పడం చాలా సంతోషం. అయినప్పటికీ కూడా ఇంకా కొన్ని సందేహాలు వున్నాయి.

హైదరాబాద్‌లో ప్రధానంగా మహిళలను వేధిస్తున్నటువంటి సమస్య చైన్ స్నాచింగ్, మనకు తెలుసు ఒక మహిళ బయటకు వెళ్లాలంటే ఎప్పుడు ఎక్కడ నుంచి ఎవరు వచ్చి గొలుసు లాగుతారో అనేటువంటి భయం. మొన్న ఉస్మానియా యూనివర్సిటీ కేంపస్‌లో ఒక పాపను తీసుకొని వెళ్తుంటే చైన్ స్నాచర్ చైన్ లాగినప్పుడు ఆమె కింద పడి చనిపోవడం చూశాము. పేపర్లలో, టీవీలలో చూస్తున్నాం ఈ చైన్ స్నాచింగ్ మీద ఒక ప్రత్యేక శ్రద్ధ వహించాలి. వాటి గురించి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో మాకు కొంచెం సందేహం వుంది.

అదేవిధంగా యువత డ్రగ్స్ మత్తులో ఊరేగుతున్నారు. private coffee shopsలో, private restaurantలలో హుక్కా బార్స్ పేరుతో ఈ హుక్కా బార్స్‌ను రకరకాల ఫ్లేవర్స్‌తో పెట్టి దాని ముసుగులో డ్రగ్స్ అమ్ముతున్నారు. కాలేజ్ విద్యార్థులు వీటి

బారిన పడి తల్లితండ్రులకు కడుపుకోత మిగులుస్తున్నారు. కాలేజ్‌కు వెళ్లి క్షేమంగా ఇంటికి రావాల్సిన విద్యార్థులు కాఫీ షాప్‌లకు వెళ్లి డ్రగ్స్‌కు అలవాటు పడి మత్తులో మునిగి తేలుతున్నారు. దాని మీద కూడా పోలీస్ వ్యవస్థ చాలా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుంది. డ్రంక్ అండ్ డ్రైవ్ మీద పోలీస్ వ్యవస్థ చాలా కఠినంగా పని చేస్తున్నా ఇంకా కఠినతరం చేయాల్సిన అవసరం వుంది అధ్యక్ష. ఉదాహరణకు, మొన్ననే ఒక విషయం జరిగింది ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన మెడికల్ విద్యార్థులు విహారయాత్రకు వెళ్లి విజయవాడ నుంచి హైదరాబాద్ వస్తుంటే బస్సు చెట్టుకు గుద్దుకొని మెడికో విద్యార్థులు చనిపోయిన సంఘటన కూడా మనం చూశాము.

10.40 ఉ. అది కూడా డ్రైవర్ త్రాగిన మత్తులో ఉన్నాడు. అటువంటివి పునరావృతం కాకుండా చూడాలి. మొన్న యుకె, ఆస్ట్రేలియా నుండి పోలీసులు హైదరాబాద్‌కు వచ్చి, హైదరాబాదు పోలీసు వ్యవస్థ బాగుందని చెప్పారు. సంతోషం. ముఖ్యమంత్రిగారు సింగపూర్ వెళ్లినప్పుడు ఆ బృందంలో నేను కూడా ఉన్నాను. సింగపూర్‌లో పోలీసులు ఎక్కడా కనపడడం లేదని ముఖ్యమంత్రిగారు అడిగారు. అక్కడ ఎలాంటి లా అండ్ ఆర్డర్ ప్రాబ్లమ్స్ లేవు. ఆస్ట్రేలియా, యుకె నుండి పోలీసులు హైదరాబాదు పోలీసు వ్యవస్థను పరిశీలించడానికి వచ్చారు. ఆ విధంగా మన పోలీసు అధికారులు విదేశాలలో ఉన్న పోలీసు వ్యవస్థను పరిశీలించడానికి వెళతారు. అమెరికాలో ఫోన్ కాల్‌తో అలర్ట్ అవుతారు. అక్కడ జిపిఎస్ వ్యవస్థ అందుబాటులో ఉంది. ఒకసారి ఫోన్ రింగ్ చేసి కట్ చేసినా జిపిఎస్ వ్యవస్థ ద్వారా పోలీసులు వెంటనే స్పందిస్తారు. ఆ విధానాన్ని మన పోలీసులకు కూడా చూపించాలి.

మన దగ్గర ఎక్కువగా హై రెయిజ్ బిల్డింగ్స్ చాలా కడుతున్నారు. 20 నుండి 30 అంతస్థుల భవనాలు కడుతున్నారు. వారంతా ఫైర్ సేఫ్టీ మెజర్స్ పాటిస్తున్నారా, లేదా? ఎన్ని అంతస్థులు కట్టామా అనేది కాదు. హయ్యెస్ట్ ఫ్లోర్‌కు పర్మిషన్ ఇచ్చామో, ఆ ఫ్లోర్ వరకు ఫైర్ ఫైటింగ్ ఎక్విప్‌మెంట్‌ను కొనుక్కోవలసిన అవసరం ఉంది. అడిగిన ప్రశ్నలకు మంత్రిగారు సుదీర్ఘ సమాధానం ఇచ్చారు. వారికి నా ధన్యవాదాలు. ప్రభుత్వానికి మనం కూడా బాధ్యత ఉంటాము కాబట్టి మనకు కూడా గౌరవంగా ఉంటుందని తెలియ చేస్తున్నాను.

శ్రీ డి. చిన్నయ్య: సభకు నమస్కారం, రాష్ట్రంలో పోలీసు శాఖను బలోపేతం చేయడానికి మన ప్రభుత్వం పోలీసులకు డబ్బులు ఇచ్చి అవసరమైన చట్టాలు చేసి, బలాన్ని, అండదండలు ఇస్తే తప్పనిసరిగా వాళ్లు ఏమిటో ప్రూవ్ చేసుకునే అవకాశం పోలీసు అధికారులకు ఉంటుంది. అత్యాధునిక హంగులతో హైదరాబాదు, సైబరాబాదు కమీషనరేట్‌ల కార్యాలయాలతో కూడా పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనం నిర్మాణం చేపడుతామని మంత్రిగారు అంటున్నారు. అది ఎప్పటిలోగా పూర్తి అవుతుంది? వారు సమాధానం చెప్పాలని కోరుతున్నాను. జనవరిలో 9281 కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగింది. ఆ ప్రక్రియ ఎంతవరకు వచ్చింది? ఎప్పటి వరకు పూర్తి చేస్తారు? 1936 నుండి 1940 సంవత్సరాలలో మా ప్రాంతంలో కట్టినటువంటి పోలీసు క్వార్టర్సు శిథిలావస్థలో ఉన్నాయి. వారు అక్కడ భార్యాపిల్లలతో ఉండలేని పరిస్థితి ఉంది. వారికి కొత్తగా క్వార్టర్సు కట్టించి మంజూరు చేయవలసిందిగా కోరుతున్నాను. క్వార్టర్సు ఉంటే తప్ప రూరల్, మండలాలలో, అటవీ ప్రాంతంలో వాళ్లు ఉండలేరు. కాబట్టి తప్పకుండా దానిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని మనవి చేస్తున్నాను.

ఇక్కడే కాకుండా మా ప్రాంతంలోని మున్సిపాలిటీ, టౌన్‌లలో కూడా మా నిధుల నుండి సిసికెమేరాలను పెట్టడం జరిగింది. అలాగే షీ టీమ్స్ కూడా చాలా సమర్థవంతంగా పని చేస్తున్నాయి. నేను అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని కోరుతున్నాను.

శ్రీ సి. ధర్మారెడ్డి: అధ్యక్షా, అత్యాధునిక హంగులతో నిర్మిస్తున్న హైదరాబాదు, సైబరాబాదు కమీషనరేట్ కార్యాలయాలను, పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్ భవన నిర్మాణ పనులు చేపట్టామని చెప్పి మంత్రిగారు చెప్పారు. అవి ఎప్పటి లోగా పూర్తి అవుతాయి? ఈ పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్ వ్యవస్థను జిల్లాలకు కూడా అనుసంధానం చేసే అవకాశం ఆలోచిస్తున్నారా? లేదా? అలాగే తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న డబుల్ బెడ్‌రూమ్ పథకంలో పది శాతం పోలీసు కానిస్టేబుల్‌కు, ఎక్స్‌సర్వీస్ సిబ్బందికి కేటాయిస్తామన్నారు. దీనిని ఇంప్లిమెంట్ చేస్తున్నారు? ఎప్పటిలోగా చేస్తారు? తెలంగాణ రాష్ట్రంలో పోలీసులు ఉత్సాహంగా పని చేయడానికి కరప్షన్ ఫ్రీగా పని చేయాలని గౌరవ ముఖ్యమంత్రిగారు నగరంలో ఉన్న పోలిస్ స్టేషన్సుకు రూ.75వేలు, అర్బన్‌లో ఉన్న వాటికి రూ.50 వేలు, రూరల్‌లో ఉన్న వాటికి రూ.25వేలు అన్ని పోలీస్ స్టేషన్సుకు ఇస్తున్నామని చెప్పారు. అది రెగ్యులర్‌గా ఇస్తున్నారా, లేదా? ఇంతకు ముందు పోలీసు స్టేషన్‌కు ప్రజలు వెళితే, మా హోటల్ బిల్ కట్టండి, జిరాక్సు సెంటర్‌లో బిల్లు కట్టండని అడిగేవారు. దీని వల్ల అలా అడగడం తగ్గినట్టుగా తెలుస్తుంది. రెగ్యులర్‌గా ఆ డబ్బులు ఇస్తున్నారా?

మహిళల భద్రతకోసం హైదరాబాదు, సైబరాబాదు నగరంలో ఏర్పాటు చేసిన షీ టీమ్స్‌ను జిల్లాలకు మున్సిపాలిటీలకు పంచాయతీలకు కూడా ఇస్తే బాగుంటుంది. దానిని చేస్తారా, లేదా? పోలీసు శాఖలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలవుతుందా? కానిస్టేబుల్ పోస్టులు 9281 ఉన్నాయని పత్రికలలో చూశాము. నోటిఫికేషన్ వేసి, ఏప్రిల్ నెలలోపు ఫిలప్ చేస్తామన్నారు. ఎప్పుడు చేస్తారు? 2.5 కిమీ పరుగు పందాన్ని తగ్గించామని అన్నారు. అది ఎంత వరకు తగ్గిస్తారో తెలియ పరచాలి. అలాగే వయో పరిమితిని కూడా తగ్గించామన్నారు. దానిని తెలియ పరచవలసిన అవసరం ఉంది. జంట నగరాలలో ఎక్కడ ఏది జరిగినా క్షణంలో తెలిపే విధంగా ఏర్పాటు చేశామని గౌరవ మంత్రిగారు చెప్పారు. దానిని జిల్లాలకు కూడా విస్తరింప చేయాలని కోరుతున్నాను. అలాగే.........

శ్రీ నాయిని నర్సింహారెడ్డి: హైదరాబాదు సిటీలో నేరాల తగ్గుదల కోసం మిత్రులు ఇప్పుడే అడిగారు. హైదరాబాదు సిటీలో 2015 సంవత్సరానికి అంతకు ముందు సంవత్సరం 2014 తో పోలిస్తే 14 శాతం నేరాలు తగ్గుముఖం పట్టాయి. 2013వ సంవత్సరంలో 675 నేరాలు జరిగితే, 2014లో 523, 2015లో కేవలం 232, 2016 సంవత్సరంలో మరింత తగ్గాయి. గత రెండున్నర నెలల్లో పద్నాలుగు నేరాలే జరిగాయి. నేరాలన్నీ తగ్గుముఖం పట్టాయని మనవి చేస్తున్నాను.

అదే విధంగా హైదరాబాదులో హుక్కా సెంటర్లు అదుపునకు చర్యలు తీసుకుంటున్నాము. హుక్కా నేరాలపై తరచుగా దాడులు చేసి రూల్సుకు వ్యతిరేకంగా నడిపినా, మహిళలకు ప్రవేశం కల్పించినా కేసులు పెట్టడం జరుగుతోంది. చైన్ స్నాచింగ్ 2013లో 1015, 2014లో 776, 2015లో 352, 2016లో 45కి తగ్గడం జరిగింది. వీలైనంత వరకు వాటిని కంట్రోల్ చేయడానికి పూర్తిగా మా పోలీసు డిపార్ట్‌మెంట్ శాయశక్తులా పని చేస్తుంది. విదేశాలలో పోలీసు విధానాన్ని అధ్యయనం చేసి ఆ పద్ధతులను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయడం కోసం, మన రాష్ట్ర పోలీసులను విదేశాలకు పంపిస్తున్నాము. ముఖ్యమంత్రిగారు కూడా చెప్పారు. మీరు తప్పకుండా విదేశాలలో ఉన్న సిస్టమ్‌ను ఇక్కడకూడా ఇంప్లిమెంట్ చేయడానికి ప్రయత్నం చేస్తాము.

హైదరాబాద్‌లో జరిగిన కిడ్నాప్ హత్య కేసులో దర్యాప్తు ముమ్మరంగా సాగుతుంది. ఒకటి, రెండు రోజులలో నేరస్తులను పట్టుకొని కోర్టు ముందు ప్రవేశపెట్టడం జరుగుతుందని ఈ కేసులో ఆధారాలు లభించాయని సభ్యులకు మనవి చేస్తున్నాను.

10.50 ఉ. ప్రతి జిల్లాలో షీటీమ్స్ ఇప్పటికే పనిచేస్తున్నాయి. అవసరాన్ని బట్టి రాష్ట్రంలో ఇంకా షీటీమ్స్‌ను పెంచే ఏర్పాటు చేస్తామని మనవిచేస్తున్నాను. కమాండెంట్ కంట్రోల్‌కి సంబంధించి సభ్యులు అడుగుతున్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఉన్న మున్సిపాలిటీలలో కమాండెంట్ కంట్రోల్‌కి ప్రతి, నిమిషానికి సమాచారం వచ్చే విధంగా చర్య తీసుకుంటున్నాము. టెర్రరిజాన్ని, నక్సలిజాన్ని అదే విధంగా గుండాయిజాన్ని, రౌడీయిజాన్ని, దొంగతనాలను కంట్రోల్ చేయడానికి కమాండెంట్ కంట్రోల్‌కు సమాచారం వస్తుంది. ట్రాఫిక్‌కి సంబంధించి కూడా కమాండెంట్ కంట్రోల్‌కి సమాచారం వస్తుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి పోలీసు శాఖ చాలా పకడ్బందీగా లా అండ్ ఆర్డర్‌ను మెయింటెయిన్ చేస్తుంది. 18 నెలల్లో ఒక్క సింగిల్ ఇన్సిడెంట్ జరగకుండా, అవాంతర సంఘటనలు జరగకుండా మత సామరస్యాన్ని కాపాడుతూ, లా అండ్ ఆర్డర్‌ని మెయింటెయిన్ చేస్తున్నామని చెబుతూ సెలవు తీసుకుంటున్నాను.

ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ

ప్రశ్న నెం. 44(1432) సర్వశ్రీ/శ్రీమతి డాక్టర్ కె. లక్ష్మణ్ (ముషీరాబాద్), జి. కిషన్ రెడ్డి (అంబర్‌పేట), చింతల రామచంద్రారెడ్డి (ఖైరతాబాద్), శ్రీనివాస్ గౌడ్ (మహబూబ్‌నగర్), వేముల వీరేశం, చల్లా ధర్మారెడ్డి, డి.కె. అరుణ (గద్వాల్), రమావత్ రవీంద్రకుమార్ (దేవరకద్ర) – గౌరవనీయులైన ఆర్థిక, ప్రణాళిక శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ. రాష్ట్రంలోని వివిధ శాఖలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం వాస్తవమేనా?

ఆ. అయితే, క్రమబద్ధీకరించాలని ప్రతిపాదించినట్టి కాంట్రాక్టు ఉద్యోగుల జిల్లావారీ వివరాలు మరియు దీని ద్వారా రాష్ట్రఖజానాపై పడుతున్న భారం ఎంత

ఇ. పొరుగుసేవల ఉద్యోగులకు రూ.15,000/-ల కనీస వేతనాను అమలుపరుస్తామని ప్రభుత్వం వాగ్దానం చేసిన విషయం వాస్తవమేనా మరియు ఈ విషయంలో రాష్ట్ర ఖజానాపై పడుతున్న భారం ఎంత,

ఈ. అయితే దానిని అమలుపరచడానికి తీసుకున్న చర్యలేమిటి, అయ్యే అదనపు వ్యయమెంత?

ఆర్థిక, ప్రణాళిక శాఖ మంత్రి (శ్రీ ఇ. రాజేందర్) అ. అవునండీ. 1994, తెలంగాణ ప్రభుత్వ సేవలకు నియామకాల క్రమబద్ధీకరణ, సిబ్బంది స్వరూపం, వేతన విధానం హేతుబద్ధీకరణ) చట్టం (1994 లోని 2 వ చట్టం) లోని 10 ఎ విభాగంలో

నిర్దిష్టపరిచిన షరతులను నెరవేర్చిన వ్యక్తుల సేవలను క్రమబద్ధీకరించడమవుతుంది.

ఆ. జిల్లా వారీగా వివరాలు, ఖజానాపై పడే అదనపు ఆర్థిక భారం క్రమబద్ధీకరణ కోసం అర్హులైన వ్యక్తులను గుర్తించే ప్రక్రియ పూర్తయిన తర్వాత మాత్రమే తెలుస్తుంది. ఈ ప్రక్రియ కొనసాగుతున్నది.

ఇ.ఈ. ప్రభుత్వం 19-02-2016 తేదీగల ఆర్థిక (హెచ్ఆర్ఎం. 1) అ శాఖ, జీఓఎంఎస్‌నెం. 14 ద్వారా రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేస్తున్నట్టి అవుట్‌సోర్సింగ్ / కాంట్రాక్టు సిబ్బందికి కనీస పారితోషకాన్ని నెలకు రూ. 12,000/- లకి పెంచింది. రాష్ట్రఖజానాపై సంవత్సరానికి మొత్తం మీద రూ. 310.00 కోట్ల భారం పడుతున్నది.

డాక్టర్ కె. లక్ష్మణ్: అధ్యక్షా, ఇది చాలా ప్రాముఖ్యత కలిగిన అంశం. ప్రభుత్వం అధికారంలోకి రాకముందు, ప్రధానంగా నిరుద్యోగ యువకుల యొక్క సమస్యను పరిష్కరించడానికి ఖాళీగా ఉన్న లక్షలాది ప్రభుత్వోద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. రాష్ట్రంలో పనిచేసే రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో అయితేనేమి, కేంద్రప్రభుత్వ సంస్థలైతేనేమి కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేసే వారిని క్రమబద్ధీకరిస్తాము, ఆ రకంగా అందరికీ ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తామని స్పష్టంగా ఎన్నికల ముందు, ఉద్యమ సందర్భంలో చెప్పిన విషయాన్ని మనం దృష్టిలో పెట్టుకోవాలి. ముఖ్యంగా ఒకవైపు చదువుకున్నటువంటి యువకులు చాలా మంది డిగ్రీలు పూర్తి చేసి ఉన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డి, బీటెక్, ఎంటెక్ లాంటి అర్హత కలిగిన వారు జూనియర్ లెక్చరర్స్, డిగ్రీ లెక్చరర్స్ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. 2008 లో జూనియర్ లెక్చరర్స్‌కి సంబంధించి నోటిఫికేషన్ వచ్చింది, మళ్లీ ఇప్పటివరకూ రాలేదు. 2011 లో డిగ్రీ లెక్చరర్స్‌కి సంబంధించిన నోటిఫికేషన్ వచ్చింది. గ్రూప్.1, గ్రూప్.4, నోటిఫికేషన్స్ కోసం యువత ఎదురుచూస్తున్నారు. లక్షా ఏడు వేల ఉద్యోగా భర్తీ గురించి ముఖ్యమంత్రి గారు ప్రకటిస్తారని యువత కళ్లల్లో ఒత్తులు పెట్టుకొని ఎదురుచూస్తున్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు సంబంధించిన అంశంలో, రాష్ట్ర ప్రభుత్వం, పబ్లిక్ సర్వీస్ కమీషన్‌కి సంబంధించి 94 చట్టంలోని సెక్షన్ 10కి కొన్ని మార్పులు తీసుకొచ్చి ఆ కాంట్రాక్ట్ ఉద్యోగులను కూడా క్రమబద్ధీకరిస్తామనే అంశం ఈరోజు ప్రభుత్వం ముందుకు రావడం జరిగింది. క్రమబద్ధీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ విధివిధానాలు ఏమిటి? ఎవరిని క్రమబద్ధీకరిస్తున్నారు, ఏ స్థాయి వారిని క్రమబద్ధీకరిస్తున్నారు? క్రమబద్ధీకరణకు సంబంధించి రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ విధానం, సీనియారిటీ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నారా? ఎన్ని శాఖల్లో ఇప్పటివరకూ క్రమబద్ధీకరణకు సంబంధించి ఉద్యోగులను గుర్తించారు? ఎంతమందిని క్రమబద్ధీకరిస్తున్నారు అనే అంశంపై ఇంకా ప్రభుత్వానికి స్పష్టత రాలేదు. రాష్ట్రప్రభుత్వానికి సంబంధించిన సంస్థలలో పనిచేసే కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ కాకుండా కేంద్రప్రభుత్వ సంస్థలలో పనిచేసే సర్వశిక్షఅభియాన్ రిసోర్స్ పర్సన్స్, ఐసీడీఎస్ ఉద్యోగులు అదే విధంగా తెలంగాణ వయోజన విద్య, విద్యుత్ శాఖల్లో పనిచేసే కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ విషయమై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. లక్షా ఏడు వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి, వాటిని భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి గారు హామీ ఇచ్చిన తరువాత, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేసే సమయంలో లక్షా ఏడు వేల నుండి ఆ ఉద్యోగాల సంఖ్య యాభై వేలకు కుదించబడుతుంది, దాదాపు నలభై, యాభై వేల ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తున్నామని ఆర్థిక శాఖా మంత్రి గారు చెప్పడం జరిగింది. భిన్నమైన అభిప్రాయాలతో రాష్ట్రప్రభుత్వం నిరుద్యోగ యువకులను గందరగోళంలో పడేసే విధంగా చేస్తుంది. గ్రూప్.2 కి సంబంధించి నిరుద్యోగులు కనీసం ఇంటర్వ్యూలను ఎత్తివెయ్యాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వం ఆ విధంగా ముందుకు రాకపోవడం వల్ల వాళ్లలో అశాంతి, ఆవేదన పెరుగుతుంది. ఎంత మందిని క్రమబద్ధీకరిస్తున్నారు, ఏ స్థాయి వాళ్లను క్రమబద్ధీకరిస్తున్నారు, డీఎస్సి, గ్రూప్. 1 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఎప్పుడిస్తున్నారు? నిరుద్యోగ యువకులు చాలా ఆవేదన చెందుతున్నారు కాబట్టి క్రమబద్ధీకరణ విషయంలో ప్రభుత్వం స్పష్టంగా వివరించాలని ఆర్థిక మంత్రి గారిని అడుగుతున్నాను. ఏ స్థాయి వాళ్లను క్రమబద్ధీకరిస్తున్నారు, క్రమబద్ధీకరణకు పాటించే విధివిధానాలు ఏమిటని మీ ద్వారా అడుగుతున్నాను.

శ్రీ వి. శ్రీనివాస్ గౌడ్ : అధ్యక్షా, ఎంతో ఉన్నత చదువు చదువుకొని అనేక సంవత్సరాలుగా వెట్టిచాకిరి చేసి, ఆందోళనకు గురైన కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తున్నామని నిర్ణయం తీసుకున్నందుకు గౌరవ ముఖ్యమంత్రి గారికి, మంత్రి గారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. కాంట్రాక్ట్ ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులని రకరకాల ఉద్యోగులు ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్నారు. ముందు కాంట్రాక్ట్ పద్ధతిన ఉద్యోగులను తీసుకున్నారు, ఆ తరువాత అవుట్‌సోర్సింగ్ పద్ధతిన ఉద్యోగులను తీసుకున్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు మొదట రిక్రూట్ అయ్యారు. వుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న వారిని కూడా కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పరిగణించాలని మనవి చేస్తున్నాను. భవిష్యత్‌లో కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేస్తున్నామని చెప్పడం జరిగింది. ఆ విధంగా వెంటనే నిర్ణయం తీసుకొని ప్రతి సంవత్సరం ఒక షెడ్యూల్ తయారు

చేసి రిక్రూట్‌మెంట్ చేయడానికి అవకాశం కల్పించవలసిందిగా నేను కోరుతున్నాను. కాంట్రాక్ట్ లెక్చరర్స్ విషయంలో గందరగోళం ఏర్పడింది. చిన్న అంశాలకు కొర్రీ వేస్తూ కాంట్రాక్ట్ లెక్చరర్స్‌ను ఇబ్బందులకు, అవాంతరాలకు గురిచేస్తున్నారు. దానిని సరిచెయ్యాలి. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కూడా ఆందోళనలో ఉన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల విషయంలో, వాళ్లకు కనీసం ఉద్యోగ భద్రతను కల్పించాలని, వాళ్లను రెగ్యులరైజ్ చెయ్యకపోయినా వాళ్లకు భరోసా ఇచ్చే అవకాశం ప్రభుత్వపరంగా ఉంది కనుక కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ తొందరగా రెగ్యులరైజ్ చెయ్యాలని, ఒక టైమ్ షెడ్యూల్ పెట్టుకొని ఆ టైమ్‌లో కంప్లీట్ చేసే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవలసిన అవసరం ఉంది. జీహెచ్ఎంసీ, మెట్రో వాటర్ వర్క్స్ సంస్థల్లో పనిచేసే వారు ముందు కాంట్రాక్ట్ పద్ధతిన రిక్రూట్ అయ్యారు, ఆ తరువాత వారిని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా కన్వర్ట్‌చేశారు. ఏజ్ బార్ అయిన చాలా మంది అవుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్నారు, వాళ్లను పర్మినెంట్ చెయ్యకపోయినా, వారికి ఉద్యోగ భద్రత కల్పించి, రిటైర్డ్ అయ్యే వరకూ వారు పనిచేసే విధంగా ప్రత్యేకంగా జీఓ తీసుకురావాలని, అవసరమైతే చట్టాన్ని సవరించాలని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

11.00 ఉ. శ్రీమతి డి.కె. అరుణ: అధ్యక్షా, తెలంగాణ ఉద్యమం సమయంలో గానీ ఎన్నికల ముందు గానీ ఇప్పుడు అధికారంలో ఉన్న టీ.ఆర్.ఎస్ పార్టీ నిరుద్యోగులకు, కాంట్రాక్టు ఉద్యోగులు, టెంపరరీ ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆ వర్గాలవారికి మేలు చేస్తామని, ఇంటికొక ఉద్యోగం ఇస్తామని, అదే విధంగా కాంట్రాక్టు ఉద్యోగులు, టెంపరరీ ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని చెప్పారు. అంతే కాకుండా ఐకెపి, ఐసిడిఎస్ వంటి వివిధ సెక్టార్లలో పనిచేస్తున్న ఉద్యోగులను కూడా రెగ్యులరైజ్ చేస్తామని చెప్పినందున ఆ రంగాలకు చెందిన ఉద్యోగులు ఆనాడు తెలంగాణ ఉద్యమంలో పెద్దఎత్తున పాల్గొన్న విషయాన్ని ఈ సందర్భంగా మరోసారి గుర్తుచేస్తున్నాను.

మరీ ముఖ్యంగా ఐకెపి ఉద్యోగులు ఆనాడు పెద్దఎత్తున మహిళలను తీసుకొచ్చి తెలంగాణ ఉద్యమానికిస్ఫూర్తినిచ్చిన విషయం కూడా ప్రభుత్వం మర్చిపోయింది. నేను మంత్రిగారిని కోరేదేమిటంటే మొత్తం ఈ రాష్ట్రంలో ఎంతమంది కాంట్రాక్టు ఉద్యోగులున్నారు, ఇప్పటివరకు ఎంతమందిని గుర్తించారు? ఎంతమంది అవుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్నారు, ఎంతమందిని ఇప్పటివరకు గుర్తించారు? అదే విధంగా స్పెషల్ ప్రాజెక్టుల కింద పనిచేస్తున్న ఐకెపి, అదే విధంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో ఐసిడిఎస్‌లో పనిచేస్తున్న వారు గానీ అదే విధంగా ఇతర స్కీంలలో కూడా చాలామంది వివిధ కేటగిరీలలో పనిచేస్తున్నారు. సదరు రంగాలలో పనిచేస్తున్న వారిని ఎంతమందిని గుర్తించారు? ఫుల్‌టైం స్కేల్ పొందుతున్న టెంపరరీ ఉద్యోగులు ఎంతమంది ఉన్నారు? మన లెజిస్లేటివ్ డిపార్ట్‌మెంటులో కూడా వితవుట్ రెగ్యులరైజేషన్ దాదాపు 20 సంవత్సరాల నుంచి 33 మంది స్మాల్‌టైం ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని ఎప్పటిలోగా రెగ్యులరైజ్ చేస్తారు? 30 రోజులలో ఒక్కరోజు కూడా బ్రేక్ లేకుండా పనిచేసిన వారిని రెగ్యులరైజ్ చేయాలని 1996 సబార్డినేట్ సర్వీస్ రూల్స్ కూడా చెబుతున్నాయి. కాబట్టి ఎప్పటిలోగా వారిని రెగ్యులరైజ్ చేస్తారని అడుగుతున్నాను.

ఉద్యమ సమయంలో నిరుద్యోగులు తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే నిరుద్యోగులందరికీ ఉద్యోగాలొస్తాయని ఆశపడి ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఈ ప్రభుత్వం ఎన్నికల ముందు శాసనసభలో చెప్పిన లెక్కల ప్రకారం 1 లక్షా 07వేల ఉద్యోగాలు ఖాళీలున్నాయని మంత్రిగారు చెప్పారు. ఇప్పుడేమో కేవలం 58వేలకు ఆ సంఖ్యను కుదించారు. ఈ ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుద్యోగులకిచ్చిన హామీని నిలబెట్టుకుంటుందా లేదా? ఒకవేళ నిలబెట్టుకుంటే ఎప్పటిలోగా నిలబెట్టుకుంటుందని నేను ఈ సందర్భంగా ప్రశ్నిస్తున్నాను.

శ్రీ ఆర్. రవీంద్ర కుమార్ (మైకు లేకుండా): అధ్యక్షా, ఒక నిమిషం అవకాశమివ్వండి.

మిస్టర్ స్పీకర్: పేర్లు ఉన్న ప్రతి ఒక్కరికీ అవకాశమివ్వాలంటే ఎలాగండీ? ఒక్క క్వశ్చన్‌లో ఎంతమందికి అవకాశమిస్తారండీ. రవీంద్రకుమార్ గారూ మీకు ఫర్దర్‌గా ఏమైనా క్లారిఫికేషన్ కావాలంటే మీ ఒక్కరికే అవకాశమిస్తాను, కూర్చోండి.

శ్రీ ఈటెల రాజేందర్: రవీంద్ర కుమార్ గారూ నేను సమాధానం చెప్పిన తరువాత మీరు సప్లిమెంటరీ అడగండి. ఉద్యోగ నియామకాలకు సంబంధించి అత్యంత ముఖ్యమైన పనిగా మా ప్రభుత్వం భావిస్తున్నది. ఈ సమావేశాలలోనే ఈ ప్రశ్నకు ఒకసారి సమాధానం చెప్పాను. గౌరవ ముఖ్యమంత్రి గారు కూడా ఇదే అంశం మీద సమగ్రమైన వివరణ ఇవ్వడం కూడా జరిగింది. అయినప్పటికీ గౌరవ సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలన్నింటికీ ఒక్కొక్కటిగా సమాధానం చెబుతాను. ఎందుకంటే నేను కూడా ఆనాటి ఎమ్మెల్యేగా తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఫ్లోర్ లీడర్‌గా ఇందిరాపార్కు దగ్గర నిరుద్యోగులు చేసిన అనేక ధర్నాలలో పాల్గొన్నాను. అంతే కాకుండా తెలంగాణ ఉద్యమంలో నీళ్లు, నిధులు, నియామకాలు చాలా ముఖ్యమైన అంశం.

1969లో ఉద్యోగాల కోసమే ఉద్యమం జరిగింది. కాబట్టి తప్పకుండా ఈ సమస్య పరిష్కారం కావాలని మనసునిండా కోరుకుంటున్న విషయాన్ని గౌరవసభ్యులకు తెలియజేస్తున్నాను. ఉద్యోగాల భర్తీ గురించి మొన్న పదేపదే సభలో ప్రశ్నించారు. ఇవ్వాళ కూడా అదే ప్రశ్నను లేవనెత్తారు. మొన్నటి ప్రశ్న నెం.103 నేను సమాధానం చేసినదాంట్లో చాలా క్లియర్‌గా ఉన్నది. However, the number of vacancies may change depending on the allocation of the employees as per the exigencies of the posts అని చెప్పాను. ఆనాడు కూడా 5 లక్షల 23వేల 675 పోస్టులు మనకు అలకేట్ చేసినట్లుగా, దాంట్లో దాదాపుగా 1 లక్షా 07వేలు ఖాళీలు ఉన్నట్లుగా అప్పుడు సమాధానం చెప్పాను. మొన్న కూడా అదే సమాధానం చెప్పాను, ఇప్పుడు కూడా అదే చెబుతున్నాను. నేను డీవియేట్ చేసే ప్రయత్నం గానీ అంకెల గారడీ చేసే ప్రయత్నం గానీ చేయలేదని గౌరవ సభ్యులకు విజ్ఞప్తి చేస్తున్నాను. అవసరమనుకుంటే నేను సంబంధిత ప్రతిని గౌరవ సభ్యులకు పంపిస్తాను.

రెండవది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలంటే చాలా ప్రతిబంధకాలున్నాయి. కాబట్టి ఆ ప్రతిబంధకాల తొలగింపు కోసం కొన్ని నియమనిబంధనలను పెట్టడం జరిగింది. వాటిని మొత్తం చదవమంటే సభలో చదువుతాను. కానీ అందులో కొన్ని మాత్రమే చదివి వినిపిస్తాను. Regularization of services of persons appointed on contract basis అని క్లియర్‌గా చెప్పడం జరిగింది. The Government may regularize the services of the persons appointed on contract basis against the sanctioned posts in the Government. దీనికి ఆరు విధివిధానాలను రూపొందించడం జరిగింది. దీంట్లో మంజూరు చేసిన పోస్టులు అంతంత మాత్రమే. (1) మంజూరు చేసిన పోస్టుల భద్రత (2) టైం స్కేల్ కాకుండా ఫుల్‌టైం ప్రాతిపదికన పనిచేస్తున్న వారు మాత్రమే (3) తేది.2.6.2014 నాటికి సదరు ఉద్యోగి పనిచేస్తూ ఉండాలి. (4) గైర్హాజరైన వారు అనర్హులు, క్రమశిక్షణ కింద తొలగించబడిన వారు రెగ్యులరైజేషన్‌కు అనర్హులు (5) ఆనాడు కాంట్రాక్టు ఉద్యోగ నియామకాలు జరిగేటప్పుడు రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండా ఉంటే తప్పనిసరిగా వేరేవారికి అన్యాయం జరగడానికి ఆస్కారముంటుంది కాబట్టి రిజర్వేషన్ వర్తించే అభ్యర్థులు లేనియెడల బ్యాక్‌లాగ్ పోస్టులను ఖాళీలుగా పరిగణిస్తామని చెప్పాం. మొత్తంగా చూస్తే 25,589 పోస్టులు. జిల్లాలవారీగా కూడా చెప్పమంటే చెబుతాను. కాంట్రాక్టు బేసిస్‌లో నియామకమైన వారి సంఖ్య జిల్లావారీగా చూస్తే మహబూబ్‌నగర్ 4134, రంగారెడ్డి 1243, హైదరాబాదు 3193, మెదక్ 2391, నిజామాబాద్ 1422, ఆదిలాబాద్ 2813, కరీంనగర్ 3089, వరంగల్ 1930, ఖమ్మం 3207, నల్గొండ 2167 మొత్తం కలిపితే 25,589 మంది కాంట్రాక్టు ఉద్యోగులున్నారు.

11.10 ఉ. దీంట్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల గురించి చెప్పారు. పెంచిన జీతాల ద్వార దాదాపుగా 50,000 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు లబ్ధి పొందారు. దీని వలన రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై రూ.310 కోట్ల రూపాయల భారం పడుతుంది. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు గతంలో లోయెస్ట్ సాలరీ రూ.6,700, రూ.6,900, రూ.7,100, రూ.7,500, రూ.7,740 గా ఉన్నాయి. వీటన్నింటిని కలిపి కనీస వేతనంగా రూ.12000 గా కనీస వేతనాన్ని నిర్ణయించడం జరిగింది. రెండో రకమైన కేటగిరీలో లోయెస్ట్ సాలరీ వేతనం రూ.8,440, రూ.9,200, రూ.9,460, రూ.10,420 గా ఉండగా వీటన్నింటిని కలిపి రూ.15,000 గా రెండవ కేటగిరీకి నిర్ణయించడం జరిగింది. మూడవ కేటగిరీలో లోయెస్ట్ సాలరీ రూ.11,530 గా ఉన్నది. రూ.11,860, రూ.12,550, రూ.12,910, రూ.13,660గా ఉన్నాయి. వీటన్నింటిని కలిపి రూ.17,500 గా మూడో కేటగిరీకి నిర్ణయించడం జరిగింది. కేటగిరీ1, కేటగిరీ2, కేటగిరీ3 ల్లో లోయెస్ట్ సాలరీ కలిగిన వారే అధికంగా ఉన్నారు. ఫస్ట్ కేటగిరి వాళ్లకు 79.10 శాతం, రెండో కేటగిరి వాళ్లకు 88.44 శాతం, మూడో కేటగిరి వాళ్లకు 60.55 శాతంగా జీతాలు పెరిగాయని తమరి ద్వార మనవి చేస్తున్నాను. ఈరోజు, ఆనాడు, మొన్న అడిగిన ప్రశ్నకు 107,744 ఖాళీలు ఉన్నాయని ఆనాడు, ఈనాడు చెప్పాము. దీంట్లో ప్రభుత్వ పరమైన పర్మినెంట్ ఉద్యోగుల సంఖ్య 3,01,289, కాంట్రాక్టు ఉద్యోగుల సంఖ్య 25,589, ఎన్ఎమ్ఆర్ ఉద్యోగుల సంఖ్య 8,192, గౌరవ వేతనం పొందే ఉద్యోగుల సంఖ్య 80,861 దీంట్లో కేంద్ర ప్రభుత్వం నుంచి గౌరవవేతనం పొందే ఉద్యోగులు ఉంటారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కాకుండా మొత్తం 4,15,931 మంది ఉద్యోగులు ఉన్నారు. నియమకాలు చేపట్టాలని అన్ని డిపార్ట్‌మెంట్‌లకు ఉత్తరాలు వ్రాయగా మాకొచ్చిన సమాచారం ప్రకారం 58,831 పోస్టులు ఉన్నాయని తెలిసింది. ఇంకా కొంత కూడా ఉండవచ్చు. 56,150 పోస్టులు మరియు జెన్‌కో పోస్టులను కలిపి 58,831 గా ఉన్నాయి. 107,744 పోస్టుల్లో 55831 ఖాళీలు ఉన్నట్లుగా ఇప్పటివరకు మాకు సమాచారం వచ్చింది. ఇది కాకుండా, దాదాపుగా 16,280 కొత్త పోస్టులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రియేట్ చేయడం జరిగింది. ఈ రోజు అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ మరియు కో-ఆపరేషన్ డిపార్టుమెంటుల్లో 1000 పోస్టులను క్రియేట్

చేయడం జరిగింది. 18,423 పోస్టులను రిక్రూట్‌మెంట్ చేయమని ఉత్తర్వులు ఇవ్వగా కొన్ని నియమకాలు ఇప్పటికే జరిగాయి, మిగతావి ప్రాసెస్‌లో ఉన్నాయని తమరి ద్వార తెలియజేస్తున్నాను. ఈ 18,423 పోస్టులకు తోడుగా ముఖ్యమంత్రి గారు చెప్పిన విధంగా డిఎస్సీ ద్వార మరో 10,927 పోస్టులను క్రియేట్ చేయడానికి ఉత్తర్వులను ఇప్పటికే జారీ చేయడం జరిగింది. స్యాంక్షన్ చేసిన రెసిడెన్షియల్ స్కూల్స్ కోసం 2044 పోస్టులను భర్తీ చేయడానికి ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ఇప్పటికే ఒక డిపార్ట్‌మెంట్‌లో 2650 పోస్టులను, 3950 ఆర్‌టిసిలో, 4500 ఉద్యోగాలు సింగరేణిలో భర్తీ చేస్తూ ఇప్పటికే మొత్తంగా 11,100 పోస్టులను భర్తీ చేయడం జరిగిందనే విషయాన్ని మీ ద్వార గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమితి ఉద్యమ పోరాట సమయంలో, ఏ సమయంలోనైనా ప్రాక్టికల్‌గా మాట్లాడింది, ఏది పడితే దానిని మాట్లడలేదు. ఏది పడితే అది మాట్లాడే పార్టీ కాదు. జిమ్మేదారి కలిగిన పార్టీ, బాధ్యత కలిగిన పార్టీ. ఎప్పుడూ జిమ్మేదారి తనంతో మాట్లాడాం. ఇంటికో ఉద్యోగమిస్తామని చెప్పారని పదేపదే చెబుతున్న మాట సత్యదూరమైనది. అలాంటి మాటలను ప్రస్తావించకూడదని విజ్ఞప్తి చేస్తున్నాను. కేంద్ర ప్రభుత్వంలో అంగన్ వాడి టీచర్లు పని చేస్తున్నారు. అంగన్ వాడి టీచర్లకు నెలకు రూ.4,800, ఆయాలకు రూ.2550 లుగా ఉన్నది. ఈనాడు కేంద్ర ప్రభుత్వం ఆ శాఖకు 15,800 కోట్ల రూపాయల బడ్జెట్‌ని పెట్టి సగానికి సగం రూ.8000 కోట్లకు నిధులను తగ్గించినప్పటికీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సాహసోపేతంగా అంగన్ వాడి జీతాలను పెంచడం జరిగింది. దీని వల్ల రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై రూ.400 కోట్ల రూపాయల మేరకు భారం పడుతుంది. ఈ విధంగా పెంచిన చరిత్ర ఎవరిదని అడుగుతున్నాను. డా.లక్ష్మణ్ గారి పార్టీనే కేంద్రంలో అధికారంలో ఉన్నది. కావున, వారిని ఈ విధంగా అడుగుతున్నాను. కేజీబివి, మోడల్ స్కూలు మొదలైన వాటిని కట్టకముందే, వాటి ఫలితం రాక ముందే మీరు వదిలేశారు. మీరు మోడల్ స్కూల్స్ వ్యవస్థని, కేజీబివి పాఠశాలలని ఎత్తేసినప్పటికీ, మీకు జిమ్మేదారితనం లేకపోయినప్పటికి ప్రభుత్వం తరపున డబ్బులను అలకేట్‌చేసి వాటిని సమున్నతంగా నడుపుతున్నాము. ఆశా వర్కర్లు కేంద్ర ప్రభుత్వ పథకంలో పనిచేస్తున్నారు. వారి జీతాలను పెంచాలని మా ఎమ్.పిల బృందంతోబాటుగా, స్వయంగా నేను కేంద్ర ప్రభుత్వం దగ్గరికి వెళ్లి ఆ విధమైన ప్రయత్నం చేశాను. ఈ రోజు వెట్టిచాకిరి చేయింది మీరే. 4000 మంది కంటిన్‌జెంట్ ఉద్యోగులకు కేవలం నెలకు రూ. 1600చొప్పున చెల్లించి 20-25 సంవత్సరాలు పని చేయించుకున్నది, శ్రమ దోపిడి చేసింది ఎవరని ప్రశ్నిస్తున్నాను. ఈరోజు వారందరికి ఏదో రకమైన పరిష్కారం దొరకాలి, వాళ్ల కన్నీళ్లను తుడవాలని, కనీసం ప్రభుత్వం ఉద్యోగం ఉందన్న భద్రత కలిగించడానికి సంకల్పంతో రాష్ట్రప్రభుత్వం పని చేస్తుంది. మీలాగా కాంట్రాక్టు వ్యవస్థ, ఔట్ సోర్సింగ్ వ్యవస్థను పెట్టి వెట్టి చాకిరి చేయించి, శ్రమ దోపిడికి పాల్పడే దౌర్భాగ్య పరిస్థితి కోసం తెలంగాణ ప్రభుత్వం పనిచేయదని మనవి చేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ : లక్ష్మణ్ గారూ, క్లారిఫికేషన్‌లను సూటిగా అడగండి.

డా.కె.లక్ష్మణ్: అధ్యక్షా, తమ వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి మంత్రి గారు సుదీర్ఘమైన ఉపన్యాసం ద్వార సమాధానం చెప్పారు. 5,23,000 మంది ప్రభుత్వోద్యుగులు, 25,589 మంది కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారని చెప్పారు. ఆ కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ విషయంలో ఉన్న ప్రతిబంధకాలను పరిశీలన చేస్తున్నామని చెప్పారు. ఔట్‌సోర్సింగ్ ద్వార 50,000 మంది పనిచేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వ సంస్థల ద్వార మన రాష్ట్రప్రజలకు సేవలందిస్తున్న వారి సంఖ్య 80,000 మందని వారు చెప్పారు. లక్ష ఏడువేల ఉద్యోగాల భర్తీ విషయంలో ఎక్కడా కూడా క్లారిటి ఇవ్వలేదు. డీఎస్సిలో 10,000వేల ఉద్యోగాలు ఉన్నాయని, భర్తీ చేస్తామని చెబుతున్నారు. ఇప్పటికే రెండు సంవత్సరాల సమయం అయిపోయింది. మూడో విద్య సంవత్సరం కొనసాగుతోంది. ఈరోజ కొత్తగా రెసిడెన్షియల్ పాఠశాలలు గురించి చెబుతున్నారు. ఈ రోజు ప్రభుత్వ పాఠశాలలన్నీ అధ్వాన్న పరిస్థితిలో ఉన్నాయి. టీచర్‌లు లేక ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయి. రేషన్‌లైజేషన్ పేరుమీద టీచర్ల సంఖ్యని తగ్గించే ప్రయత్నం చేశారు.

11.20 ఉ. ప్రభుత్వ పాఠశాలలో పిల్లల సంఖ్య పెంచి దానికి అనుగుణంగా టీచర్ల నియామకం చేస్తామనడానికి బదులుగా రేషనలైజేషన్ పేరు మీద ఏదో ఒక వంకతో టీచర్లను కుదించే కుట్రపూరితమైన చర్యల విషయం లోకమంతా కోడై కూస్తున్నది.

మిస్టర్ స్పీకర్ : లక్ష్మణ్ గారూ, ఇంత అవకాశం ఇచ్చిన తరువాత lengthy speech అంటే.... మీరు నోటీసు ఇవ్వండి ఇంకో ఫామ్‌లో చూద్దాం.

డా.కె. లక్ష్మణ్ : అధ్యక్షా, చెప్పనివ్వండి మంత్రి గారు అంత సేపు చెప్పినప్పుడు నన్ను చెప్పనివ్వండి. నేను వాస్తవాలు చెబుతున్నాను. 16వేల కొత్త పోస్టులు అని అన్నారు. .....

శ్రీ ఈటల రాజేందర్ : అధ్యక్షా, చెప్పిన తరువాత కూడా ఆ విషయమే మరల మరల ప్రసంగిస్తున్నారు.

డా.కె. లక్ష్మణ్ : అధ్యక్షా, మంత్రిగారు చెప్పిన దానికే నేను చెబుతున్నాను. 16వేల కొత్తపోస్టులు అని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఎవరికోసం పని చేస్తున్నాయని నేను అడుగుతున్నాను. మన రాష్ట్ర ప్రజల కోసం, మన రాష్ట్ర ప్రజల బాగోగుల కోసం కాదా? అంగన్‌వాడి, ఆశ ఇంకా ఇతరత్రా సంస్థలు అందించే ఆరోగ్య సేవలు మన కోసం కాదా? నిజంగా ఆ సేవలు అవసరం లేకపోతే రద్దు చేసేయండి, పథకాలను వదిలేసుకోండి. కేవలం జీతాలు ఇవ్వడమే కాదు, చాలా మంది ఫుల్ టైమ్ స్కేల్‌తో 10-15 సంవత్సరాలుగా పని చేస్తున్నారు. వారి గురించి మీరు ఏమి ఆలోచిస్తున్నారు.

(ట్రెజరీ బెంచ్‌ల నుండి అంతరాయం)

పాఠశాలల్లో గాని, ఆసుపత్రుల్లో గాని సిబ్బంది కొరత మరియు సిబ్బంది కొరత వల్ల, టీచర్ల నియామకాలు లేనందున, వారి సేవలు పూర్తిగా అందక అక్కడి పరిస్థితి చాలా దారుణంగా మారుతోంది. బడ్జెట్ ప్రవేశ పెట్టిన తరువాత ఇది 3వ సంవత్సరం. ఇప్పుడు కూడా నియామకాల గురించి మాట్లాడకుండా, కొత్త నియామకాల గురించి గాని, విఆర్‌ఓల గురించి గాని, డిఎస్‌సి గురించి గాని, జూనియర్ లెక్చరర్ల గురించి గాని మాట్లాడకుండా మీరు చెప్పిందే చెప్తున్నారు. మీరు ఎన్నికల ముందు మాట్లాడింది ఏమిటి? ఉద్యమంలో మాట్లాడిన మాటలు ఏమిటి? ఈ రోజు మీరు ఏరు దాటిన తరువాత బోడి మల్లయ్య అని కాకి కబుర్లు చెప్పకుండా ఏదో ఒకటి స్పష్టంగా చెప్పండి.

(ట్రెజరీ బెంచ్‌ల నుండి అంతరాయం)

మిస్టర్ స్పీకర్ : ఇది క్వశ్చన్ అవరండీ, ఎంతసేపైనా మాట్లాడతాము మైక్ ఇవ్వండి అని అంటే ఎలా? ఒక క్వశ్చన్‌కు 20నిమిషాలు. దీనికి మీరు సంతృప్తి చెందకపోతే నోటీసు ఇవ్వండి. ఇంకో ఫామ్‌లో చూద్దాము.

డా.కె. లక్ష్మణ్ : అధ్యక్షా, చర్చిద్దామంటే ఎందుకు బాధ పడుతున్నారు?

మిస్టర్ స్పీకర్ : ఎవరు బాధ పడ్డారండీ, ఒక క్వశ్చన్‌కు 20నిమిషాలు సమయం ఇచ్చిన తరువాత కూడా రక రకాలుగా మాట్లాడుతుంటే ఇది ఏమి పద్ధతండీ?

(గౌరవ సభ్యులు డా.కె. లక్ష్మణ్ గారి నుండి అంతరాయం)

ఎవరికి అనుగుణంగా నడిపించడంలేదు. పద్ధతి ప్రకారం నడిపిస్తున్నాము. వాయిస్ పెంచినంత మాత్రాన...

శ్రీ ఈటల రాజేందర్ : అధ్యక్షా, ఈ సమస్య వాళ్లది మాత్రమే కాదు. ఆనాడు ప్రజలకు, నిరుద్యోగ బిడ్డలకు కలిసిమెలసి ఉంటామని చెప్పాము. అది మా బాధ్యత. ప్రేమ మీకే కాదు, మాకు కూడా ఉంటుందనే విషయాన్ని మరిచిపోకండి. ఈ సమస్య పరిష్కారం చేసే దిశలో ఉన్నామని ముఖ్యమంత్రి గారు సభలో చెప్పారు. తప్పకుండా ఒకదాని తరువాత ఒకటి నియామకాలు జరుగుతాయని చెప్పిన తరువాత కూడా పదే పదే అంటున్నారు. అంటే ఏదో మాట్లాడుకోవాలి, లబ్ధి పొందాలని అనుకుంటున్నారు. దయచేసి సమస్య నుండి లబ్ధి పొందాలనే ప్రయత్నం చేయకండి. బాధ్యతాయుతంగా సమస్యను పరిష్కరిద్దాము. ఇప్పటికే 11వేల ఉద్యోగాలు నింపామని చెప్పాను. 18వేల ఉద్యోగాల నియామకాల కోసం నోటిఫికేషన్ ఇచ్చాము. ఇవన్నీ వివిధ దశల్లో ఉన్నాయి. మూడవది 10200 మరియు 2444 ఉపాధ్యాయ ఉద్యోగాలను నింపబోతున్నామని చెప్పాము. ఇవన్నీ కలిపి దాదాపు 50వేల పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడం గాని, భర్తీ చేయడం గాని లేదా భర్తీ చేయడం కోసం పంపడం గాని జరిగింది.

MR. SPEAKER: The remaining questions are postponed. The Paper is laid on the Table of the House. Now, Government Motion.

(గౌరవ సభ్యులు డా.కె. లక్ష్మణ్ గారి నుండి ప్రొటెస్ట్ చేస్తామని తెలిపారు.)

మిస్టర్ స్పీకర్ : మీరు ఏమి ప్రొటెస్ట్ చేస్తారో చేయండి. నేను మిమ్మల్ని అనుమతిస్తున్నాను.

డా.కె. లక్ష్మణ్ : అధ్యక్షా, ఆ బాధ ఏమిటో ఉద్యమ సందర్భంలో ఉద్యమంలో పాల్గొన్న వారికే తెలుసు. ఆరోజు యూనివర్సిటీ విద్యార్థులు, నిరుద్యోగ యువకులూ, విలువైన విద్యా సంవత్సరాలను కూడా పక్కనపెట్టేసి మా అందరి జీవితాల్లో వెలుగులు వస్తాయి, ఉద్యోగాలు వస్తాయని ఆశతో తెలంగాణ ఉద్యమంలో పాల్గొని తెలంగాణను సాధించారు. రెండు సంవత్సరాల కాలంలో 1,07,000 ఉద్యోగాలు పూర్తి చేస్తామని చెప్పి ఇప్పుడు 16వేల ఉద్యోగాలు ప్రకటించాము, ఈ విధంగా చేస్తున్నాము అనే విషయంపై ఇప్పటి వరకు స్పష్టత లేకుండా గ్రూప్-1, గ్రూప్-2, విఆర్‌ఓ, డిఎస్‌సి, జెఎల్, డిఎల్ అన్నీ...

(మైక్ కట్ చేయబడింది.)

J-38-4.

సభా సమక్షంలో ఉంచిన పత్రం

77TH Annual Report of Nizam Sugars Ltd., Hyderabad for 2014-15:

"A copy of 77th Annual Report of Nizam Sugars Limited, Hyderabad for the year 2014-2015 as required under Section 395 of the Companies Act, 2013."

(గౌరవ సభ్యులు డా.కె. లక్ష్మణ్ మరియు కొంత మంది కాంగ్రెస్ సభ్యుల నుండి అంతరాయం)

ప్రభుత్వ ప్రతిపాదన

ప్రభుత్వ లెక్కల సమితిలో రెండు యాధృచ్ఛిక ఖాళీలను భర్తీ చేయుట గురించి

మిస్టర్ స్పీకర్ : క్వశ్చన్ అవర్‌లో ప్రొటెస్ట్ లేదు. Government Motion.

SRI T. HARISH RAO: Sir, I beg to move:

"That the Members of this House do proceed to elect two Members of the House to serve on the Committee on Public Accounts to fill the two casual vacancies in the manner required under Rule 196 (3) of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Assembly"

MR. SPEAKER: Motion moved. The question is:

"That the Members of this House do proceed to elect two Members of the House to serve on the Committee on Public Accounts to fill the two casual vacancies in the Manner required under Rule 196 (3) of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Assembly"

(Pause)

The motion was carried and the Government Motion was adopted.

ప్రకటన

ప్రభుత్వ లెక్కల సమితి సభ్యుల ఎన్నికల షెడ్యూల్ గురించి

Re: Fixing schedule of election of Members to the PAC.

MR. SPEAKER: In accordance with the practice for conduct of elections to fill up two casual vacancies in the Committee of Public Accounts according to the principle of proportional representation by means of single transferable vote I fix the following programme:

Last date for filing of nominations: Up to 3.30 P.M on 19.03.2016 (Saturday)

Date of scrutiny of nominations: At 4.00 P.M on 19.03.2016 (Saturday)

Last date for withdrawal of candidature: Up to 5.00 P.M on 21.03.2016 (Monday)

Date on which a poll shall, if necessary: Between 10.00 A.M and 2.00 P.M be held: on 22.03.2016 (Tuesday)

మీరు ఆ క్వశ్చన్ అవసరమనుకుంటే వేరే ఫామ్‌లో రండి. వేరే ఫామ్‌లో అలా చేస్తామని చెప్పాము.

SRI T. HARISH RAO: Sir, one thing. గౌరవ సభ్యులకు తమరి ద్వారా ఒక మనవి. పదకొండు గంటల తర్వాత సింగిల్ సప్లిమెంటరీ ఉంటుంది. అయినా ప్రశ్న యొక్క ఇంపార్టెన్స్‌ని దృష్టిలో పెట్టుకుని దాదాపు 30నిమిషాలు అనేక రకాలుగా గౌరవ సభ్యులకు అవకాశం ఇచ్చారు. మన శాసన సభ రూల్స్ పుస్తకము ఆధారంగా Sir, you please see Page 21 of the Rules Book. Paragraph No. 15. No discussion shall be permitted during the time for questions under Rule 38 in respect of any question or of any answer given to a question. నేను ఇంకొకటి కూడా చెప్తున్నాను. ఈ ప్రభుత్వం ప్రతిపక్షాలను గౌరవించిది. కనుకనే నిన్న ప్రతిపక్షనాయకులు జానారెడ్డి గారు రెండు రోజులు ఎంత సమయం మాట్లాడినా, ప్రభుత్వం సమయం ఇచ్చిందంటే ప్రభుత్వం ఎంత సంయమనంతో పోతోందో ప్రజలు గమనిస్తూ ఉన్నారు. క్వశ్చన్ అవర్ అయిపోయిన తరువాత కూడా ఎంత సమయం ఇచ్చిందో ప్రజలు గమనిస్తున్నారు. వారు ఒకవేళ ఈ విషయమై మాట్లాడాలని అనుకుంటే షార్ట్ నోటీసు క్రింద ఇవ్వమనండి. దాని మీద ఎంత సేపైనా చర్చిండానికి సిద్ధంగా ఉన్నాము.

మిస్టర్ స్పీకర్ : లక్ష్మణ్ గారూ, మీరు నోటీసు ఇవ్వండి. మేము అలవ్ చేస్తాము. No further discussion.

(Interruptions)

సభా కార్యక్రమము

వాయిదా తీర్మానాల అనుమతి గురించి

1. డా. కె. లక్ష్మణ్ గారు నగరంలో శాంతి భద్రతల గురించి ఇచ్చిన వాయిదా ప్రతిపాదన తిరస్కరిండమైనది.

2. శ్రీ రేవంత్ రెడ్డి మరియు ఇతరులు రాష్ట్రంలోని రైతుల ఋణ మాఫీ మరియు రైతాంగ సమస్యల గురించి ఇచ్చిన వాయిదా ప్రతిపాదన తిరస్కరించడమైనది.

3. శ్రీ పాయం వెంకటేశ్వరులు రాష్ట్ర అటవీ హక్కుల చట్టం మరియు గిరిజనుల సమస్యల గురించి ఇచ్చిన వాయిదా ప్రతిపాదన తిరస్కరించడమైనది.

4. శ్రీ రవీంద్ర కుమార్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు నిధుల కేటాయింపు గురించి ఇచ్చిన వాయిదా ప్రతిపాదన తిరస్కరించడమైనది.

5. శ్రీ సున్నం రాజయ్య ఆశ వర్కర్ల సమస్య పరిష్కరించాలని ఇచ్చిన వాయిదా ప్రతిపాదన తిరస్కరించడమైనది.

(Interruptions)

MR. SPEAKER: Now, Tea break for ten minutes.

(The House then adjourned at 11.30 A.M for Tea break.)

12.00 మ. (తేనీటి విరామానంతరం సభ తిరిగి 12.05ని.లకు ప్రారంభమైంది)

(అధ్యక్షస్థానంలో గౌ.సభాపతి ఉన్నారు.)

MR. Speaker: Please resume your seats. Now General Discussion on Budget.

2016 -2017 సం.పు వార్షిక ఆదాయ - వ్యయ పట్టిక (బడ్జెటు) పై-సాధారణ చర్చ

(కొనసాగింపు) (మూడవ రోజు)

శ్రీ వి. శ్రీనివాస గౌడ్ : అధ్యక్షా, తెలంగాణ శాసన సభలో బడ్జెట్ గురించి మాట్లాడ్డానికి అవకాశం కల్పించిన గౌరవ ముఖ్య మంత్రి గారికి, బడ్జెట్ ప్రవేశ పెట్టిన ఈటల రాజేందర్ గారికి, శాసనసభ వ్యవహారాల మంత్రి హరీష్‌రావు గారికి, తమరికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను. గతంలో తెలంగాణ ప్రాంతానికి ఒక్క పైసా కూడా ఇవ్వమని, మీరేం చేసుకుంటారో చేసుకోమని తెలిపిన ఈ అసెంబ్లీలో, తెలంగాణ అన్న పదాన్ని ఉచ్చరించవద్దని, వెనుకబడిన ప్రాంతంగా మాట్లాడాలని చెప్పిన ఈ అసెంబ్లీలో, ఏ బడ్జెట్ సమావేశాల్లో కూడా తెలంగాణ అనే పదాన్ని లేకుండా ప్రవేశపెట్టిన ఈ అసెంబ్లీలో, దురహంకారంతో, తెలంగాణ నాయకులను బయటకు గెంటేసి ఆంధ్రప్రదేశ్‌గానే ఉండాలని, తీర్మానం చేసిన ఈ అసెంబ్లీలో, ఈ రోజు రూ.1,30,000 కోట్లతో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై ప్రసంగం చేసే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉంది. ఈ బడ్జెట్ మన రాష్ట్రం, మన బ్రతుకు, మన ప్రజలు, మన పిల్లలు, భావితరం ఎలా ఉండాలని సమీక్షించి, ఆర్థిక మంత్రి, ముఖ్య మంత్రి గారు అనేక సమావేశాలు పెట్టుకొని గంటల తరబడి శాఖల వారీగా రివ్యూ చేసి, మన బ్రతుకుల గురించి పెట్టిన బడ్జెట్ ఇది. గతంలో బడ్జెట్ అంటే ప్రసంగం చేసి వెళ్లేవారు, ప్రజలు కూడా పట్టించుకునే వారు కారు. కాని ఈ రోజు బడ్జెట్ అనగానే ప్రతి ఊరిలో, ప్రతి గ్రామాల్లోని ప్రజలు టి.వి. పెట్టుకుని చూస్తూ, ఈ బడ్జెట్ వల్ల పింఛన్‌కు ఎంత వస్తుందని, వ్యవసాయానికి ఎంత వస్తుందని, పేద, బడుగు బలహీన వర్గాలకు ఎంత వస్తుందని, అగ్రవర్ణాలోని పేదలకు ఏ రకమైన లాభము ఉంటుందని సామాన్య ప్రజలు కూడా బడ్జెట్‌పై ఆలోచిస్తున్నారు.

12.10 మ. అగ్రవర్ణాలైనటువంటి పేదలకు కూడా ఏ రకమైన లాభం ఉంటుందా అని సామాన్య ప్రజలు కూడా ఒక ఆలోచన చేసేటువంటి బడ్జెట్ ఇది. ఆది నుంచి మన తెలంగాణ రాష్ట్రం ధనిక రాష్ట్రం. గతంలో మన నాయకులు సీమాంధ్ర ముఖ్యమంత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేసి మాకు రోడ్డు వేయండి, మాకు వంతెనలు కట్టించండి అని బ్రతిమాలుకునేవారు. ఇక మంత్రుల సంగతి అయితే జిల్లాల గురించి మాట్లాడేది తక్కువగా ఉండేది. నీ నియోజక వర్గాన్ని అభివృద్ధి చేసుకోండని చెప్పేవాళ్లు. గట్టిగా మాట్లాడితే ఆ పదవి ఉంటుందో లేదో అన్న భయం ఉండేది. ఎంఎల్ఏ గట్టిగా మాట్లాడితే వచ్చేసారి టికెట్ వస్తుందో రాదో అన్న భయం. అంటే భయంతో వాళ్లు ఏమి చెబితే ఆ పనిని చేసేవారు. ఈరోజు ఏ నాయకుడు అడగక ముందే ఏ పథకానికి ఎంత బడ్జెట్ కేటాయించాలో అంచనా ప్రకారం కేటాయించి అందరిని సంతృప్తి పరచిన నాయకుడు మన కెసిఆర్ గారు. 50ఏళ్ల ఉమ్మడి రాష్ట్రంలో ఏ రోజు కూడా తెలంగాణ అన్న పదం ఉందా? వారు ఎంత జాగ్రత్త పడ్డారు. ఈ ప్రాంతంలోనే ఉంటూ, ఈ ప్రాంతంలోనే అధికారం చలాయిస్తూ ఇక్కడ ప్రజలకు మేలు చేయడానికి వాళ్లకు చేతులు వచ్చేవి కావు. ఎప్పుడూ, తెలంగాణ ప్రజలు ఎక్కడ బాగుపడతారో, ఆర్థికంగా అభివృద్ధి అయి వారు మన మీద ఎదురు తిరుగుబడతారనే ఆలోచనతో ఉండేవారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ఏ ముఖ్యమంత్రి ఆలోచన చేయలేదు.

ఏ ముఖ్యమంత్రి వచ్చినా వాళ్ల ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకున్నారు కానీ, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన దాఖలాలు ఎక్కడా లేవు. ఇటీవల ఈటెల రాజేందర్ గారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఒక పులి వంటిదని అన్నారు. ఈ మాట నిజం. ఇన్ని రోజులు ఆ పులిని బంధించి ఆంధ్రవాళ్లు పబ్బం చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఆ పులి ఈ రోజు బొబ్బిలి పులి అయింది. రాష్ట్రంలోనే కాదు దేశంలోనే ఒక నెం.1 రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం ఉన్నది. యావత్ తెలంగాణ ప్రజలే కాదు దేశంలో, ప్రపంచంలో ఉన్నటువంటి తెలంగాణ ప్రజలు ఈ రోజు ఈ తెలంగాణను చూసి సంతోషపడుతున్నారు. 14వ ఆర్థిక సంఘం తెలంగాణ రాష్ట్రం ధనిక రాష్ట్రమని గుర్తించింది. ధనిక రాష్ట్రం అంటే మొత్తం ప్రజలు ధనికులు కాదు, ఈ ప్రాంతంలోని వనరులు, ఆదాయం, అన్ని కూడా ఆర్థికంగా అభివృద్ధి చెందాయి కాబట్టి ఈ రాష్ట్రాన్ని ధనిక రాష్ట్రమని అంటున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే ఈ రాష్ట్రాన్ని ధనిక రాష్ట్రంగా గుర్తించారు. ఇంత ధనిక, మిగులు రాష్ట్రాన్ని లోటు బడ్జెట్ అయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో విలీనం చేస్తే, వారి ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకున్నారు కానీ, తెలంగాణ ప్రాంతానికి చేసిందేమి లేదు. ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా కెసిఆర్ గారు రావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టం. ఈ ప్రాంతంలోని వ్యవసాయం గురించి కానీ, నీళ్ల గురించి కానీ, నియామకం గురించి, నిధుల గురించి మన ముఖ్యమంత్రిగారు ఆలోచన చేశారు. చాలా మంది ముఖ్యమంత్రిగారిని గతంలో మీరు కూడా ఆ పార్టీలో మంత్రిగా ఉన్నారుకదా, అప్పుడేమి చేశారని మాట్లాడుతున్నారు. అప్పుడున్నటువంటి పరిస్థితిని వారు కళ్లార చూశారు కనుకనే, విపక్షతను గ్రహించి ఈ పార్టీలో ఉండి ఇకలాభం లేదని డిప్యూటీ స్పీకర్ పదవికి, ఎమ్ఎల్ఏ పదవికి రాజీనామా చేసి తెలంగాణ రాష్ట్రానికి ఒక కారణజన్ముడిగా బయటకు వచ్చి పోరాటం చేశారు. నేను ఒక మున్సిపల్ కమీషనర్‌గా పని చేస్తూ వారి పోరాటానికి ఆకర్షితుణ్ణి కాబడి, ఒక సంఘాన్ని పెట్టి సైన్యాన్ని ఏర్పాటు చేశాను. Free zone judgment రాగానే సిద్ధిపేట సభలో ఈ ఉద్యమం ప్రారంభమైంది. చివరకు కెసిఆర్ గారు నా ప్రాణం పోయినా పర్వాలేదని నిమ్స్ ఆసుపత్రిలో ఆమరణ నిరాహార దీక్ష చేశారు. నాలుగు రోజులు తర్వాత అయిదవ రోజు డాక్టర్లు ఇక రెండు రోజులు ఈ విధంగానే ఉంటే వారు చనిపోతాడని చెప్పారు. మేము కొంత మంది వారిని కలవడానికి వెళ్లి, నువ్వు బ్రతికి ఉంటేనే తెలంగాణ రాష్ట్రం వస్తుంది నువ్వు బ్రతకాలి నువ్వు దీక్షను విరమించుకో అని చెబితే అందుకు కెసిఆర్ గారు చెప్పిన మాటలు మాకు ఇప్పటికి గుర్తు ఉన్నాయి. డాక్టర్లు తప్పు చెబుతున్నారు. నేను ఇంకా నాలుగు రోజులు బ్రతుకుతాను. మీరు ధైర్యంగా పోరాడండి అన్నారు. అప్పటికే మేము నాలుగు రోజు పెన్‌డౌన్ చేశాము. ఇంకా నాలుగు రోజులు చేయండి ఆ తర్వాత తెలంగాణ వస్తుంది అన్నారు. మీరు నన్ను బలవంతం పెట్టకండి మీరు ఇంకా బలవంతం పెడితే కిటికీలోనుంచి దూకి చనిపోతానని కెసిఆర్ గారు అన్నారు. ఇటువంటి వ్యక్తి దేశంలో ఎక్కడైనా ఉంటారా? ఉద్యమాలు జరుగుతున్నప్పుడు విద్యార్థులు చనిపోతున్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి గారిని కానీ, ప్రభుత్వాన్ని ఎవ్వరూ నిలదీయలేదు. ఆ ముఖ్యమంత్రి గారితో ఒక్కరైనా తెలంగాణ గురించి మాట్లాడారా? గొడుమదేటువంటి వాళ్లు, ఎంతో మంది చావులకు కారణమైనటువంటి వాళ్లు అమరవీరుల గురించి ప్రేమ ఉన్నట్లు మాట్లాడుతున్నారు. చంపినవాళ్లే ఎక్స్‌గ్రేషియా గురించి మాట్లాడుతున్నారు. తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలంగా బంగారు తెలంగాణ రావడానికి వీళ్లకు ఇష్టం లేదని తెలుస్తుంది. గతంలో ముఖ్యమంత్రులను చాలా మందిని చూసాము. కొంతమంది ముఖ్యమంత్రులు ఢిల్లీకి వెళ్లి అక్కడ వారు నాయకులను కలవకపోయినా మీడియాకు వచ్చి వారిని కలిసామని ఏవో మాటలు చెప్పేవారు. వాళ్ల సీటును కాపాడుకోవడానికి ఆలోచన చేస్తున్నారే కానీ, ఆ సీటులో కూర్చోని అన్ని ప్రాంతాలకు న్యాయం చేయాలనే ఆలోచన ఏ ముఖ్యమంత్రి అయినా చేశారా? ఈ రోజు ఇప్పటి తరమే కాదు ముందు ఉన్న 100 తరాల వారు కూడా ఆనందంగా ఉండేలా తెలంగాణ రాష్ట్రాన్ని కెసిఆర్ గారు మనకు తీసుకువచ్చారు. ఏ ముఖ్యమంత్రి అయినా ఇప్పటి వరకు మహారాష్ట్రకు వెళ్లారా? చత్తీస్‌ఘడ్‌కు వెళ్లారా? సమస్యను పరిష్కారం చేయడానికి చిత్తశుద్ధితో ముందుకు వెళ్లిన నాయకుడు కెసిఆర్ గారు. మహారాష్ట్రకు వెళ్లి ఈ ప్రాంతాలలో ఎప్పుడు వివాదాలు లేకుండా ప్రాజెక్టులు ఉండాలని మాట్లాడితే దానికి కూడా విపక్షాలు రాద్ధాంతాలు చేస్తున్నారు. గత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు కేంద్రంతో మాట్లాడి ఒక్కరోజులోనే సమస్యను పరిష్కారం చేసే అవకాశం ఉన్నా ఆ రోజు ఈ పరిష్కారం ఎందుకు చేయలేదని మీ ద్వారా వారిని అడుగుతున్నాను.

12.20 మ. ప్రయత్నం చేసి పరిష్కారం చేయడం వారికి ఇష్టం లేదు. మాట్లాడితే బ్లాక్ డే అంటారు. తెలంగాణ ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. ఎక్కడ బ్లాక్‌డే అవుతోంది? ఇక్కడ తీర్మానం చేసి ఆంధ్రప్రదేశ్ గా వున్నప్పుడు బ్లాక్‌డే కాదా? పోతిరెడ్డి పాడును నది దాకా తీసుకుపోయినపుడు ఆనాడు బ్లాక్‌డే కాదా? పిట్టల్లా కాల్చి కొట్టి చంపినపుడు ఆనాడు బ్లాక్‌డే కాదా? తెలంగాణ గురించి మాట్లాడినపుడు ఏదో రకంగా కాల్చి చంపినపుడు, రైతుల గురించి ధర్నా చేసినందుకు బషీర్‌బాగ్ దగ్గర కాల్చి చంపినపుడు ఆనాడు బ్లాక్‌డే

కాదా? తెలంగాణ గురించి చనిపోతున్నారు చనిపోవద్దు ఈ ప్రభుత్వం వుందని ఏ నాడైనా ఈ అసెంబ్లీ నుంచి భరోసా ఇచ్చారా? ఈ దమనకాండను ఆపేందుకు ప్రయత్నం చేయలేదు ఆ రోజు బ్లాక్ డే కాదు, ఆ రోజు మాత్రం చాలా సంతోషం.

ఈ రోజు తెలంగాణ రాష్ట్రంలో ఏ చెరువు ఎక్కడ వుందో, ఏ కుంట ఎక్కడ వుందో ఏ కాలువ ఎక్కడ వుందో, మా ముఖ్యమంత్రి గారిని అర్ధరాత్రి నిద్ర లేపి అడిగినా ఒక్కక్షణంలో ఆ చెరువు గురించి చరిత్ర చెబుతారు. ఈ కాలువ గురించి చెప్పు అంటే ఆ కాలువ గురించి చరిత్ర చెబుతారు. మరి ఏ ముఖ్యమంత్రి అయినా గతంలో ఈ విధంగా చెప్పారా? ఏ నాయకుడైనా చెప్పాడా? ఒకవేళ అడిగితే రిపోర్ట్ రాలేదు మళ్లీ వచ్చి చెబుతామని అనేటువంటి వాళ్లే కాని చెప్పే వారు ఎవరైనా వున్నారా, ఈ ముఖ్యమంత్రి తో సమానంగా అని ఛాలెంజ్ చేసి అడుగుతున్నాను. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని చెప్పి గోదావరి, కృష్ణా జలాల వాటా వాటిని ఎలా తీసుకొచ్చుకోవాలి, ఎలా ఉపయోగించుకోవాలి, ఒక్క బొట్టు కూడా వృధా కాకుండా ఈ ప్రాంతాన్ని ఎలా సస్యశ్యామలం చేసుకోవాలని చెప్పి కారణాలు ఎక్కడ వున్నాయో కనిపెట్టి ఆ కారణాలను విశ్లేశించడానికి భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా వుండాలని ప్రయత్నం చేస్తున్నాం.

పాత ప్రాజెక్టులను as it is కడితే ఈ ప్రాంతానికి నష్టం జరుగుతుంది. సరి చేసుకోవాలి, రీ డిజైనింగ్, రీ ఇంజనీరింగ్ చేసుకోవాలి. చేసుకునే అవకాశం వున్న చోట ఎక్కువ నీటిని వినియోగించుకొనేటట్లు ప్రాజెక్టులను డిజైనింగ్ చేసుకొని పాత ప్రాజెక్టులన్నిటిని కూడా కొత్తగా చేయాలనేటువంటి అవసరాన్ని ముఖ్యమంత్రి గారు గమనించారు. ఇది తప్పా? ఇది చేయడం అన్యాయమా? అసలు అగ్రిమెంటులో ఏమీ లేదు. అగ్రిమెంటు విషయం అంటారు, పరిష్కారం కావడం వీరికి ఇష్టం లేదు. ఎలక్షన్ మ్యానిఫెస్టోలో వున్నటువంటివి అన్నీ కూడా మంత్రి వర్గాలను బట్టి resolution పాస్ చేస్తూ అన్ని అమలు చేసుకుంటూ ఎలక్షన్ మేనిఫెస్టోలో కూడా లేనివి ఈ రోజు అమలు చేయడానికి ప్రయత్నం చేసి అనేక సంక్షేమ కార్యక్రమాలు కొత్త కొత్తవి అన్నీ కూడా ముందుకు వస్తే అన్నిటినీ కూడా పైకి తీసుకు వస్తుంటే అమలు లోకి తెస్తుంటే ఏ రోజు ఒక్క మాట సమైఖ్య పాలనలో నిలదీయనటువంటి వారు స్వరాష్ట్రంలో సొంత ముఖ్య మంత్రిని నిలదీస్తారా?

ఈ గడ్డలో పుట్టి ఈ గడ్డలో ఉద్యమాలు చేసి తెలంగాణను తెచ్చుకోవడం గొప్ప కాదు. తెచ్చుకొన్న తరువాత నిలబెట్టుకోవడానికి నిలబెట్టుకొని సశ్యశ్యామలం చేయడం కోసం ఈ రోజు కంకణం కట్టుకొన్న మన ముఖ్యమంత్రి గారు ముందుకు పోతుంటే ఒక నాయకుడు ‡‡హడ్కోకి‡‡ అప్పు ఇవ్వొద్దని లెటర్ వ్రాస్తాడు. నేను అడుగుతున్నాను అధ్యక్షా, ఒక వ్యక్తి ఒక ఆసామి దగ్గరకు వెళ్లి అప్పు అడిగితే ఇంకొకతను వెళ్లి ఆయనకు అప్పు ఇవ్వొద్దని చెప్పాల్సిన అవసరం ఏమి వుంది. ఆయనకు ఆరోగ్యం బాగోలేదు, ఆయనకు చాలా అప్పులు వున్నాయి ఆయనకు భూములు లేవు, తాకట్టు పెట్టాడు జాగ్రత్త అని చెబితే అప్పు ఇచ్చే ఆసామి అప్పు ఇస్తాడా? ఈ రోజు ‡‡హడ్కోకు‡‡ ఈ చరిత్ర వ్రాయాల్సిన అవసరం ఏమి వుంది. ఈ ప్రాంతం అభివృద్ధి కావొద్దా? మంచినీరు త్రాగొద్దా? రోడ్లు వుండొద్దా? ఒకతను రోడ్లు ఎందుకు అంటాడు? ఒకతను రూ. 2,000 కోట్లలో నీళ్లు వస్తాయంటాడు. ఇంకొకతను హడ్కోతో అప్పు ఇవ్వొద్దు అంటాడు. డబ్బులు వున్నటువంటి వారు బంజారాహిల్స్‌లోనో, జూబ్లీహిల్స్‌లోనో వుంటూ మంచిగా మినరల్ వాటర్ త్రాగి అప్పుడో ఇప్పుడో నియోజక వర్గానికి వెళ్లి రావొచ్చు. కాని వెళ్లి వచ్చినప్పుడు గ్రామాలలో బస్తీలలో స్లమ్‌లలో వున్న ప్రజలు ఎలా వున్నారు వారి జీవితాలను ఎలా బాగుచేయాలనే ఆలోచన చెయ్యాలి. అది విస్మరించిన రోజు ప్రజలు కూడా మనల్ని విస్మరిస్తారనే ఆలోచన నాయకులు చేయాల్సిన అవసరం వుంది.

సీనియర్ నాయకులు ఎంతో అనుభవం వున్న వాళ్లు వివిధ హోదాలలో పని చేసినటువంటి వారు రాష్ట్రం వచ్చిన తరువాత ఈ రాష్ట్ర పునఃనిర్మాణంలో అయినా మంచి సలహా సూచనలు ఇచ్చి బాసటగా వుండాలని చెప్పి ఆలోచించాల్సిన అవసరం వుంది. ఈ రోజు కృష్ణా గోదావరి నదులకు 1250 tmcల నీళ్లు వున్నాయి. వాటిని ఎలా ఉపయోగించుకోవాలా అని పూర్తిస్థాయిలో ముఖ్యమంత్రి గారు స్వయాన ఇంజనీర్లను కూర్చోపెట్టుకొని సమీక్షించారు. కొత్త ప్రాజెక్టులు ఎక్కడ ఎలా కంప్లీట్ చేయాలి, పాత ప్రాజెక్టులను ఎలా పూర్తి స్థాయిలో కంప్లీట్ చేసుకోవాలి, ఎలా వినియోగం చేసుకోవాలని సమీక్షించారు. అప్పుడు మా మహబూబ్ నగర్ జిల్లా సభ్యులు సంపత్ గారు కూడా వున్నారు. ఆయనకు కూడా తెలుసు మహబూబ్‌నగర్ జిల్లా పూర్తి పేద జిల్లా. పేద జిల్లాలో మా నియోజకవర్గం ఇంకా పేదదని చెప్పి ఆయన అన్నారు. కృష్ణానది ఆయన నియోజకవర్గం నుంచి పోతున్నా త్రాగడానికి నీళ్లు లేనటువంటి పరిస్థితి ఉంది. వ్యవసాయం సంగతి దేవుడెరుగు. మరి ఈ దుస్థితికి 60 సంవత్సరాలు పరిపాలించిన వారు కారణం కాదా అని ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం వుంది.

పాలమూరు రంగారెడ్డి జిల్లా ప్రాజెక్టు రూ. 35,000 కోట్లతో, దిండి ప్రాజెక్టు రూ. 6,190 కోట్లతో ఇప్పటికే పూర్తి చేశాం. శ్రీ సీతారామ ప్రాజెక్టు, భక్తరామదాసు ప్రాజెక్ట్‌లకు శంకుస్థాపన కూడా చేశాము. మా జిల్లాలో లక్షల మంది వలస పోతున్నారు. దుబాయ్, ముంబాయిల్లో ఒక జిల్లా జిల్లా మొత్తం వుంది. జిల్లాలు ఏర్పాటైతే తెలంగాణ మహబూబ్‌నగర్ జిల్లాలు సస్యశ్యామలం అయితే తిరిగి వారందరు వస్తే రెండు, మూడు జిల్లాలు కాదు నాలుగు జిల్లాలు ఏర్పాటు చేసే పరిస్థితి వస్తుంది. అంటే అంత జనం బయట వున్నారు. ఇన్ని వనరులున్నటువంటి మా జిల్లాలోనే ఇలాంటి పరిస్థితి వుంది.

ప్రత్యక్షంగా చూశాను బస్ వెళుతూవుంటే చిన్న పిల్లలు ఏడుస్తూ మళ్ళీ ఎప్పుడు వస్తావో రావో అని ఎదురు చూసే పరిస్థితి. ఎవరైనా చనిపోతేనో పెళ్లి అయితేనో వచ్చి పోయేటువంటి పరిస్థితి. మరి అలాంటి జిల్లాను అభివృద్ధి చేయాలని కంకణం కట్టుకుని ముందుకు పోతుంటే కాళ్ల కింద కట్టెలు పెట్టి ఎలా అడ్డుకోవాలాని కొందరు ప్రయత్నం చేయడం చాలా బాధాకర విషయం.

60 ఏళ్ల సమైక్య పాలనలో ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రాజెక్టులు కట్టిస్తే చాలా బాగుండేది. ప్రాజెక్టు కట్టాలన్నా, ఇల్లు కట్టాలన్నా ఒక ఇంజనీరు వచ్చి estimation తయారు చేస్తారు, సిమెంటు, ఇటుక, మేస్త్రీకి ఎంత, డోర్లకు ఎంత అని, మరి ప్రాజెక్టు విషయానికి వస్తే నెలల తరబడి తయారు చేయాలి. గతంలో రాత్రికి రాత్రే ప్రాజెక్టులు పుట్టుకొచ్చాయి. రాత్రికి రాత్రే ఇక్కడ రూ. 20,000 కోట్లు, ఇక్కడ రూ. 10,000 కోట్లు, రూ. 15,000 కోట్లు అని నిర్ధారించేవారు. పదవులు రాని వాళ్లకు అసంతృప్తితో వున్న వాళ్లకు పెద్దపెద్ద కాంట్రాక్టర్లకు తలా ఒకటి పంచేస్తారు. మొబిలైజేషన్ అడ్వాన్స్ అతనికి ఎక్కువ వచ్చింది నాకు తక్కువ వచ్చిందని ఒకతను వస్తాడు. సరే నీకు కూడా రూ.20,000 కోట్లు ఇచ్చానని వాళ్లను సంతృప్తి పరచడానికి కాంట్రాక్టులు ప్రాజెక్టులు వచ్చాయి కాని, ఈ ప్రాజెక్టులకు అనుమతి వుందా లేదా పర్యావరణం అనుమతి వుందా లేదా పక్క రాష్ట్రం అనుమతి వుందా లేదా, కేంద్రం అనుమతి వుందా లేదా ఈ నీళ్లు నిలువ వుంటాయా వుండవా ఎన్ని ఎకరాలకు నీళ్లు ఇస్తామనేటువంటి ఒక సమగ్రమైన ప్రణాళిక లేకుండా ఆనాటి ముఖ్యమంత్రి చేశారు.

ఆ ముఖ్యమంత్రి వున్నప్పుడు అక్కడా ఇక్కడా మన నాయకులు కొట్లాడారు, దాన్ని తప్పు అనడం లేదు. కొంతమంది కొట్లాడారు కొంతమంది అడిగారు, అడిగిన వాళ్ల మాట చెల్లలేదు. అడిగిన వాళ్లు గల్లంతు అయ్యారు. Adjust అయి మనసు చంపుకొని వున్నటువంటి పరిస్థితి కూడా మేము చూశాము. ఈ రోజు మహారాష్ట్రనుంచి ఒప్పందం కుదుర్చుకొని వచ్చి ఎక్కువ TMC నీళ్లు ఎలా మనకు తీసుకురావాలని చెప్పి దానికి సలహా సూచనలు ఇస్తే మన ముఖ్యమంత్రి గారు ఖచ్చితంగా ఆ సలహాలు తీసుకుంటారు. ప్రాణహిత చేవెళ్ల తుమ్మిడిహట్టి దగ్గర డిజైన్ చేశారు. మొబిలైజేషన్ అడ్వాన్స్ తిన్నారు. చాలా మంది ప్రాణహిత చేవెళ్ల అంటే ఓ నీళ్లు వచ్చాయి చేలల్లో పడతాయి శంకర్‌పల్లికి, వికారాబాద్‌కు వస్తాయి, హైదరాబాదుకు వస్తాయి అక్కడి నుంచి క్రిందకు మహబూబ్‌నగర్‌కు వస్తాయని అనుకున్నాం.

అక్కడ ఏమీ లేదు గంపెడు మట్టి తీయలేదు, ఇక్కడ కాలువలు తీశారు, సొరంగాలు తీశారు మొత్తం పని అయిపోయింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అక్కడ కూడా గంపెడు మట్టి కూడా తీయలేదు. నల్గొండలో, వరంగల్‌లో కాలువలు త్రవ్వారు. వేల కోట్ల రూపాయలు కాంట్రాక్టర్లకు ఇచ్చారు. మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు ఇచ్చారు. ఆలూ లేదు చూలు లేదు కొడుకు పేరు సోమలింగం అనేవిధంగా మొత్తం డబ్బులు ఇచ్చేశారు. వరంగల్ జిల్లాకు వెళ్లినప్పుడు మీరు చూడండి కాలువల్లో పిల్లలు క్రికెట్ ఆడుతున్నారు. మరి ఇంత ప్రజాధనం వృథాచేసి ఎలాంటి అనుమతులు లేకుండా ఎలాంటి దూరదృష్టిలేకుండా ఇంత డబ్బును వృధా చేసిన సందర్భంలో ముఖ్యమంత్రి గారు అధిక నిధులు కేటాయించి ప్రయత్నం చేస్తూ వుంటే అందరం కూడా ప్రశంసించాల్సిన అవసరం వుంది అధ్యక్ష.

12.30 మ. చాలా ఘోరాలు జరిగాయి. నిజంగాఆ ప్రాజెక్టులు కట్టి ఉంటే ఈ రోజు మేము ఇలా ఉండే వాళ్లం కాదు. ఆ ప్రాజెక్టులు అన్నీ కడితే ఏ కుటుంబం బాధ పడేవారు కాదు. వంద ఎకరాలు ఉన్న రైతు కూడా ఈ రోజు కళ్ల నీళ్లు పెడుతున్నాడు. ఒక ఊరిలో రైతు బాగు పడితే ఆ రైతు క్రింద చాకలి వాళ్లు, మంగలి వాళ్లు, గౌండ్లవాళ్లు, చేనేత కార్మికులు వీళ్లందరూ బ్రతికేవారు. చెరువు ఎండిపోయింది నీళ్లు లేవు. చెరువులు పూడిక తీయవద్దు. కొత్త చెరువులు త్రవ్వవద్దు. ఇంత దుర్మార్గంగా జీఓలు తెచ్చినప్పుడు ఇప్పుడు విమర్శించే వాళ్లు ఆ రోజు విమర్శించి నిలదీసి ఉంటే, గల్లా పట్టుకొని అడిగి ఉంటే ఈ రోజు మనందరూ సంతోషించేవారు. ఆ రోజు వాళ్లు అడగాలనుకున్నా వాళ్లు దుర్మార్గమైన పరిపాలన వల్ల అడగలేక పోయారు.

సమైక్య పాలనలో గొంతు పిసికి చంపినటువంటి మరొక కీలక రంగం మైనర్ ఇరిగేషన్. ఆనాటి కాలంలో 279 టిఎంసిల నీళ్లు ఉన్న చెరువులు పెద్దవి ఉన్నాయి. లక్నవరం, పాకాల, రామప్ప,

గణపవరం చెరువులకు ఇప్పటికీ ఆ చరిత్ర ఉంది. చెరువులేని గ్రామం లేదు. చెరువు తరువాతనే గ్రామం . చెరువు క్రింద వ్యవసాయం . గ్రామానికి చెరువు గుండెకాయలాంటిది. చెరువు లేకుంటే బ్రతుకలేము. వాటిని నిర్వీర్యం చేసి ఐదు సంవత్సరాలలో పూర్తిగా వంద శాతం చెరువులను నిర్మాణం చేసి, పూడిక తీసి బాగుపరుస్తాము. చెరువు అంటే అంతకుముందు నీరు-మీరు. పైన లొట్టపీసు చెట్లు తీయాలి, బిల్లులు చేసుకొని పోవాలి. ఈ రోజు చెరువులోకి నీళ్లు రావాలంటే కాల్వలకు ఎక్కడి నుండి వస్తున్నాయి, నీళ్లు ఎక్కడి నుండి వస్తున్నాయి, చెరువు నిండిన తరువాత ఏ చెరువులోకి నీళ్లు పోతాయి, దానికి అడ్డుకట్ట ఎలా వేయాలి, చెక్‌డ్యామ్ ఎలా వేయాలని ఆలోచన చేసి, ఇంజనీరింగు నిపుణులతో, రిటైర్డ్ ఇంజనీర్లతో చర్చించి, ఈ రోజు చెరువులను పునరుద్ధరణ చేస్తుంటే, ఆ మిషన్ కాకతీయలో కూడా గోల్ మాల్ అంటారు. చాలామంది నాయకులు బయట తిడతారు మరల నియోజక వర్గాలలో టెంకాయ కొట్టి దేవునికి మొక్కి ఇంత మంచి కార్యక్రమం అని ప్రజల ముందు చెబుతారు. ఈ పద్ధతి మార్చుకోవలసిన అవసరం ఉంది. ఎక్కడైనా మంత్రిగారు, ముఖ్యమంత్రిగారు నిష్పక్షపాతంగా ప్రతి సంవత్సరం చెరువులు శాంక్షన్ చేయాలని చెప్పడం జరిగింది. ఎక్కడైనా శాంక్షన్ కాకపోతే ఇక్కడ అడగవచ్చు. ఖచ్చితంగా సరిదిద్దుకొని మరల ఎవరూ అనకుండా ఉండడానికి అవకాశం ఉంటుంది.

ఈ రోజు హైదరాబాదులో వందల చెరువులుండేవి. చుట్టుముట్టు ప్రాంతాలలో. ఈరోజు చెరువులు పోయాయి, కుంటలు పోయాయి, నాలాలు పోయాయి, ఫిరంగి నాలా అంటే చాలా ఫేమస్, అది మొత్తం పోయింది. మూసీనదిలోని నీళ్లు త్రాగలేము, ఆ రోజున నిజాం నవాబు త్రాగడానికి, పూజ చేయడానికి వాడుకునేవారు. చాలామంది అక్కడ స్నానం చేసి కాళ్లు కడిగికొని పోయేవారు. ఈ రోజు అక్కడ కాలుపెట్టే పరిస్థితి ఆ నదిలో ఉందా? కాళ్లు పెడితే కాళ్లకు **బొగ్గలు** వస్తాయి. చెరువులు, కుంటలు మాయమై పెద్ద పెద్ద బిల్డింగ్సు వచ్చాయి. ఒక్కరైనా చెరువు కట్టాలనే ఆలోచన చేశారా? ఉస్మాన్‌సాగర్, నిజాంసాగర్, గండిపేట చెరువులు తప్ప కొత్త చెరువులు లేవు. జనాభా పెరుగుతున్నాదని కొత్త చెరువులు నిర్మించా, ప్రజలకు అవసరమనే ఆలోచన ఏనాడు చేయలేదు. ఈ రోజు ముప్పై టిఎమ్‌సిల నీరు నిల్వ ఉండేటువంటి రెండు చెరువులు కట్టాలని ప్రతిపాదన చేస్తే ఎప్పుడు కడతారు? ఆ చెరువులలోకి నీళ్లు వస్తాయా? ఎక్కడి నుండి వస్తాయి? ఇవేనా మాట్లాడేది? ఈ రోజు మిషన్ కాకతీయ మీద అమెరికాకు చెందిన మెగసెసే విద్యార్థులు వచ్చి వాటిని చూసి అబ్బురపడి ప్రశంసించి పోయారు. మెగాసెసే అవార్డు గ్రహీత రాజేంద్రసింగ్ వచ్చి ఇది చాలా గొప్ప ప్రాజెక్టు అని ప్రశంసించి పోయాడు. చాలామంది కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు ఎంతోమంది కొనియాడారు. ఆఖరికి హైకోర్టు కూడా చాలా మంచి కార్యక్రమం తీసుకున్నారని కొనియాడింది. ఇంతమంది కొనియాడితే వీళ్లకు ఎందుకు కనపడడం లేదు?

ముఖ్యమంత్రిగారు సిద్దిపేటలో ఎమ్ఎల్ఏగా ఉన్నప్పుడు స్వయంగా ఆయన గ్రీన్ ప్రాజెక్టు పేరిట ఆ నియోజక వర్గంలో త్రాగు నీళ్లు ఇవ్వడానికి స్వంతంగా స్కూటర్ వేసుకొని, మనిషిని కూర్చో పెట్టుకొని అర్ధరాత్రి, అపరాత్రి తిరిగి ఎక్కడ ట్యాంక్ కట్టాలి, ఎక్కడ సంప్ కట్టాలి, ఎక్కడ రిజర్వాయర్ కట్టాలని ఆలోచన చేసి లోయర్ మానేరు నుండి సిద్దిపేటకు నీళ్లు ఇచ్చిన పరిస్థితి. ఈ రకంగా నా ఒక్క నియోజక వర్గానికే కాకుండా మొత్తం అన్ని నియోజక వర్గాలలో ఈ రకంగా చేయాలని సంకల్పంతో ఉన్నారు. చాలామంది మంచినీళ్లు కలుషితమైన నీరు త్రాగి అనేక రోగాలు వచ్చి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. డబ్బులున్నవారు రు.15లు పెట్టి లీటర్ నీరు కొనుక్కొని త్రాగుతున్నారు. అన్ని చోట్ల దీనిని అమలు చేయాలని మిషన్ భగీరథ అనే కార్యక్రమం పెట్టారు. ఆ కార్యక్రమం వెలువడక ముందే రూ.200కోట్ల కుంభకోణమని ఒకాయన స్టేట్‌మెంట్ ఇచ్చాడు. ఆ పథకం ఇంకా పుట్టనే లేదు. పుట్టకముందు చెప్పాడు. ఇప్పుడు ఏమి మాట్లాడతారు? ఈరోజు అంతర్జాతీయ స్థాయిలో జాతీయ స్థాయిలో పక్క రాష్ట్రం వాళ్లు బీహారు ముఖ్యమంత్రి అయితే నేను మరల అధికారంలోకి వస్తే ఇదే తరహాలో పెడతానని అన్నాడు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, ఎంతోమంది ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, ఉమా భారతిగారు కూడా మెచ్చుకున్నారు. ప్రపంచ జలవనరుల సమావేశానికి రమ్మని మా ముఖ్యమంత్రిగారిని కూడా ఆహ్వానించడం జరిగింది. నీటి మీద మా ముఖ్యమంత్రిగారు చూపుతున్న శ్రద్ధను కేంద్రం కూడా గుర్తించింది. పైగా సహాయం మేము కూడా చేస్తాము, రండి అని చెప్పారు. రూ.40 వేల కోట్లతో తెలంగాణలో ప్రతి ఇంటికి నీళ్లు ఇస్తానని; నీళ్లు ఇవ్వకపోతే ఎలక్షన్సులో ఓట్లు అడగనని చెప్పే దమ్మున్న ముఖ్యమంత్రి ఎక్కడైనా ఉన్నాడా అని చెప్పమని అడుగుతున్నాము.

ఈ రాష్ట్రం యొక్క బాగు ముఖ్యంగా మంచినీళ్ళ సాగునీరు , వ్యవసాయ రంగం మీద ఆధారపడి ఉంది. . తెలంగాణ బ్రతుకు మొత్తం వ్యవసాయం మీద, విద్యుత్ రంగం మీద ఆధారపడి ఉంది. సమైక్య పాలనలో మోసపోయింది విద్యుత్ రంగం . విద్యుత్ ఉత్పత్తి

చేయడానికి మూలం బొగ్గు , విస్తారమైన స్థలం, నది, ఈ మూడు మూలాలు . ఎక్కడైనా కాని ఈ మూడు ఉన్న చోట ప్రాజెక్టులు కట్టాలి. కాని పిడికెడు బొగ్గు లేని దగ్గర మిగులు కరంటు ఉంటుందా? వంద సంవత్సరాలైనా తరగని బొగ్గు ఉన్న దగ్గర భూమి ఉన్న దగ్గర ఐదు జిల్లాల్లో ప్రవహించే నది ఉన్న దగ్గర ప్రాజెక్టు ఉండదా? మిగులు విద్యుత్ ఉండేదెట్లా? ఈ కుట్రలు కనీసం గ్రహించలేదు. పిడికెడు బొగ్గు లేని చోట వందల కిలోమీటర్లు వెళ్లి అక్కడ విద్యుత్ ప్రాజెక్టులు పెడతారా? ఇంత దుర్మార్గం ఇంతమంది ప్రజలు చూస్తున్నారు. ఇక్కడ నుండి బొగ్గు తీసుకువెళ్లి అక్కడ విద్యుత్ కేంద్రం పెడితే ప్రజలు ఏమనుకుంటారు? కనీసం ఇక్కడ కూడా పెట్టాలనే ఆలోచన ఎందుకు చేయలేదు? ట్రాన్స్‌పోర్టేషన్‌కు ఎంత ఖర్చు అవుతుంది? ఒక యూనిట్‌కు రూ.6 నుండి రూ.7లు ఖర్చు అవుతుంది. ఇక్కడ తయారు చేస్తే రూ.2.50 ఖర్చు అవుతుంది. సొంతంగా ఉత్పత్తి చేయడానికి ప్రయత్నం చేయలేదు. ఈ ప్రాంతంలో ఏనాడు ప్రయత్నం చేయలేదు. వాళ్ల నాయకులకు విద్యుత్ ప్రాజెక్టులు పెట్టమని రాయితీలు ఇచ్చారు. ఆ విద్యుత్ కొనుక్కున్నారు. తెలంగాణకు ఇచ్చారు. వాళ్లు మాత్రం రాష్ట్రం ఏర్పడ్డ తరువాత మిగులు విద్యుత్ ఉంది అక్కడ. తెలంగాణ కరంటుకు ఇబ్బంది ఉందని, కరంటు లేదనే ఈ రోజు ఆలోచన చేయలేదు. ఈ విషయం మోసం చేసిన వారికి తెలుసు. ఆ మోసం చేసిన ఆయనే కరంటు ఉండదని ఆఖరి ముఖ్యమంత్రి తెలంగాణలో కరంటు ఉండదని చెప్పాడు. మన చరిత్ర మొత్తం తెలుసు కాబట్టే మీకు కరంటు ఉండదని చెప్పాడు. విభజన చట్టాన్ని ఉల్లంఘిస్తామని ముందే చెప్పాడు. నిజంగా విభజన చట్టాన్ని ఉల్లంఘించి మనకు రావలసినటువంటి 59 శాతం విద్యుత్ మనకు ఇవ్వలేదు. పోలవరం పేరు మీద సీలేరు విద్యుత్ ప్లాంట్‌లో వచ్చేది మనకు ఇవ్వలేదు.

శ్రీశైలం ప్రాజెక్టులో ఉత్పత్తికి అవకాశం ఉన్నా, ఉత్పత్తి పెంచనివ్వలేదు. చివరకు పక్కరాష్ట్రం వాళ్లకే కూడా తెలంగాణకు కరంటు ఇవ్వవద్దని చెబుతున్నాడు. కేంద్రంలో కూడా తెలంగాణకు సహాయం చేయవద్దని చెబుతాడు. ఎవరైనా పక్కింటి వాడు బాగుండాలని కోరుకుంటాడు కాని, పక్క రాష్ట్రం వాడు బాగుండాలని కోరుకుంటాడు, పక్క రాష్ట్రం వారు కరంటు కష్టాలుండాలని ఎవరైనా కోరుకుంటారా? అలాంటప్పుడు వీళ్లు ఎందుకు మాట్లాడలేదు. త్రాగడానికి నీళ్లు ఇవ్వడానికి వాటర్ గ్రిడ్ పెడితే కృష్ణా జలాలను ఇష్టం వచ్చినట్లుగా వాడుకుంటున్నారు, మీరు జాగ్రతగా ఉండండని కేంద్రానికి వెళ్లి పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతాడా? త్రాగడానికి కూడా నీళ్లు ఇవ్వనివ్వరా మీరు, ఇదేం దుర్మార్గమని ప్రశ్నించి ఉంటే బాగుండేది. ఈ రోజు అందరూ కూడా చాలా సంతోషపడేవాళ్లు.

12.40 మ. అధ్యక్షా, చాలా అంశాలున్నాయి, మీరు తొందర పెడుతున్నారు కనుక తొందరగా చెబుతాను. మనకు విద్యుత్ విషయంలో చాలా అన్యాయం జరిగింది. వర్షాలు లేక నదులలో నీళ్లు పారడం లేదు. మిగులు జలాలు లేవు ఇంక కరెంట్ ఎక్కడ నుండి వస్తుంది? తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే అసలు కరెంటే ఎవరైతే చెప్పారో, ఆయన చెంప చెళ్లు మనిపించేలా మా ముఖ్యమంత్రి గారు కరెంట్ మీద దృష్టిపెట్టి ఛత్తీస్‌ఘడ్ వెళ్లి కరెంట్‌ను తీసుకురావడం జరిగింది. ఛత్తీస్‌ఘడ్ వెళ్లక ముందే, గవర్నమెంట్ ఏర్పాటు చేయకముందే, ఏంటి సార్ ఛత్తీస్‌ఘడ్ వెళ్తానన్నావు, ఒక తీగ తీసుకొచ్చి ఇలా వేస్తే కరెంట్ వస్తుందన్నావు, ఏమయ్యిందని, వ్యంగ్యంగా మాట్లాడారు. ఈనాడు కరెంట్ వచ్చింది, రైతులు, పారిశ్రామిక వేత్తలు, ప్రజలు సంతోషపడుతున్నారు. గతంలో సెల్‌ఫోన్ ఛార్జింగ్ పెట్టుకోడానికి కూడా కరెంట్ ఉండేది కాదు, కరెంట్ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూసేవారు. కరెంట్ తీగల మీద బట్టలు ఆరేస్తే ఆ ఫోటోలు పేపర్‌లో వచ్చేవి. గతంలో అసెంబ్లీ సమావేశాలప్పుడు కంకులను తీసుకొచ్చేవారు. కరెంట్ లేదని ఆ రకంగా తెచ్చేవారు. ఇప్పుడు ఒక్కరు కూడా కంకులు తేరెందుకు? అంటే ఇది మా ప్రభుత్వ విజయం కాదా, ముఖ్యమంత్రి గారి విజయం కాదా, ముఖ్యమంత్రి గారి చిత్తశుద్ధికి ఇది నిదర్శనం కాదా అని అడుగుతున్నాను. అన్నం ఉడికిందా లేదా అని ఒక్క మెతుకు పట్టుకుంటే తెలుస్తుంది. ప్రజలందరూ ఆశ్చర్యపోతున్నారు. కరెంట్ వస్తుంది, ముఖ్యమంత్రి గారు ఎట్లా తీసుకొస్తున్నారని ఆశ్చర్యపోతున్నారు. మార్చి, ఏప్రిల్ తరువాత రైతులకు 9 గంటల కరెంట్ ఇవ్వాలని మా ముఖ్యమంత్రి గారు కంకణం కట్టుకొని కూర్చున్నారు. రానున్న రోజులలో ఈ తెలంగాణ రాష్ట్రంలో మిగులు కరెంట్ ఉంటుందని, ఎవరికైనా కరెంట్ కావాలంటే మనం ఇచ్చే విధంగా ఉండబోతుందని మనవి చేస్తున్నాను. ముఖ్యమంత్రి గారి దగ్గరకు మీరు ఎప్పుడైనా వెళ్లి చూడండి, ఆయన ముందు పెద్ద కంప్యూటర్ ఉంటుంది. కరెంట్ ఎంత ఉత్పత్తి అవుతుంది, ఎంత తగ్గుతుంది, ఎప్పుడు డౌన్ అవుతుందని స్వయంగా ఆయనే గమనించేవారు. ఆయనే ఫోన్ చేసి, జాగ్రత్త అని అధికారులను హెచ్చరించిన ముఖ్యమంత్రి ఎక్కడైనా ఉన్నారా అని అడుగుతున్నాను.

వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసి, వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకోవాలని ముఖ్యమంత్రి గారు ఆలోచించారు. వ్యవసాయం

సక్రమంగా జరిగితేనే తెలంగాణ ప్రజల బతుకులు బాగుపడతాయని రైతులకు రుణమాఫీ చేశారు. ప్రభుత్వం ఏర్పడిన మూడవ రోజే ప్రభుత్వం తప్పు చేసింది, అయిపోయింది ప్రభుత్వం, రుణమాఫీ ఎగ్గొడుతుందని రైతులను రోడ్లపైకి పంపించి ధర్నాలకు దింపారు. ఆ రోజు స్పష్టంగా చెప్పడం జరిగింది. మీ దగ్గరకు బ్యాంకు అధికారులకు రారు, మీరు వడ్డీ కట్టవలసిన అవసరం లేదు, ఖచ్చితంగా మాది బాధ్యత, దశల వారీగా రుణమాఫీ చేసుకుందాము, ఉన్న డబ్బు మొత్తం కడితే రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోలేమని రైతులను సముదాయించడం జరిగింది. వాళ్లు తప్పుడు ప్రచారం చేసి, కన్ఫ్యూజ్ చేశారు అధ్యక్షా. ఆత్మహత్యలు చేసుకోవాలని చాలా మంది ఉసిగొల్పారు. ప్రజలు అర్థం చేసుకున్నారు. మూడు విడతల రుణమాఫీ అయిపోయింది. ఒంకొక విడత ఉంది. తొందరలోనే అది కూడా పూర్తవుతుంది. ఈ ప్రభుత్వం తొమ్మిది గంటల కరెంట్ ఇవ్వడానికి కంకణం కట్టుకుంది. ఇన్‌పుట్ సబ్సిడీ కూడా ఇవ్వడం జరిగింది. ఆర్మూర్‌లో మొక్కజొన్న రైతులు ధర్నా చేస్తే వాళ్లను ఇష్టం వచ్చినట్లు కొట్టారు. తెలంగాణలోని రైతులు ఎక్కువగా వరి, మొక్కజొన్న పంటలు వేస్తారు. ఇవే కాకుండా కూరగాయలు కూడా వెయ్యాలని ముఖ్యమంత్రి గారు ప్రోత్సహించారు. హైదరాబాదులో కోటిన్నర మంది జనాభా ఉన్నారు. మద్రాసు, బెంగుళూరుల నుండి కూరగాయలు తీసుకొచ్చి సప్లై చేస్తున్నారు కాబట్టి మీరే పండించి నగర ప్రజలకు కూరగాయలు సప్లై చెయ్యాలని, పాలీ హౌస్, గ్రీన్ హౌస్‌లకు ముఖ్యమంత్రి గారు సబ్సిడీలను ఇవ్వడం జరిగింది. ఎస్.సి, ఎస్.టి లకు నూరు శాతం సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. హార్టికల్చర్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి రైతులు ఆత్మహత్యలు చేసుకోకుండా ఉండే విధంగా ప్రభుత్వం ఆలోచిస్తుంది. ప్రభుత్వం వ్యవసాయ రంగంపై పూర్తి భరోసాను కల్పించింది. గత ఇరవై సంవత్సరాలుగా 35 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఆ విధంగా రైతులు ఆత్మహత్యలు చేసుకోకూడదని ముఖ్యమంత్రి గారు ప్రయత్నం చేస్తున్నారు.

అధ్యక్షా, మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే ఆసుపత్రులుండాలి. గతంలో చూశాము. హాస్పిటల్‌లో anesthesia డాక్టర్ ఉంటే, ఆపరేషన్ చేసే డాక్టర్ ఉండేవారు కాదు. ఇద్దరూ ఉంటే మందులుండేవి కావు, మందులుంటే బెడ్స్ ఉండేవి కాదు. అలాంటి పరిస్థితులలో, కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రులుండాలని ప్రత్యేకంగా, ప్రతి జిల్లా హెడ్ క్వార్టర్‌లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మెడికల్ కళాశాలలుండాలని మా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం జరిగింది. వైద్యం నిమిత్తం చాలా మంది ఆంధ్రా ప్రాంతం నుండి, ఇతర రాష్ట్రాల నుండి, దేశాల నుండి హైదరాబాదుకు వస్తున్నారు. పేద వాళ్లు కూడా కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్తున్నారు. వారి వద్ద డబ్బు లేక అప్పుల పాలవుతున్నారు. ఈ ప్రభుత్వం చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్‌ను పెట్టడం జరిగింది. గవర్నమెంట్ ఆసుపత్రులను డెవలప్ చెయ్యాలని, హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో నాలుగు పెద్ద ఆసుపత్రులను ఏర్పాటు చెయ్యాలని ఆలోచిస్తున్నారు. గాంధీ, ఉస్మానియా, నిమ్స్, కింగ్‌కోటి, నీలోఫర్ ఆసుపత్రులు నిజాం కాలం నుండి ఉన్నాయి. ఆ తరువాత కొన్ని ఆసుపత్రులు వచ్చాయి. ఇంకా కొన్ని ఆసుపత్రులను తీసుకొచ్చి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చెయ్యాలని నిధులు కేటాయించడం జరిగింది. అందుకు ఇతర రాష్ట్రాల వారు, దేశాల వారు కూడా ముందుకు వస్తున్నారు. నెదర్లాండ్‌కి చెందిన ఎన్‌రాఫ్ - నోరియస్ సంస్థ అయిదు వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టి, హాస్పిటల్స్‌ను డెవలప్ చెయ్యాలని ముందుకు వచ్చింది. మనకు 60 డయాలసిస్ సెంటర్లు, 60 డయాగ్నస్టిక్ సెంటర్లు వచ్చాయి. ప్రజా సంక్షేమం పై ఈ ప్రభుత్వం దృష్టి పెట్టింది. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, కళ్యాణ లక్ష్మి వంటి స్కీమ్స్ బ్రహ్మాండంగా అమలవుతున్నాయి. పేద వర్గాల వారికి మేలు చేకూర్చాలని మా ముఖ్యమంత్రి గారు ఈ పథకాలు ప్రవేశపెట్టారు. నిరుద్యోగులకు సంబంధించి త్వరలో రిక్రూట్‌మెంట్ జరగబోతుంది. ఆర్.టి.సి వారికి 44 శాతం ఫిట్‌మెంట్, ఉద్యోగులకు 43 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని అదే విధంగా హోమ్‌గార్డులు, అంగన్‌వాడీ వర్కర్ల జీతాలు పెంచాలని, ముఖ్యమంత్రి గారికి చెప్పాము, వారు పెంచారు. ఇవన్నీ కేవలం అరగంట, పది నిమిషాలలో చర్చించి చర్య తీసుకున్నాము. ఇవన్నీ చేస్తే, ఇంత అగౌరవంగా మాట్లాడుతున్నారంటే ఇది సమంజసమా అని అడుగుతున్నాను. అన్ని మతాల వారు అన్ని పండుగలు జరుపుకోవాలని అందరినీ గౌరవించే విధంగా. ముఖ్యమంత్రి గారు చర్య తీసుకున్నారు. పారిశ్రామిక విధానాన్ని అభివృద్ధి చేశారు, ఐ.టి రంగాన్ని అభివృద్ధి చేశారు. అందరూ ప్రభుత్వ ఉద్యోగాలే కాదు, ప్రైవేట్ ఉద్యోగాలు కూడా చేసుకోవాలని, అమెరికాలోనే కాదు ఇక్కడ కూడా ఉద్యోగాలు చేసుకోవాలని ముఖ్యమంత్రి గారు చెప్పడం జరిగింది. హైదరాబాదులో పెట్టుబడులు రావాలన్నా, షాపులు పెరగాలన్నా, శాంతిభద్రతలు అనేది ముఖ్యం అధ్యక్షా. గతంలో గప్‌చిప్‌లు తిందామంటే గోకుల్ ఛాట్ గుర్తుకొచ్చేది, పార్క్‌కి వెళ్లాలంటే లుంబినీ పార్క్ గుర్తుకొచ్చేది. ఎక్కడికైనా వెళ్లి దేవుడిని మొక్కదామంటే

J-38-6.

దిల్‌సుఖనగర్‌లోని సాయిబాబా గుడి గుర్తుకొచ్చేది. హైదరాబాదులో షూటింగ్స్ ఎక్కువగా జరుగుతుంటాయి, స్టూడియో అంటే రామానాయుడు స్టూడియో గుర్తుకొచ్చేది. కాని ఎక్కడికి వెళ్దామన్నా భయంగా ఉండేది. సినిమాకి వెళ్దామనుకున్నా ఎక్కడ బాంబులు పేలుతాయోనని ప్రజలు భయభ్రాంతులకు గురయ్యేవారు. ఈ రోజు లక్ష సీసీ కెమేరాలను పెట్టి, షీటీమ్స్‌ని పెట్టి కట్టుదిట్టమైన చర్యలను తీసుకోవడం జరిగింది. హైదరాబాద్‌లో, బంజారా హిల్స్‌లో ఎన్నో రేప్ కేసులు జరిగాయి. రాత్రి పూట మహిళలు ఐటీ కంపెనీలకు వెళ్లి వస్తుంటే బలవంతంగా లాక్కెళ్లిన సందర్భాలున్నాయి. ఈరోజు నిమిషంలో, పది నిమిషంలో పోలీసులు వచ్చే విధంగా చర్యలు తీసుకున్నాము. వాళ్లకు వాహనాలు కొనుగోలు చేసి జీతాలు పెంచడం జరిగింది. వారు ఆత్మగౌరవంతో పనిచేసే విధంగా, వారికి విశ్వాసాన్ని కలిగించి, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రయత్నం చేస్తున్న సంగతిని, వారికి అత్యధిక నిధులను కేటాయిస్తున్న సంగతిని కూడా గుమనించవలసిన అవసరం ఉంది.

12.50 ప. గతంలో మునిసిపాలిటీలలో ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికే చాలా కష్టంగా ఉండేది. కౌన్సిలర్లు, ఛైర్మన్‌ల జీతాలు ఇవ్వాలంటే కూడా ట్యాక్సులు వసూలు చేసిన తరువాత వారికి జీతాలిచ్చే పరిస్థితి ఉండేది. మా ప్రభుత్వం వరంగల్ కార్పోరేషన్‌కి రూ.100 కోట్లు, కరీంనగర్ మునిసిపాలిటీకి రూ.500 కోట్లు కేటాయించి మునిసిపాలిటీలలో నిధుల లేమి లేకుండా గర్వంగా ఉండే విధంగా గౌరవ ముఖ్యమంత్రి గారి చొరవ తీసుకొని బడ్జెట్‌లో మునిసిపాలిటీలకు నిధులు కేటాయించి అన్ని వర్గాల వారికి ప్రాధాన్యతనిచ్చి ముందుకు తీసుకెళ్లడం చాలా హర్షించదగిన విషయం. కేవలం 21 మాసాలలో తెలంగాణ ఏ రకంగా అభివృద్ధి చెందిందో పరిశీలన చేసుకోవాలి.

కేసీఆర్ గారు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు నచ్చాయి కాబట్టే రాష్ట్రంలో ఏ ఎలక్షన్‌లు వచ్చినా వరంగల్, ఖమ్మం, హైదరాబాదు, అచ్చంపేటలోనైనా ప్రజలు బ్రహ్మాండంగా బ్రహ్మరథం పట్టారు. ప్రజలు మా ప్రభుత్వానికి అండగా ఉన్నారని చెప్పడానికి ఈ ఎలక్షన్‌లే నిదర్శనం. ప్రభుత్వం బాగుండాలంటే ఎలక్షన్‌లు ముఖ్యం. ఎలక్షన్‌ల పనితీరే ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం. రాష్ట్ర ప్రజలందరూ ఎంతో సంతోషంగా ఉంటే ప్రతిపక్షాలకు ఇష్టం లేదు. నేను ప్రతిపక్షాలకు చేతులెత్తి నమస్కరించి కోరుతున్నదేమిటంటే మనం పక్క రాష్ట్రం ముందు అభాసుపాలు, చులకన కాకుండా ఉండేందుకు మనమంతా ప్రయత్నించాలి. ప్రతిపక్ష సభ్యులలో ఎంతో మంది అనుభవజ్ఞులున్నారు, ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ కోసం కొట్లాడి ఎన్నో రకాల సంక్షేమ పథకాలు తెచ్చినవారున్నారు, అప్పుడు ఆంధ్ర ప్రాంతానికి చెందినవారు ఎంత భయపెట్టినా భయపడకుండా మాట్లాడినవారు ఉన్నారు. కాబట్టి అనుభవజ్ఞుల సలహాలను ముఖ్యమంత్రిగారికిచ్చి కచ్చితంగా ఏ ప్రాజెక్టు విషయంలో మీకు అనుమానాలున్నా తప్పులను సరిదిద్దుకొని ముందుకెళ్లడానికి యావత్ తెలంగాణ రాష్ట్రం మరియు ఈ శాసనసభ మొత్తం ఏకతాటిపై ఉండాలని కోరుకుంటున్నాను. అభివృద్ధిపై రాజీపడే ప్రసక్తే లేదనే సందేశాన్ని ఇవ్వాల్సిందిగా మీద్వారా గౌరవసభ్యులకు తెలియజేస్తూ మరొక్కసారి మన ముఖ్యమంత్రి గారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

**డా.కె. లక్ష్మణ్: అధ్యక్షా, గౌరవ ఆర్థిక శాఖామాత్యులు శ్రీ ఈటెల రాజేందర్ గారు, కొత్త రాష్ట్రం, కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత ముచ్చటగా మూడవసారి ఆర్థిక మంత్రి హోదాలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం, ఆ బడ్జెట్ మీద బి.జె.పి శాసనసభ్యుడిగా, శాసనసభాపక్ష నేతగా నాకు మాట్లాడే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉన్నది. అమరవీరుల త్యాగాల వల్లనే ఇది సాధ్యమైందన్న విషయాన్ని మనం మర్చిపోకూడదు. ఈ త్యాగాల పునాదుల మీద ఏర్పడిన ఈ రాష్ట్రం ఎవరి జీవితాల బాగుకోసమని ఆరోజు ఉద్యమం చేశామో బహుశా ఆర్థిక శాఖామాత్యులు ఈ యొక్క బడ్జెట్‌ను రూపకల్పన చేసినప్పుడు ఒకసారి స్మరించుకున్నట్లైతే బాగుండేదని నేను భావిస్తున్నాను. ఎందుకంటే మన తెలంగాణ రాష్ట్రానికి, ప్రాంతానికి ఒక గొప్ప చరిత్ర ఉన్నది. ఈ రాష్ట్రంలో ఉద్యమాలు, సామాజికపరమైన అవగాహన, పోరాటాలు ఈ ప్రాంతానికి కొత్తేం కాదు. నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి పొందడానికి ఆరోజు ఆ బానిస సంకెళ్ల నుంచి విముక్తి కావడానికి పోరాడిన అనేక మంది యోధానుయోధులు దొడ్డి కొమరయ్య నుంచి మొదలుకుంటే దొడ్డి మల్లయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగి, సుద్దాల హన్మంతు, వై.రాజారాం, షర్ముల్లాఖాన్, మగ్దూల్ మొయినుద్దీన్‌ల త్యాగాల పోరాటాలే మనందరినీ సర్వ స్వతంత్రులను చేయడమే కాకుండా భారత పౌరులుగా చెలామణి అయ్యే అవకాశం కల్పించారంటే అది వారి త్యాగాలకు జోహార్లు.

తెలంగాణ రాష్ట్రం మలిదశ ఉద్యమం గురించి కూడా మీకు తెలుసు. స్వయంగా మీరు కూడా ఆ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. ఉద్యమంలో దాదాపు 1200 మంది ప్రాణత్యాగాలు చేశారు. వారి త్యాగాల పునాదుల మీదనే ఈ రాష్ట్రం ఏర్పడింది. శ్రీకాంతాచారి బలిదానం నుంచి మొదలుకుంటే

**An asterisk before the name indicates confirmation by the Member

పార్లమెంటు సాక్షిగా ఢిల్లీలో ఉరివేసుకుంటే గానీ ఆనాటి పాలకులకు కనువిప్పు కాదనే ఆలోచనతో హైదరాబాదు నుంచి రైలులో బయలుదేరిన ఆదిరెడ్డి బలిదానాన్ని మనం విస్మరించలేము. నేను మరియు హరీశ్‌రావు గారు ఆరోజు ఆదిరెడ్డి గారి శవాన్ని తీసుకొచ్చేందుకు ఢిల్లీలోనే ఉన్నాము. ఇదంతా ఒక చరిత్ర. చరిత్రను విస్మరించినా, మర్చిపోయినా భావితరాలు మనల్ని క్షమించరు. ఆరోజు జె.ఏ.సి ఆధ్వర్యంలో మిలియన్ మార్చ్ కానివ్వండి, సకల జనుల సమ్మె కానివ్వండి, సాగరహారం కానివ్వండి ఉద్యమంలో పాల్గొని నిలువెత్తు నెత్తుటిగాయాలతో సతమతమైనవారు, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కూడా వారి బాధలు, ఆవేదనలు ఇప్పటికి కూడా కొనసాగుతుంటే హృదయం కలచివేస్తున్నది.

రెండు రోజుల క్రితం యాకయ్య స్వామి యాదవ్ గారి సంస్మరణ సభకు వెళ్లితే అక్కడున్న వక్తలు చెబుతున్న ఆవేదన, స్వయంగా వారి సోదరుడు రాములు అనే వ్యక్తి మిలియన్ మార్చ్‌లో గాయపడి రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం నుంచి సహాయం కోసం ఎదురుచూస్తూ ఆ కుటుంబం ఆర్థిక భారం తట్టుకోలేక లక్ష రూపాయలు అప్పుచేసి వారి చికిత్స కోసం పడుతున్న బాధలు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడనే సంఘటన విన్న తరువాత నా హృదయం కలచివేసింది. అందువల్ల ఇప్పటికి కూడా 3000 మంది పైచిలుకు గాయాలపాలైన వారికి కూడా బడ్జెట్‌ను ప్రతిపాదించారా అన్న విషయం ఆర్థిక శాఖామాత్యులు ఆత్మ విమర్శ చేసుకోవాలి. సమైక్య రాష్ట్రమైనా స్వరాష్ట్రమైనా ఎవడు ఏమైతే మనకేంటి అనే ఆలోచన వచ్చినట్లైతే, ఎవడు ఏలితే మనకేంటి, మన బాధలు మనకున్నాయి, తరాలు మారినా తలరాతలు మారడం లేదనే ఆవేదన పెరిగితే మళ్లీ ఈ ప్రాంత ప్రజలు ఉద్యమాలకు శ్రీకారం చుట్టే అవకాశమున్నది. ఎందుకంటే ఈ ప్రాంత ప్రజలకు ఉద్యమాలు కొత్తకావు, పోరాటాలు కొత్తకావు.

నేను వెళ్లిన సంస్మరణ సభలో అక్కడ వక్తలు మాట్లాడిన మాటలను వింటే త్యాగాలు ఒకరివి, భోగాలు ఇంకొకరివి అనే బాధను వారు వ్యక్తం చేశారు. కాబట్టి దయచేసి కచ్చితంగా వారి కోణంలో ఆలోచనచేసి భవిష్యత్తులో అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమాలలో గాయాలపాలై హృదయవిదారకంగా కొట్టుమిట్టాడుతున్న కుటుంబాలపట్ల ప్రభుత్వం సానుకూలంగా మానవతాహృదయంతో స్పందించాల్సిన అవసరమున్నదని నేను భావిస్తున్నాను.

ఇందాక గౌరవ సభ్యులు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికలలో గెలుపు వారి పరిపాలనకు గీటురాయని చెప్పారు. ఎన్నికలలో గెలుపోటములు సహజం. గౌరవ ప్రతిపక్ష నాయకులు జానారెడ్డి గారు చెప్పినట్లుగా రాజకీయాలలో గెలుపు శాశ్వతం కాదు, ఓటమి శాశ్వతం కాదు, అధికారం అసలే శాశ్వతం కాదు. అధికారం ఇవ్వాళ ఉండొచ్చు, పోవచ్చు. ఏ సిద్ధాంతాల కోసం, ఏ విధానాల కోసమైతే మనం రాజకీయాలలో పనిచేస్తున్నామనేది ప్రజలు గమనిస్తున్నారు. రాజకీయాలు ఎప్పుడైనా మారొచ్చు, తారుమారు కావచ్చు. ఇద్దరు ఎంపీలు ఉన్న బి.జె.పి ఇప్పుడు దేశంలోనే అతి పెద్ద పార్టీగా 283 పార్లమెంటు సభ్యులతో గెలుపు సాధించడమే కాకుండా ఇప్పుడు అధికారంలో కొనసాగున్నది, ఇదొక చరిత్ర. జానారెడ్డి గారు ఒక పాజిటివ్ కోణంలో చెప్పారు. ఒకానొక సందర్భంలో కాంగ్రెస్ పార్టీ దాదాపు 400 పైచిలుకు ఎంపీలతో ఈ దేశంలో అతి పెద్ద పార్టీగా ఏ పార్టీ సాధించని విజయాలను సాధించింది. ప్రస్తుతం కాంగ్రెస్‌పార్టీ ఆ స్థాయి నుంచి ఇప్పుడు 40 స్థానాలకు పరిమితమైందంటే అది మన ప్రజాస్వామ్య గొప్పదనం.

1.00 మ. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా పిలువబడే మన భారతదేశంలో ప్రజల యొక్క తీర్పు ఏవిధంగా ఉంటుందనే దానికి ఇది ఒక మచ్చుక. మన రాష్ట్రంలో 1978వ సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సందర్భంలో వారికి 183 మంది సభ్యులు ఉన్నారు. రెడ్డి కాంగ్రెస్ పార్టీలో 29 ఎమ్మెల్యేలు, జనతా పార్టీలో 63 ఎమ్మెల్యేలుగా ఆ అసెంబ్లీలో ఉన్నారు. 1982వ సంవత్సరం వచ్చే సరికి ఆ యొక్క అసెంబ్లీ, ఇదే కాంగ్రెస్ పార్టీ 4 సంవత్సరాల్లోనే 183 మంది సభ్యుల నుంచి 280 మంది సభ్యులుగా మారారు. ఆరోజు బిజేపి, సిపియం, సిపిఐ మినహాయిస్తే జనతా పార్టీలోని అనేకమంది అధికారపార్టీలో విలీనమైన తరువాత కేవలం మిగిలింది 14 మంది మాత్రమే. ప్రతిపక్షాలకు సంబంధించిన బిజేపి నుండి ముగ్గురు సభ్యులు, సిపిఐ, సిపియం నుండి ఆరుగురు సభ్యులు మాత్రమే మిగిలారు. అయినప్పటికి 1982వ సంవత్సరంలో 280 మంది సభ్యులుగా ఉన్న అధికారపార్టీ 1983లో ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీ 69 సీట్లకే పరిమితమైంది. ఒక ప్రభంజనంలా వచ్చిన తెలుగుదేశం పార్టీ 186 మందిని గెలిచి ఒక నూతన చరిత్రను సృష్టించింది. ఆ చరిత్రకారులు ఈ ప్రాంత వాసులనే విషయాన్ని విస్మరించరాదు. 69 మంది సభ్యులు ఉన్న కాంగ్రెస్ పార్టీ చెన్నారెడ్డి గారి నేతృత్వంలో 1989లో మరల 186 స్థానాలు గెలిచి మరో చరిత్రను సృష్టించింది. ఆ చరిత్రనూ ఈ ప్రాంత ప్రజలే సృష్టించారనే విషయాన్ని మరిచిపోరాదని తెలియజేస్తున్నాను. 1994 వచ్చే సరికి మరల తెలుగుదేశం 220 మంది సభ్యులతో గెలుపొందింది. 186 మంది సభ్యులు ఉన్నటువంటి పార్టీ 1994వ

సంవత్సరం వచ్చే వరకు, ఎన్నికల ముందు కిలో బియ్యం ఒక రూపాయికే ఇస్తామని ఆరోజు స్వర్గీయ విజయ భాస్కర్ రెడ్డి గారు ఎన్నికల హామీ ఇచ్చినప్పటికీ, ప్రజలు కాంగ్రెస్‌కు భిన్నంగా తీర్పునిచ్చి వారిని 26 మంది సభ్యులకే పరిమితం చేసిన చరిత్ర కూడా ఈ ప్రజాస్వామ్యానిదే, ఈ ప్రజలదే. కాబట్టి దీనిని మరచిపోకూడదు. ఈనాటి విజయాలని చెప్పి వాటిని గర్వంగా భావిస్తే విజయ అహంకారంతో ముందుకు పోతే, గత చరిత్ర మనకు కళ్లముందు కనబడుతున్నది. వారు చెప్పినట్లుగా ఓడలు బండ్లు, బండ్లు ఓడలౌతాయి. ప్రజలు కోరుకునే, ప్రజలాశించే పరిపాలన ఉన్నట్లైతే తప్పకుండా ఆదరిస్తారు. తాత్కలికమైన గెలుపు శాశత్వం కాదనే విషయాన్ని మనం మరిచిపోకూడదని ప్రస్తావించడానికే ఈ అంశాన్ని మీ ముందు పెట్టడం జరిగింది. బడ్జెట్‌ను రూపొందించినప్పుడు ఆర్థికమంత్రి చాలా చక్కగా చెప్పారు. బడ్జెట్ అంటే చిట్టాపద్దుల పట్టిక కాదని, జీవం లేని అంకెలు, సారం లేని గణాంకాలసలే కాదని చెప్పారు. అది వాస్తవమే. **Budget is not just a collection of numbers, but expression of our values and aspirations.** బడ్జెట్ అంటే జమాఖర్చుల పట్టిక కాదని ముఖ్యమంత్రి గారు చెప్పారు. వాస్తవంగా తెలంగాణ ప్రజల యొక్క ఆకాంక్షలు, కలలను సాకారం చేసే విధంగా బడ్జెట్ ఉంటుందని ఆశించాం. కానీ, ఈరోజు ఈ బడ్జెట్‌ను చూస్తే ఈ రాష్ట్రం అప్పుల దిశలోకి నెట్టబడుతుందనే విషయం స్పష్టంగా కనబడుతోంది. ఈ బడ్జెట్‌ని ఒకసారి పరిశీలిస్తే, ఆంధ్రప్రదేశ్ సమైక్యంగా ఉన్నప్పుడు ప్రవేశపెట్టిన చివరి బడ్జెట్ **As far as my knowledge goes,** రూ.1,30,000-1,40,000 కోట్ల బడ్జెట్. చివరి బడ్జెట్ రూ.1,50,000 నుంచి రూ.1,60,000కోట్లు. విభజన జరిగిన తరువాత ఈ రెండు సంవత్సరాల్లోనే అనూహ్యమైన ఆదాయలు పెరిగిపోయినట్లుగా, రెండు రాష్ట్రాలు గొప్పలకుపోయి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రూ.1,36,000కోట్ల బడ్జెట్‌ని ప్రవేశపెడితే, తగుదనమ్మా మనకేం తక్కువని, పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లుగా రూ.1,30,000 కోట్ల బడ్జెట్‌ని ప్రవేశపెట్టారు. మొత్తం రెండు రాష్ట్రాలు కలిపి సుమారుగా రూ.2,66,000కోట్ల బడ్జెట్‌ని పెట్టుకున్నారు. ఈరోజు రెండు రాష్ట్రాల ఆదాయం కలిపితే, ఏ మేరకు ఆదాయాలు, ఖర్చులు పెరుగుతున్నాయనే విషయాన్ని మనం అర్థం చేసుకోవాలి. ఈటల బాట చూస్తే అప్పుల వేట, ఈటల అభివృద్ధి చూస్తే, ఇది అంకెల మాయాజాలమే అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రూ.1,30,415.78 కోట్లతో భారీ బడ్జెట్‌ని ప్రవేశ పెట్టారు. ప్రణాళికేతర వ్యయం రూ.62,785.14 కోట్లు, ప్రణాళిక వ్యయం రూ.67,630.73 కోట్లు. రెవిన్యూ రాబడి రూ.1,00,924.73 కోట్లుగా వారు చూపెట్టడం జరిగింది. మిగులు బడ్జెట్ రూ.3718.37 కోట్లు. ద్రవ్యలోటును రూ.23,467.28 కోట్లుగా ఇందులో చూపడం జరిగింది. ఒకగొప్ప ఆర్థికవేత్త ఆడమ్ స్మిత్ బడ్జెట్ సంపదని సృష్టించాలని చెప్పారు. సంపదను సృష్టించాలి, సృష్టించిన సంపద, మనకు ఆస్తులు ఉన్నప్పుడు వాటిని పంచే ప్రయత్నం చేయాలి, ఆస్తులు పెంచకుండా, ఆస్తులను సృష్టించకుండా పంచే ప్రయత్నం చేస్తే ఉన్న పంచె కూడా ఊడిపోయే ప్రమాదం వస్తుందనే అంశాన్ని దృష్టిలో ఉంచుకోవాలని కోరుతున్నాను. ఒక కోట్ మీరు ప్రస్తావించారు. నోబుల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్ మన దేశం ఆర్థిక అభివృద్ధిలో రెండో స్థానంలో ఉన్నదని, మానవాభివృద్ధి సూచికలో 138వ స్థానంలో ఉన్నాదని స్పష్టంగా చెప్పారు. **Yes. You are right.** ఈరోజు మనం దేశంలోనే గుజరాత్ తరువాత సర్‌ప్లస్ రాష్ట్రంగా ఉన్నామని 14వ ఆర్థిక సంఘం స్పష్టంగా చెప్పింది. మన రాష్ట్రం ఒక ధనిక రాష్ట్రమని మీరు వివరించారు. ఈరోజు మన రాష్ట్రం అక్షరాస్యతలో అధమ స్థానంలో ఉన్నది. మానవ వనరుల పై పెట్టే పెట్టుబడిని పెట్టుబడిగా భావించకూడదు. మానవ అభివృద్ధి సూచికలో, తెలంగాణ రాష్ట్రంలో నూటికి 36శాతం నిరక్ష్యరాసులు ఉన్నారు. ఈ తెలంగాణను బంగారు తెలంగాణ, ఇతరత్ర సామాజిక, నవ తెలంగాణ నిర్మాణం కోసం చేసే ప్రయత్నాల్లో మానవ వనరుల మీద పెట్టే పెట్టుబడిని విస్మరించినట్లైతే ఆ రాష్ట్రం ఏవిధంగా ముందుకు పోతుందనే విషయాన్ని ఆలోచన చేయాలని కోరుతున్నాను. రెవెన్యూని, అంకెలను, రిసీట్స్, రెవెన్యూ వనరులను ఏవిధంగా సృష్టించుకున్నాం, పెంచుకున్నామనే విషయాన్ని జానారెడ్డి గారు చాలా స్పష్టంగా వివరించారు. ఈ బడ్జెటే ఒక గందరగోళం. ఈరోజు మన మంత్రిగారు కిందది మీద, మీదది కింద పెట్టారు. మొత్తానికి ఈ బడ్జెట్ "హౌస్ ఫుల్" కాని కలెక్షన్ నిల్‌గా ఉన్నది.

1.10 మ. మొత్తం మీద చూసినట్లైతే "హౌస్ ఫుల్" కలెక్షన్ మాత్రం నిల్ అనే పరిస్థితి బడ్జెట్‌లో కనపడుతోంది. 2016-17 సంబంధించిన మొత్తం ఖర్చులు 1,30,416 కోట్ల రూపాయలుగా అంచనా వేయబడింది. అంటే ఇది దాదాపు గత సంవత్సరం రివైజ్డ్ ఎస్టిమేట్స్ కంటే 30.3శాతం ఎక్కువ అయింది. నేను చెప్పిన దానిలో వాస్తవంగా చూసినట్లైతే ఈ మార్చి చివరి వరకు ఖర్చులు చూసినట్లైతే అంత మాత్రం కూడా లేదనేది స్పష్టంగా తెలుస్తుంది. రివైజ్డ్ ఎస్టిమేట్స్ బేస్ చేసుకుని చెప్పినప్పుడు **the total expenditure for**

2016-17 is estimated to be Rs.1,30,416 crores 2015-16 సంవత్సరంలో పొందుపరచిన ఖర్చులో రూ.15,627కోట్లు తగ్గిపోయింది అంటే రివైజ్డ్ ఎస్టిమేట్స్ మీద 13.5 శాతం తగ్గిపోయింది. 2016-17సంవత్సరం వచ్చే సరికి మొత్తం రిసీట్స్ 1,04,849కోట్ల రూపాయలని It is almost an increase of 35% which is most impracticable అంటే 2016-17సంవత్సరంలో మీరు చూపించిన ఆదాయ వనరులు ఎక్కువ వస్తాయని చూపించడం జరిగింది. 2015-16లో చెప్పిన దాని కంటే 16,220కోట్ల రూపాయలు తగ్గినట్టుగా రివైజ్డ్ బడ్జెట్‌లో చూపించినట్లుగా స్పష్టంగా కనపడుతుంది. 10నెలల కోసం మొదటి బడ్జెట్ లక్ష కోట్లు ప్రవేశ పెట్టారు. అప్పుడు మీకు అనుభవం లేదు, కొత్త రాష్ట్రం, కొత్త ప్రభుత్వం ఏర్పడడం వలన లక్ష కోట్ల రూపాయలకు బడ్జెట్ ప్రవేశ పెట్టారు. కానీ, చివరకు ఖర్చు పెట్టింది 62,306కోట్లు మాత్రమే అని బడ్జెట్ బ్రీఫింగ్‌లో చాలా స్పష్టంగా చూపించారు. ఈరోజు 38వేల కోట్లు ఖర్చు కాలేదని స్పష్టంగా ఒప్పుకున్నారు. రెండవ బడ్జెట్ ఒక లక్షా పదిహేను వేల కోట్లకు ప్రవేశ పెట్టారు. ఆ రోజు జానా రెడ్డి గారు చెప్పారు, మేము చెప్పాము. మీరు ఊహల పల్లకిలో లక్ష కోట్లు పెట్టారు. ఆ స్థాయికి వనరులు ఉన్నాయా ? అంటే తప్పకుండా మేము సమకూరుస్తాము అన్నారు. తరువాత కొన్ని కారణాల వలన వనరులను రాబట్టుకోలేకపోయాము, బడ్జెట్ రాలేదు, ఖర్చు పెట్టలేకపోయామని చెప్పారు. 2015-16 బడ్జెట్‌లో రూ.1.15 లక్షల కోట్లు ప్రవేశ పెట్టినప్పుడు కూడా మేము రూ.80-85వేల కోట్ల కంటే ఎక్కువ ఖర్చు పెట్టలేరని చెప్పాము. It proved to be correct. రూ.85వేల కోట్ల కంటే ఎక్కువ మొత్తం ఖర్చు కాలేదు. డబ్బు రాలేదు, మీరు ఖర్చు పెట్టలేదు.

ఇది మూడవ బడ్జెట్ కాబట్టి, గత అనుభవంతోను, రెండు సంవత్సరాల పరిస్థితులు బేరీజు వేసుకుని ఆదాయం ఎంత, ఖర్చు ఎంత, ఎక్కడినుండి రావాల్సింది ఎంత అనే లెక్కలను పరిగణనలోకి తీసుకుని బడ్జెట్ ప్రవేశ పెడతారని ఆశించాము. ఈసారి వచ్చే బడ్జెట్ రియలిస్టిక్‌గా ఉంటుందని మేమంతా భావించాము. కానీ, ఈరోజు ఒక లక్షా ముప్పై వేల కోట్ల రూపాయలకు మీరు బడ్జెట్ ప్రవేశ పెట్టడం జరిగింది. ఇంత అవగాహన వచ్చిన తరువాత కూడా most unrealistic and imaginary figures ఇందులో పొందుపరిచి బడ్జెట్ మొత్తం అంకెల గారడిగా తయారు చేశారనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. మనం అనుకునే విధంగా వేల కోట్ల రూపాయలు సమకూర్చుకోడానికి మనకేమీ అల్లా ఉద్దీన్ అద్భుత దీపం లేదు. జానా రెడ్డిగారు చెప్పినట్లుగా పూర్తిగా అబద్ధాలతో, అవాస్తవాలతో, అప్పుల లెక్కలతో, అంకెల గారడితో ఈ బడ్జెట్ రూపొందించబడింది. 2016-17 మొత్తం ఎస్టిమేట్స్ చూస్తే లక్షా ముప్పై వేల కోట్ల రూపాయలలో లక్షకోట్లు ఖర్చు చేశారని 2015-16 సంవత్సరంలో చెప్పారు. 2014-15 సంవత్సరంలో రూ.62,306 కోట్లు ఖర్చు పెట్టారు. 2015-16 సంవత్సరంలో రూ.1,15,689 కోట్లు బడ్జెట్ ప్రవేశ పెడితే రివైజ్డ్ బడ్జెట్‌లో లక్ష కోట్ల రూపాయలని మీరు అంటున్నారు. 85వేల కోట్ల రూపాయలు కూడా దాటలేదని మేము అంటున్నాము. అది ఈరోజు మైనస్ 13.5 శాతం. 1,30,416కోట్ల రూపాయలకు మరల బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. 2015-16 బడ్జెట్‌ని 2016-17 బడ్జెట్‌తో పోలిస్తే it is an increase of 30.3% అనేది గమనించాలి. 2015-16లో రూ.20,325కోట్లు అప్పులు తెచ్చామని చెప్పారు. అందులో రూ.25,580కోట్లకు చూపిస్తున్నారు. అంటే 25.8 శాతం పెరుగుదలగా చెబుతున్నారు. రిసీట్లు చూసినట్లైతే 2015-16లో 79,835కోట్ల రూపాయలు. రివైజ్డ్ ఎస్టిమేట్స్‌లో 96,056కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని చూపించారు. రిసీట్లు చూసినట్లైతే మైనస్ 16.9శాతం తగ్గుదల ఉంది. కానీ, ఆరోజు 96వేల కోట్ల రూపాయలు వస్తాయని ఆలోచించిన మీరు ఈరోజు 1,04,849 కోట్ల రూపాయలు ఇందులో పొందు పరచారు. అంటే 96 వేల కోట్ల రూపాయలుగా చూపించి 79 వేల కోట్ల రూపాయలు రాబట్టిన మీరు 1,04,000కోట్ల రూపాయలు వస్తున్నాయంటే మరల 31.3శాతం పెరుగుతుంది. కాబట్టి, ఈ లెక్కలు వాస్తవానికి విరుద్ధంగా ఉన్నాయి.

బడ్జెట్ ప్రసంగంలో మాకు ఉన్న అనుభవం మేరకు బడ్జెటేతర ఆదాయం అని అన్నారు. జనరల్‌గా బడ్జెట్ అనేది సభ యొక్క ఆమోదం పొందుతుంది. ప్రతి రూపాయి, ప్రతి పైసా ఖర్చు మనకు వచ్చే ఆదాయానికి ఈ సభ ఆమోదం పొందుతుంది. బడ్జెటేతర ఆదాయాన్ని కూడా సభ ఆమోదం పొందే రీతిలో అందులో పొందు పరచారంటే ఇది దీని వెనకాల ఉన్నటువంటి మతలబ్ ఏమిటి. అంటే మీరు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కాని, మిషన్ భగీరథకి కాని, హైదరాబాదులోని 4కొత్త ఆసుపత్రుల నిర్మాణం గాని, ఇతరత్రా ఏవైతే ఇందులో మీరు చూపిస్తున్నారో వీటన్నింటికీ ప్రభుత్వం అప్పులు చేస్తే గాని సాధ్యం కాదని, మంత్రులు కూడా నిన్న చాలా స్పష్టంగా చెప్పారు. మిషన్ భగీరథకు సంబంధించి 30వేల కోట్ల పైచిలుకు అప్పు రావాల్సి ఉంది. 2లక్షల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు సంబంధించి 15వేల కోట్ల రూపాయలు కావాల్సి ఉంది. వీటికి సంబంధించి

బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా మనం ప్రవేశ పెట్టలేదు. ఆసుపత్రుల నిర్మాణం కోసం ప్రత్యేకంగా నిధులు సమకూర్చలేదు. ఇవన్నీ చూస్తే 50వేల కోట్ల రూపాయలు అదనంగా మనం అప్పు తెచ్చుకోవాల్సిన అవసరం ఉంది. ఈ రాష్ట్రం ఏర్పడిన నాటికే 83వేల కోట్ల రూపాయలతో అప్పుతో ఉన్న మనం, ఈ రెండు సంవత్సరాల్లో 1,23,000కోట్ల రూపాయల అప్పు వరకు మనం చేరామంటే ఆలోచించండి. అదనంగా 50వేల కోట్లకు పైగా అప్పుకు మనం ముందుకు పోతున్నామంటే, కార్పొరేషన్ ఏర్పాటు చేసినా, హౌసింగ్ బోర్డులను ఏర్పాటు చేసినా ప్రభుత్వం యొక్క గ్యారంటీతోనే, ప్రభుత్వమే రీ-పేమెంట్ చేస్తుందనే ఒక భరోసాతోనే ఆర్థిక సంస్థలు గాని, బ్యాంకులు గాని అప్పులు ఇస్తున్నాయి. అంటే ఈ అప్పులను ఎవరి మీదకి బదలాయిస్తున్నాము? అప్పుల గురించి నేను మాట్లాడినప్పుడు అప్పులు చేయడం తప్పేమీ కాదని ముఖ్యమంత్రి గారు అన్నారు. బడ్జెట్‌కు ఒక రోజు ముందు ముఖ్యమంత్రి గారు ప్రసంగిస్తూ అప్పులు చేయడం తప్పేమీ కాదని చెప్పారు. ప్రపంచంలో శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థ అయినటువంటి అమెరికా, చైనా వంటి దేశాలు కూడా పెద్ద మొత్తంలో అప్పులు చేస్తున్నాయి. ముఖ్యమంత్రి గారు చెప్పింది వాస్తవమే కావచ్చు. అమెరికా 19.3లక్షల కోట్ల డాలర్ల మేరకు అప్పు చేసింది. ఆ దేశ జిడిపిలో 103శాతం మేరకు అప్పులు ఉన్నాయి. రెండవ ఆర్థిక వ్యవస్థ చైనా అధికార లెక్కల ప్రకారం ఆ దేశ జిడిపిలో 41శాతం మేరకు అప్పులు ఉన్నాయి. మూడవ ఆర్థిక వ్యవస్థ జపాన్‌కు ఆ దేశ జిడిపిలో 230శాతం మేరకు అప్పులు ఉన్నాయి. అప్పులు చేయడం తప్పు అని చెప్పడంలేదు. కానీ, పరిధులు మించి, పరిమితులు మించి, మన స్థాయిని, స్థోమతను మించి అప్పులు చేస్తే భావి తరాలకు, భావి ప్రభుత్వాలకు అప్పులు నెట్టేస్తున్నాము తప్పితే మరేమీ లేదు.

1.20 మ. అధ్యక్షా, ప్రభుత్వాలు మారవచ్చు కానీ వ్యవస్థలు, ఇన్‌స్టిట్యూషన్స్ మారవు. కానీ అప్పులు కొనసాగుతాయనే వాస్తవాన్ని మనం గమనించాలి. ఈ అప్పులు రూ.1.23లక్షల కోట్లకు చేరుతున్నాయి. ప్రతి కుటుంబంపై రూ.1.88లక్షలు అప్పుల భారము పడుతున్నది. భవిష్యత్తులో ఈ అప్పు రూ.2లక్షల కోట్లకు చేరినా ఆశ్చర్యం లేదు. గత సంవత్సరమే వడ్డీల కోసం ప్రభుత్వం రూ.7,162 కోట్లు ఖర్చు చేశారు. 2016-2017సంవత్సరంలో వడ్డీల చెల్లింపులకు మాత్రమే రూ.7,706కోట్లు కావాలని తాజా బడ్జెట్‌లో మీరే అంచనా వేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో మూడున్నర కోట్ల జనాభా ఉన్నది. ప్రభుత్వం చేసిన తలసరి అప్పు రూ.35,373కి చేరుకునే అవకాశం వస్తోంది. ఇవన్నీ కూడా వడ్డీలపై ఉన్న అప్పులే. మొత్తాన్ని కనుక చూస్తే బడ్జెట్‌లో రూ.3వేల కోట్లుగా చూపుతున్నారు. అది రోజు రోజుకి పెరిగేదే కానీ తరిగేది కాదు. అప్పులు చేయడం తప్పు కాదు. అప్పులు చేయడం గొప్పని చెప్పడం లేదు. కానీ దీనిపై బాధ్యత ఎవరిపై ఉన్నదనే విషయాన్ని గమనించాల్సిన అవసరం ఉంది. గౌరవ ప్రతిపక్ష నాయకులు చెబుతున్నట్టుగా రివైజ్డ్ ఎస్టిమేట్స్‌లో రాబడి 30శాతం చూపిస్తున్నారు. మొత్తంగా చూస్తే రూ.85వేల కోట్లకే, యాభైశాతం అధికంగా కావాలని, పెంచే పరిస్థితి ఏ విధంగా వస్తుంది, మన వద్ద అల్లావుద్దీన్ అద్భుత దీపం ఏమి లేదు.

వ్యవసాయ సహకార రంగానికి ఈ బడ్జెట్‌లో 1.8శాతం మాత్రమే కేటాయించారు. గత సంవత్సరం వ్యవసాయ రంగానికి రూ.6,940 కోట్లు పెడితే, ఈ సంవత్సరం రూ.6,759కోట్లకు కుదించారు. ఒకవైపు కరువు మండలాలను ప్రకటించి, బడ్జెట్‌లో కరువుకి సంబంధించి నిధులు పెట్టకుండా వాటి నివారణ కోసం ఎటువంటి చర్యలు తీసుకోకుండా ఇందులో కుదించారు. వ్యవసాయం రంగం పట్ల రైతుల పట్ల, బడ్జెట్ ఏ రకంగా ఉన్నదనే విషయం ఆలోచించాలి. వ్యవసాయం రంగంలో 17 పథకాల వరకు ఉన్నాయి. గత బడ్జెట్‌లో కేటాయింపులు వేరు వేరుగా చూపించారు. కానీ ఈ బడ్జెట్‌లో పథకాలన్నీ కూర్చి ఏడు స్కీములుగా మాత్రమే చూపించారు. గతంలో రుణమాఫీ ఏక కాలంలో చేస్తే కానీ, రైతులు గట్టెక్కలేరని, అప్పులపై వడ్డీలు కట్టలేకపోతున్నారని, బ్యాంకుల్లో కొత్త అప్పులు రావడం లేదని, రైతులు ఆత్మహత్యలు చేసుకుని చనిపోతున్నారని, గత సమావేశాల్లో ఏక కాలంలో మిగతా 50శాతం రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తే ప్రభుత్వం ససేమిరా అన్నారు. మేము నిలదీసినందుకు, వాదించినందుకు మా మెడలు పట్టి, అసెంబ్లీ నుంచి బయటకు గెంటి వేయడం జరిగింది. అయినా ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో మూడో వాయిదా మాత్రం కడతాము, నాల్గవ వాయిదా మరల వచ్చే సంవత్సరం కడతామని చెప్పడం వల్ల రైతులకు ఎటువంటి ఊరట లేదు. పాడి రైతులకు మీరు ఇస్తున్న ప్రోత్సాహం ఏదైతే ఉందో వాటికి నిధులు కేటాయించ బడలేదు. పశు సంవర్ధక శాఖ అధికారులు రూ.109కోట్లు కావాలని కోరినా, ఆ విషయాలను ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోలేదు.

పాఠశాల విద్య గురించి విద్యా శాఖాధికారులు లెక్కలు వేసి రూ.16వేల కోట్లు కావాలని ప్రతిపాదించినా, కానీ ఆ శాఖకు రూ.8,574 కోట్లు బడ్జెట్‌లో పెట్టారు. 2015-16 సంవత్సరాలకు రూ.9,564కోట్లు పెడితే, ప్రస్తుతం రూ.480కోట్లు తగ్గించారు.

తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం 25,966 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వాటికి కనీస మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు లేవు. 2400 పాఠశాలలకు విద్యుత్ సౌకర్యం లేదు. 10,200 పాఠశాలలకు ప్రహరీ గోడలు లేవు. 85శాతం పాఠశాలల్లో డ్యుయల్ బెంచెస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, త్రాగునీరు, మరుగుదొడ్లు లేని పరిస్థితి. విద్య గురించి ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పినట్టుగా కే.జీ టు పీ.జీ ఉచిత నిర్బంధ ఆంగ్ల మాధ్యమంలో విద్య అన్నారు. కానీ పాలసీ కాగితం కానీ, కన్సెప్ట్ కానీ, మూడవ విద్యా సంవత్సరం పూర్తవుతున్నప్పటికీ ఖరారు కాలేదు. ఇది ప్రభుత్వం యొక్క చిత్త శుద్ధిని చాటు తున్నది. ఆర్థిక స్థోమత లేక చదువుకు దూరంగా ఉన్న వర్గాలను బడికి తీసుకువచ్చే ప్రయత్నాలు ఎంత మేర జరుగుతున్నాయనే విషయం అర్థం పడుతోంది.

తెలంగాణ రాష్ట్రంలో యూనివర్సిటీలకు పూర్తిగా కష్టకాలం. ఉన్నత విద్యకు పెరగని కేటాయింపులు, సాంకేతిక విద్యకు కోత. పి.ఆర్.సి మేరకు వేతనాలు అందని పరిస్థితి. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి ఇందులో ఒక్క పైసా కూడా కేటాయించబడలేదు. ముఖ్య మంత్రి గారు గతంలో గ్రాంట్స్ ఇవ్వమన్నారు. కానీ ప్రస్తుతం జీతాలు ఇవ్వలేని పరిస్థితుల్లో ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలు ఉన్నాయి , సిబ్బంది, ప్రొఫెసర్లు, వి.సి.ల నియామకాలు లేవు. అధ్యాపకులు, ఉపాధ్యాయులకు, పెరిగిన డి.ఏలకు సంబంధించిన నిధులు కూడా అందులో లేవు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనలు పెరిగినప్పటికీ బడ్జెట్‌లో వీటిపై స్పష్టత లేదు. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్స్ లేవు. ఎంప్లాయిస్, టీచర్స్‌కి హెల్త్ కార్డ్స్ అన్నారు. కానీ ఇవన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి.

విద్యుత్ అంశంపై 2016-17 సంవత్సరంతో పోల్చి చూస్తే చాలా వ్యత్యాసం కనపడుతుంది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అన్నారు. సామాన్య ప్రజలకిచ్చే సబ్సిడీ గణనీయంగా తగ్గిపోయాయన్నారు. దీనివల్ల డిస్కంలు ఆర్థికంగా మరింత కుంగిపోయే పరిస్థితి వస్తోంది. రాష్ట్రంలోని విద్యుత్ కొరత అధిగమించడానికి బయట నుంచి కొంటున్న విద్యుత్ భారంలో కొంత మాత్రమైన ప్రభుత్వం భరిస్తుందని ఆశించాము. కానీ మిగిలిన భారమంతా డిస్కంలపై పడుతుందంటే, అది ప్రజలపైనే తప్పకుండా భారం పడబోతోందని చెప్పడంలో ఏ మాత్రం కూడా నాకు అనుమానం లేదు.

2014-15 ఇందన శాఖకు రూ.4,278కోట్లు కేటాయిస్తే, రూ.3,500 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. గృహ అవసరాల కోసం విద్యుత్ టారీఫ్ సబ్సిడీ సొమ్మును రూ.4,257కోట్లు ప్రకటించి రూ.3,190కోట్లు మాత్రమే విద్యుత్ పంపిణీ డిస్కంలకు ప్రభుత్వం చెల్లించింది. అందులో రూ.1,64.31కోట్ల సబ్సిడీ సొమ్మును పూర్తిగా ప్రభుత్వం ఎగవేసింది. అంతిమంగా ఈ భారం డిస్కంలపై పడుతుందంటే, ప్రజలపై పడే పరిస్థితి వస్తోంది.

సంక్షేమం కోసం రూ. లక్షకోట్లు ఐదు సంవత్సరాల్లో ఎస్.సి, ఎస్.టి, బి.సి, మైనారిటీ వర్గాల సంక్షేమం కోసం ఖర్చు పెడతామని చెప్పిన ప్రభుత్వం. బి.సిలకు 2014-15 సంవత్సరంలో రూ.2,22కోట్లు కేటాయించారు. కానీ ఖర్చు చేసినది రూ.1,90కోట్లు మాత్రమే. బి.సిలకు 2015-16 సంవత్సరంలో కేటాయించినది రూ. 2,172కోట్లు, కానీ ఖర్చు చేసింది రూ. 7,25 కోట్లు మాత్రమే. ఎంత వ్యత్యాసం ఉన్నదనే విషయాన్ని మీరు గమనించండి. ఎస్.సి, ఎస్.టిలకు2014-15 సంవత్సరంలో రూ.3,257కోట్లు కేటాయించారు, ఖర్చు చేసినది రూ.1,254 కోట్లు మాత్రమే. 2015-16 సంవత్సరానికి రూ.4,500కోట్లు కేటాయించారు.

మిస్టర్ స్పీకర్ : ప్లీజ్ కంక్లూడ్.

శ్రీ డా.కె. లక్ష్మణ్: నేను సబ్జెక్టు నుంచి డీవియేట్ అవడం లేదు. ఆర్థిక మంత్రి గారు నోట్ చేసుకుని వీటిపై క్లారిఫై చేస్తారని ఆశిస్తున్నాను. ఎస్.టిలకు 2014-15 సంవత్సరంలో రూ.1549కోట్లు కేటాయిస్తే, రూ.700కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు. 2015-16 సంవత్సరంలో రూ.1200కోట్లు కేటాయిస్తే, ఖర్చు చేసినది రూ.129కోట్లు మాత్రమే. మైనారిటీలకు రూ.వెయ్యి కోట్లన్నారు, కానీ ఖర్చు పెట్టింది రూ.332 కోట్లు మాత్రమే. 2015-16 సంవత్సరానికి రూ. 1100 కోట్లు కేటాయిస్తే, ఖర్చు పెట్టినది రూ.420 మాత్రమే. కనుక తెలంగాణ రాష్ట్రంలోని ప్రజల సంక్షేమం గురించి తెలంగాణ వస్తే సామాజిక న్యాయం వస్తుందని ఆశించి తెలంగాణ తెచ్చుకుంటే, సంక్షేమాన్ని పూర్తిగా సంక్షోభంలోకి నెట్టి వేసేసినది. ఎస్.సిలకు రూ.50వేల కోట్లన్నారు, బి.సిలకు రూ.25వేల కోట్లన్నారు, ఇవాళ అన్ని ఫెడరేషన్స్ మూత పడుతున్నాయి. కుల వృత్తులన్నీ ఇవాళ నిర్వీర్యమౌతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో 54శాతం బి.సి.లు ఉంటే, బి.సి సబ్‌ప్లాన్ పెట్టాలని ఆశించి, ఉద్యమిస్తుంటే, దాన్ని పూర్తిగా అటకెక్కించారు. చేతి వృత్తుల వారికి ఉపాధిని మెరుగుపరచుకునేందుకు లేకుండా ఉన్న ఫెడరేషన్స్ అన్నీ మూత పడుతున్నాయి. బడ్జెట్‌లో చేతి వృత్తుల వారికి పూర్తిగా మొండి చేయి చూపించారు. వీరికోసం రూ.153కోట్లు మాత్రమే కేటాయించడం జరిగింది. సమగ్ర సర్వే ప్రకారం

11ఫెడరేషన్ల కులాల జనాభాకు అనుగుణంగా 60 లక్షల పైచిలుకు ఉన్నారని తెలిపితే, వీరందరూ కలిసి 12,900 సొసైటీలుంటే మీరు కేటాయించిన నిధులు ఏ మేరకు అన్న విషయాన్ని ఆలోచన చేయండి. ఏ రకంగా వర్గాల యొక్క అభ్యున్నతి కోసం, అభివృద్ధి కోసం మీరు చర్యలు చేపట్టకుండా బంగారు తెలంగాణ కావాలంటే, 54శాతంపైగా జనాభా ఉన్న ఎస్.సి, ఎస్.టి, మైనారిటీల పట్ల మీ బడ్జెట్ ఏ విధంగా దోహదపడుతుందో ఒకసారి ఆర్థిక మంత్రి గారు ఆత్మ విమర్శ చేసుకోవాలని కోరుతున్నాను.

ఎస్.సి, ఎస్.టి.లకు మూడెకరాల భూమి పంపిణీ అన్నారు. ఎన్ని వందల కుటుంబాలకు భూ పంపిణీ జరిగింది. ఏ రకంగా వ్యవసాయ యోగ్యం కాని భూమి ఇచ్చారు. ఈ విషయం కాగితాలకే పరిమితమైందని గణాంక వివరాలు స్పష్టంగా తెలుపుతున్నాయి. సాచురేషన్ మోడ్‌లో కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్, పెన్షన్ స్కీమ్ అన్నారో, అది జనాభాకు అనుగుణంగా సాచురేషన్ మోడ్‌కి వచ్చిందా ఒకసారి ఆర్థిక మంత్రి గారు అనేకమైన ఇబ్బందులు, అనేకమైన ఆంక్షలు పెట్టి, వారికి అందుబాటులోకి రాకుండా మూడున్నరకోట్ల జనాభాలో ప్రజలుంటే, ఈ వర్గాల ప్రజలు 85శాతముంటే, 35లక్షల మందికి పింఛన్ ఇచ్చామని చేతులు దులపడం వల్ల ఏ రకంగా సాధ్యమవుతుంది. ఫీజ్ రీఇంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు బకాయిలు చెల్లించకుండా మీరు ఏ రకంగా వ్యవహరిస్తున్నది చూస్తున్నాము.

1.30 మ. నిన్న అర్చకులు ఒక సభ పెడితే దానికి నేను హాజరయ్యాను. తెలంగాణ ఉద్యమంలో అర్చకులు కూడా పాల్గొన్నారు. అప్పుడు కెసిఆర్ గారు, వాళ్లకు మేము న్యాయం చేస్తాం. వాళ్లను ఉద్యోగులుగా పరిగణిస్తాము. లేదా ఉద్యోగులతో సమానంగా వారికి వేతనాలు కల్పిస్తామని చెప్పారు. ఈ రోజు ఆ ఊసే లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం వారు స్పష్టంగా చెప్పండి. ప్రజలకు ఇచ్చిన హామీకి అనుగుణంగా వాళ్లను ఉద్యోగులుగా పరిగణిస్తారా లేదా వారికి సమాన వేతనం ఇస్తారా అనే విషయంలో స్పష్టత ఇవ్వవలసినదిగా కోరుతున్నాను. పదవ పిఆర్‌సిని కూడా వారికి ఎప్పటిలోగ ఇస్తారో చెప్పండి.

ప్రభుత్వ ఉద్యోగుల పిఆర్‌సి బకాయిలు ఈ ఆర్థిక సంవత్సరం కూడా చెల్లించే పరిస్థితి కనబడడం లేదు. అందుకు ఉద్యోగస్తులు, ఉపాధ్యాయులు చాలా ఆందోళన చెందుతున్నారు. 9నెలలుగా ఈ బకాయిలు ఎందుకు ఇవ్వడం లేదని అడుగుతున్నాను. ఇవాళ 43శాతం ఫిట్‌మెంట్ అంటున్నారు. 21 నెలలు అవుతుంది హెల్త్ కార్డులు అన్నారు, కానీ ఆ కార్డులు కూడా పనికి వచ్చే పరిస్థితిలో లేవు. అవి చెల్లని కార్డులుగా మారిపోతున్నాయి. కొత్తగా 25,000 ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేస్తున్నామని చెబుతున్నారు. వాటి వివరాలను కూడా తెలుపవలసినదిగా కోరుతున్నాను. మీరు చెప్పే దానికి చేసే దానికి పొంతన లేదని మీకు మరొక్కసారి గుర్తు చేస్తున్నాను. ఒక విషయాన్ని ఆర్థిక మంత్రి గారు గమనించాలి. 1982 సంవత్సరం నుంచి ఆంధ్రప్రదేశ్‌లో భూఆక్రమణ చట్టం ఏదైతే భారతరాష్ట్రపతి ఆమోదం పొంది ఉన్నదో దాని కోసం ఉన్న స్పెషల్ కోర్టులను, రెండు రాష్ట్రాలలో ఇప్పుడు పూర్తిగా రద్దు చేశారని మళ్లీ దాన్ని నియామకం చేయలేదని నాకు అర్జీలు అందుతున్నాయి. ఈ రోజు భూఆక్రమణలు రోజురోజుకు పెరుగుతున్నాయి. వాటి మీద కూడా ఆలోచన చేయవలసినదిగా ఆర్థిక శాఖ మంత్రి గారిని కోరుతున్నాను.

నిరుద్యోగుల గురించి చూస్తే 1,07,000 ఉద్యోగాల కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏ మాత్రం ప్రతిబింబించడం లేదు. దీని మీద కూడా ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరుతున్నాను. అదేవిధంగా క్రీడా రంగానికి సంబంధించినటువంటి విషయంలో మెరిటోరియస్ స్పోర్ట్స్‌మెన్‌కు 2శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి. జి.ఓ.74 ను తెలంగాణ ప్రభుత్వం అమలు చేయవలసిన బాధ్యత ఉన్నది. స్పోర్ట్స్ టీమ్ వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలల్లో ఆడటానికి వెళ్లి వస్తుంటారు. వారి బిల్లులు కూడా ఇంకా పెండింగ్‌లో ఉంటున్నాయి. ఆ బిల్లులను ప్రభుత్వం త్వరగా చెల్లించవలసినదిగా కోరుతున్నాను.

ఇటీవల ప్రభుత్వ ఆసుపత్రులు చాలా దయనీయంగా మారిపోయాయి. ఇవాళ పేద వారికి ఏమైనా జబ్బు వచ్చినట్లయితే వారి ప్రాణాలు గాలిలో కలసిపోయే పరిస్థితి తప్ప వారిని ఆదుకునేటువంటి పరిస్థితి లేదు. ప్రైమరీ హెల్త్ సెంటర్లు లేవు, డాక్టర్ల కొరత ఉన్నది. వీటన్నింటి మీద ప్రభుత్వం ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలి. హౌసింగ్ విషయానికి వస్తే కేంద్రప్రభుత్వం ఇప్పటికే తెలంగాణ రాష్ట్రానికి 85వేల బిల్లులను మంజూరు చేసింది. ఒక్కొక్క ఇంటికి రూ.1,50,000 నిధులను మంజూరు చేసింది. టిఆర్ఎస్ ప్రభుత్వం ఇటీవల హైదరాబాద్, వరంగల్ మున్సిపల్ ఎన్నికల్లో గెలవడానికి కారణం ఈ రెండు పడకల ఇళ్ల పథకం కారణం. ప్రజలు ఈ రోజు కళ్లల్లో వత్తులు పెట్టుకొని దరఖాస్తులు పెట్టుకొని కాళ్లు అరిగిపోయే విధంగా తిరుగుతున్నారు. బడ్జెట్‌లో ఈ పథకానికి ఎటువంటి కేటాయింపులు లేవు. వాటికి ఏ రకంగా అప్పులు

తీసుకుని వచ్చి కడతామనే దాని మీద కూడా స్పష్టత ఇవ్వవలసినదిగా కోరుతున్నాను. పరిశ్రమల విషయంలో కెసిఆర్ గారు తెలంగాణ ఉద్యమం జరుగుతున్న సందర్భంలో పరిశ్రమలను పునరుద్ధరిస్తామని చెప్పారు. ఇప్పుడు పరిశ్రమల గురించి చర్చ లేదు. ఒసిటిఎల్, నిజాం షుగర్స్, అజాంజాహి మిల్స్, సిర్పూర్, కాగజ్‌నగర్, ఆల్విన్, డిబిఆర్ మిల్స్, నేత స్ప్రింగిల్ అనేక పరిశ్రమలు మూతబడ్డాయి. వాటి పునరుద్ధరణ గురించి కనీసం ఎక్కడా ప్రస్తావించలేదు. వాటిని పూర్తిగా మీరు విస్మరించినట్లుగా కనబడుతుంది. అలాగే 108 విషయంలో శాసనసభ్యులు వినయ్ భాస్కర్‌గారు, గాదరి కిషోర్‌గారు ఇద్దరు కలసి కమిటీ వేసినట్లుగా సమాచారం వచ్చింది. 108 వారి బాధలు వర్ణనాతీతము. రాత్రి, పగలు అని తేడా లేకుండా నిరంతరం సేవలను అందించే వాళ్ల సేవలు మరచిపోలేనివి. ఆ కమిటీని సభ ముందు పెట్టమని ఆర్థిక మంత్రిగారిని కోరుతున్నాను. ఎక్కడ అక్రమాలు జరిగాయి, ఏ విధంగా అన్యాయం జరిగిందో చూడండి. కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాత కూడా కమిటి నివేదికను ఎందుకు ముందుకు పెట్టలేదో ఒక్కసారి దయచేసి ఆలోచన చేయవలసినదిగా కోరుతున్నాను. మరొక అంశం ఎస్‌డిఎఫ్. ముఖ్యమంత్రికి సర్వాధికారాలు ఉన్నాయన్న పేరుతో రూ.4,675కోట్లు ఎస్‌డిఎఫ్‌కు బడ్జెట్‌లో కేటాయించారు. ఇది రాజ్యాంగబద్ధమా అని అడుగుతున్నాను? గతంలో కంటిన్యూటీ ఫండ్ క్రింద రూ.500కోట్లు ఉన్న దాన్ని అవసరమయితే రూ.1000కోట్లు చేసుకునే అవకాశం ఉండేది. ఏకంగా ఈ రోజు రూ.4,675కోట్లు పొందుపరచారంటే ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం. ఏ మేరకు ఇది చెల్లుబాటు అవుతుందో ఆలోచన చేయాలి. దయచేసి ఒకసారి దీని మీద పరిశీలన చేయవలసినదిగా కోరుతున్నాను. ఎందుకంటే బి.సి.ల సంక్షేమం కంటే ఎస్‌డిఎఫ్ నిధులకే ఎక్కువగా కేటాయించిన విషయాన్ని నేను మంత్రి గారి దృష్టికి తీసుకువస్తున్నాను. కేంద్రం తెలంగాణకు ఏమి ఇచ్చిందని పదేపదే అక్కడక్కడ మన మంత్రులు మాట్లాడుతున్నారు. ఒక్కసారి కొన్ని అంశాలను ఆర్థికమంత్రి గారి దృష్టికి తీసుకువస్తున్నాను,

ఈ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారుల పేరు మీద 1800 కిలోమీటర్లకోసం రూ.43వేల కోట్లు మంజూరుచేసింది. ప్రతి ఇంటికి రూ.1,50,000తో 84051ఇళ్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. రూ.2002కోట్లతో మెదక్‌లో హార్టీకల్చర్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసింది. మెదక్ జిల్లాలో రూ.300 కోట్లతో 70ఎకరాల స్థలం నైపర్ ఏర్పాటుకు ఆమోదం చేసింది. సనత్‌నగర్ ఇఎస్ఐ ఆసుపత్రిలో మెడికల్ కాలేజీని, హైదరాబాదులో రూ.50 కోట్లతో నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్‌ను, రూ.9000కోట్లతో మహారాష్ట్రలోని వడోరా నుంచి వరంగల్ వరకు విద్యుత్ లైన్ ఏర్పాటు చేసింది. తెలంగాణ రాష్ట్రంలో ఏ రకంగా విద్యుత్ కోతను తీర్చడానికి కేంద్రం ఏ రకంగా మీకు సాయం చేసిందో చూడండి. 24 X 7 విద్యుత్ సరఫరా ప్రణాళికలో భాగంగా రామగుండంలోని ఎన్‌టిపిసికి 4000 మెగావాట్ల సామర్థ్యం గల విద్యుత్ ఉత్పత్తును కేంద్రం ఏర్పాటు చేసింది. నల్గొండ జిల్లా దామర చర్లలో రూ.15,000కోట్లతో 2400మెగా వాట్ల విద్యుత్‌కు కేంద్రం ఆమోదం చెప్పడమే కాకుండా ముఖ్యమంత్రిగారు సైతం ఆ రోజు పర్యావరణ శాఖ మంత్రి ప్రకాశ్ జావదేకర్ గారు నా భూతో నా భవిష్యత్తు అని ఒక చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని మీరు మరచిపోతున్నారు. తెలంగాణలో మహబూబ్ నగర్ మరియు ఇతర ప్రాంతాలలో 2500మెగా వాట్ల సౌర విద్యుత్ కోసం కేంద్రం ఆమోదించింది. రూ.5 వేల 2కోట్ల రూపాయలతో రామగుండంలో ఎరువుల కర్మాగారం ఏర్పాటు చేసింది. రూ.960కోట్లతో ఐడిపిఎల్ పునరుద్ధరణ. ఖమ్మం మరియు మహబూబ్ నగర్ జిల్లాలలో కోట్ల సబ్సిడితో రెండు ఫుడ్ పార్కులు ఏర్పాటు చేసింది. రూ.350కోట్లతో హైదరాబాద్‌లో బయోడైవర్సిటీ రిసెర్చ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. రూ.50వేల కోట్ల పెట్టుబడితో పది లక్షల మందికి ఉపాధి కల్పించేటువంటి నిమ్స్‌ను ఏర్పాటు చేసింది. ఎన్ఐఎమ్‌డిసి క్రింద ఫార్మాసిటీకి హోదా కలిగించడానికి కేంద్రం అంగీకరించింది. హైదరాబాద్ మెట్రోకు రూ.2000కోట్లు కేటాయించింది. ఎమ్ఎమ్‌టిఎస్ రెండో దశకు రూ.432కోట్లు కేటాయించింది. అదే విధంగా రూ.4000 కోట్లతో డిఫెన్స్ ప్రాజెక్టు 1500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి కేంద్రం నిధులు మంజూరు చేసింది. తెలంగాణలో ప్రత్యేకంగా స్కిల్స్ యూనివర్శిటీ, రూ.100కోట్ల సబ్సిడీతో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేసింది. తెలంగాణ స్పేస్ పార్క్ కోసం సూత్రప్రాయకంగా అంగీకారం చేసింది. హైదరాబాద్ వరంగల్‌ను స్మార్ట్ సిటీలుగా తీర్చిదిద్దడానికి కేంద్రం ప్రభుత్వం ఆమోదం తెలిపితే అందుకు ముఖ్యమంత్రిగారు హైదరాబాద్‌కి బదులు కరీంనగర్‌ను స్మార్ట్ సిటీగా చెద్దామని చెప్పారు. తెలంగాణలోని 11నగరాలు అమృత్ నగరాలుగా తీర్చిదిద్దడానికి రూ.100కోట్లు కేటాయించారు. తక్కువ ధరలో వందల కోట్ల ఎల్ఇడి బల్బులను కేటాయించారు. స్వచ్ఛ్ భారత్ కోసం రూ.500కోట్లు నిధులు కేంద్రం కేటాయించింది. పత్తి పరిశోధన కేంద్రం కోసం, అగ్రికల్చర్

కాలేజీల కోసం ..... ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయి. 2016-2017 బడ్జెట్‌లో కూడా ఆర్థిక మంత్రి గారు 28వేల కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింది. ప్రస్తుతానికి పశుజన సంజీవని పథకం క్రింద తెలంగాణకు రూ.30కోట్లు కేంద్రం నిధిని కేటాయించింది. హైదరాబాదు ఐఐటి కి రూ.20కోట్లు కేటాయించింది. నైపర్‌కి రూ.30కోట్లు, సర్దార్‌పటేల్ జాతీయ పోలీస్ అకాడమికి రూ.2088కోట్లు కేటాయించింది. హోమ్ మంత్రిగారు ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. డిఎన్ఎ ఫింగర్ ప్రింట్స్ కోసం రూ.62కోట్లు, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అనిమల్ బయోటెక్నాలజీకి రూ.36కోట్లు, అలాగే కేంద్ర పన్నుల ద్వారా సెంట్రల్ సేర్‌లో మన వాటాకు అనుగుణంగా రూ.13955కోట్లు వస్తున్నటువంటి విషయాన్ని మనం మరచిపోకూడదు. తెలంగాణకు మూడు చిన్న ఎయిర్ పోర్టులను కేటాయించడానికి నిధులు మంజూరు చేసింది. అలాగే సూక్ష్మ నీటి పారుదల కోసం రూ.170కోట్లు కేటాయించింది. ఈ రకంగా ప్రధానమంత్రి గారు సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ అనే నినాదంతో ముందుకు పోతున్నారు. మీరు కేవలం రాజకీయాలకోసం ఏదో విమర్శలు చేస్తున్నారు. దయచేసి ఒక్కసారి నేను చెప్పేది అర్థం చేసుకోండి.

1.40 మ. గవర్నర్ ప్రసంగంలో కూడా గవర్నర్ గారు ఇది పవిత్రమైనటువంటిసభ అని ప్రసంగించారు. మరి ఈ పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత మనపై వుంది. నేను ప్రతి సభలో చూస్తున్నాను, ఈ రెండు సంవత్సరాలలో 4 సార్లు కలిశాము మనం. అక్కడ సీట్లు పెరుగుతున్నాయి, ఇక్కడ (ప్రతిపక్షంలో) సీట్లు తగ్గిపోతున్నాయి. ఇది తెలంగాణ సమాజం కోరుకోలేదు. తెలంగాణ సమాజం దేనికైతే కట్టుబడి వుందో, ఆ ఆలోచనలతో ముందుకు పోవాలి తప్పితే ఈ పార్టీ ఫిరాయింపుల వల్ల, ఈ ఫిరాయింపులను ప్రోత్సాహించడం వల్ల, పార్టీ ఫిరాయింపుల బిల్లుకి తూట్లు పొడిచే విధంగా ఈ రోజు తెలంగాణ శాసన సభ దోహదపడే విధంగా ఉండకూడదని తెలియజేస్తూ దయచేసి ఇప్పటికైనా వీటికి స్వస్తి పలకండి. ఈ రోజు గెలుపు ఓటములు కాకుండా సమాజం చూస్తోంది, మన తెలంగాణ ప్రాంతంలో ఏమి జరుగుతోంది అని దేశం చూస్తోంది. స్వేచ్ఛ స్వాతంత్రం ఇవన్నీ కూడా, ఆశించిన తెలంగాణలో మనం ఈ రోజు ఆవేదనకు గురవుతున్నాం. ఇటువంటి వాటిని ఏ మాత్రం ప్రోత్సహించకుండా ఖచ్చితంగా పార్టీ ఫిరాయింపులను ఆపాల్సి వుంది.

అదే విధంగా తెలంగాణ ఉద్యమంలో ఎవరైతే అమరులైనారో.... ఉద్యమంలో లేని వారు MLAలు, మంత్రులు అవుతున్నారు, ఇవాళ కోదండరాం గారు స్పష్టంగా చెబుతున్నారు పదవులు వస్తున్నాయని. ఈ ఆవేదన ఒకరితో ఆగేది కాదు. మళ్లీ మలి దశ ఉద్యమానికి ప్రజలకు అటువంటి అవకాశం కల్పించకుండా వుండడానికి ప్రభుత్వం తగు జాగ్రత్తతో వీటికి స్వస్తి పలకాలని కోరుతున్నాను. ప్రతిపక్షాలు లేకుండా చేస్తే ఆరోగ్యకరం కాదు, సమంజసం కాదు. బలమైన ప్రతిపక్షం వుంటేనే రాష్ట్రం బాగుపడుతుంది. బలమైన ప్రతిపక్షం వున్నప్పుడే ఆ రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. అంతేకాని ప్రతిపక్షాల యొక్క గొంతులు నొక్కినా, ప్రతిపక్షాలు లేకుండా చేస్తే తెలంగాణ రాష్ట్రానికి మంచిది కాదు, ఇప్పటికైనా ప్రభుత్వానికి కనువిప్పు కావాలి. ఇప్పటికైనా దీనికి ఫుల్ స్టాప్ పెట్టండి.

ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహించండి. ఇవాళ ఈ రకమైనటువంటి భావంతో మనం అభాసు పాలు కాకుండా తెలంగాణ సమాజంలో కూడా మనం తల వంచుకునే పరిస్థితిల్లోకి వెళ్లకుండా, ఎవరైతే ఈ రోజు త్యాగం చేసి అమరులైనారో వారి గురించి కూడా ఆర్థిక మంత్రి గారు తప్పకుండా ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లాలి. ఇటువంటి తప్పిదాలను తప్పకుండా వారు పరిగణనలోకి తీసుకొని ఈ రోజు సరిదిద్దుతారని నేను ఆశిస్తున్నాను. రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుని మూడో సంవత్సరంలోకి వస్తున్నాం. కాబట్టి దయచేసి పాలన మీన దృష్టిపెట్టండి, ప్రతిపక్షాల మీద కాదు. పార్టీని బలోపేతం చేయడం కాదు. రాష్ట్రాన్ని బలోపేతం చేయడానికి, రాష్ట్రంలో వున్న అన్ని వర్గాల ప్రజలకు చేయూతనివ్వడానికి సంకల్పంతో ముందుకు వెళ్లందే తప్ప మనం బల పడడం ప్రాయోజితం కాదు, ప్రజలు బలపడే విధంగా మీరు కృషి చేస్తారని కోరుకుంటూ ఈ అవకాశాన్ని నాకు ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎ. రేవంత్ రెడ్డి: గవర్నరు గారి ప్రసంగం కాని ప్రభుత్వ బడ్జెట్ కాని, ఎన్నికలలో పోటీ చేసి గెలిచిన పార్టీ వాళ్లమేనిఫెస్టో ప్రభుత్వ పాలసీ డాక్యుమెంటుగా వుంటే ప్రజలకు ప్రయోజనకరంగా వుంటుంది. రాష్ట్రం అభివృద్ధి వైపు నడుస్తుంది. బడ్జెట్‌లో ప్రధానంగా ఉండే అంశాలు ఒకటి సంక్షేమ కార్యక్రమాలు, రెండు అభివృద్ధి కార్యక్రమాలు. అయితే గత మూడు బడ్జెట్‌లలో పెద్దలు, గౌరవ మంత్రి వర్యులు ఈటల రాజేందర్ గారు ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను కూలంకషంగా ఒకసారి మనం చర్చించుకోవాల్సిన సందర్భం ఇది. ఈ రెండు అంశాలు సంక్షేమం కాని, అభివృద్ధి కాని, గతంలో ప్రవేశపెట్టిన మూడు బడ్జెట్‌లను పరిశీలిస్తే ఎందుకో దారి తప్పినట్టుగా అనిపిస్తుంది. వారు

ఇంకా తమ దృష్టిని వీటిపైన సారించాల్సిన అవసరం వుందని ఈ బడ్జెట్‌ను చూస్తే అర్థమౌతుంది అధ్యక్ష. 2014-15 బడ్జెట్‌ను వారు ప్రవేశపెట్టినప్పుడు ఒక లక్షా ఆరు వందల ముప్పై ఏడు కోట్ల రూపాయలుగా పది నెలల కోసం ప్రవేశపెట్టడం జరిగింది. వారు పది నెలల కోసం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈ రోజు పూర్తిగా ఈ ఖర్చుల గురించి చెప్పడం జరిగింది. అంటే రూ. 62,306 కోట్లు మాత్రమే మనకు ఆదాయం వచ్చింది, ఖర్చు పెట్టడం కూడా జరిగిందని వారు ప్రవేశ పెట్టిన లెక్కల ద్వారా తేలింది. బంగారు తెలంగాణలో లక్ష కోట్ల రూపాయల బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని ఆనాడు గొప్పగా ఇదే సభలో మనం చెప్పుకున్నాం. ఈరోజు రూ. 62,306 కోట్లు మాత్రమే మనం ఖర్చు పెట్టగలిగామని ఇదే సభలో చెప్పుకుంటున్నాం. అంటే 38 శాతం మన అంచనాలు తల క్రిందులు అయ్యాయి.

అయితే మొదటి సభ, మొదటి సమావేశం, మొదటి బడ్జెట్ కాబట్టి వారు కొంత సమాచారం సేకరించడంలో ఇబ్బంది పడి వుండొచ్చని మేము అర్థం చేసుకున్నాం. కాని 2015-16 లో తిరిగి పెద్దలు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ. 1,15,389 కోట్లు చూపించడం జరిగింది. అంటే ఈ బడ్జెట్‌లో సవరించిన బడ్జెట్ క్రింద వారే లక్ష కోట్లకు తగ్గించుకోవడం జరిగింది. అంటే లక్షా పదిహేను వేల కోట్లని వారే ప్రవేశపెట్టారు. సంవత్సరం తిరిగే లోపల లక్ష కోట్లకు సవరించి వారే ప్రవేశపెట్టడం జరిగింది అధ్యక్ష. వాస్తవానికి లక్ష కోట్లు కూడా వుండదు, ఎందుకంటే ఇంకా 10,12 రోజులే వున్నది. మాకు అందిన సమాచారం ప్రకారం ఎనభై ఎనభై ఐదు వేల కోట్ల రూపాయల బడ్జెట్ మాత్రమే వుంటుంది తప్ప ఎనభై ఐదు వేల కోట్ల రూపాయలు దాటే పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. వారు ప్రవేశపెట్టిన రెండవ బడ్జెట్‌లో కూడా దాదాపుగా ముప్పై వేల కోట్ల రూపాయల అంచనాలు తలక్రిందులైపోయి. ఈ రోజు మనం అర్థం చేసుకోవాల్సిన విషయం ఏమిటంటే ఈ దిశగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎటుపోతోందో.

మూడవది 2016-17 కోసం ఒక లక్షా ముప్పై వేల కోట్ల పై చిలుకు బడ్జెట్‌ను ఈ రోజు పెద్దలు ప్రవేశపెట్టడం జరిగింది. మేము ఏమంటున్నామంటే మొదటిసారి తప్పు జరగడం వల్ల లక్ష కోట్లు ఆనాడు ప్రవేశపెట్టడం వల్ల రెండవసారి గొప్పలకు పోయి ఒక లక్షా పదిహేను వేల కోట్ల రూపాయలు, మూడవసారి గొప్పలకు పోయి ఒక లక్షా ముప్పై వేల కోట్ల రూపాయలు ప్రవేశపెట్టినట్టుగా వుంది కాని వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని ప్రవేశపెడుతున్నట్లుగా కనిపించడం లేదు అధ్యక్ష. ఈ సంధర్భంగా ఒక విషయాన్ని మీ ముందు ప్రస్తావించదలుచుకున్నాను. If the first button in a shirt is put in wrongly then every button will be in the wrong place. It is a great line said by tailor Yadagiri. Do not expect Shakespeare for every thing. పెద్దలు ఆర్థిక మంత్రి వర్యులు గురించి చెప్పేదేమిటంటే, వారు ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. లెఫ్ట్ ఉద్యమం నుంచి విద్యార్థి నాయకుడిగా వారు ఉద్యమంలో భాగస్వామ్యం తీసుకున్నారు. చదువుకున్న వారు విజ్ఞులు, అన్ని అంశాల మీదవారికి అవగాహన వుందని మేము భావిస్తున్నాము. అలాంటి ఆర్థిక మంత్రి గారు ప్రతి విషయానికి ముఖ్య మంత్రి గారి మీద ఆధారపడడం బడ్జెట్‌కు సంబంధించి ఏ సందర్భంలో రివ్యూలు జరిగినా, చర్చలు జరిగినా, పత్రికలలో వార్తలు చూసినా పూర్తి స్థాయిలో ముఖ్యమంత్రి గారే సమీక్షిస్తున్నట్లుగా వార్తలు చూస్తున్నాం.

మన తెలంగాణ కొత్త రాష్ట్రంలో మొట్టమొదటి ఆర్థిక మంత్రిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ద్వారా వారికి పెద్ద గౌరవం దక్కింది. ఈ రాష్ట్ర దశ దిశను నిర్దేశించే విధంగా అభివృద్ధి వైపు తెలంగాణను పరిగెత్తించే విధంగా పెద్దలు ఆర్థిక మంత్రి గారికి అవకాశం వస్తే, ఈ రోజు అంచనాలు 38, 30, 25 శాతం అంచనాలు తలక్రిందులయ్యాయంటే వారి గౌరవానికి భంగం కలిగే విధంగా ఈ బడ్జెట్ ప్రతిపాదనలన్నీ కూడా సభ ముందుకు వస్తున్నాయి. ఒకసారి ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోవల్సిందిగా పెద్దలకు, విజ్ఞులకు నేను విజ్ఞప్తి చేస్తున్నాను అధ్యక్ష. అదేవిధంగా టి.ఆర్.ఎస్. పార్టీ ఎన్నికల మానిఫెస్టోలో బహు ప్రాచుర్యం కల్పించి ఈ ఎన్నికలలో ప్రజల దగ్గరకు వెళ్లి ఓట్లు అడిగిన సందర్భంలో ప్రజలకు ఏవిధంగా హామీలు ఇచ్చారో ఆ హామీలను నెరవేర్చే విధంగా బడ్జెట్ వుండాలని తెలంగాణ ప్రజలు అందరూ కోరుకుంటున్నారు. ప్రతిపక్షాలుగా ప్రభుత్వానికి సలహాలు సూచనలు ఇచ్చే విధంగా మా వంతు ప్రయత్నం మేము చేస్తున్నాం. ఈ రోజు జరుగుతున్న పరిణామాలు తెలంగాణ సమాజాన్ని ఆవేదనకు గురి చేస్తున్నాయి. మేము కూడా ఈ సభలో వున్నందుకు ఈ ప్రభుత్వాన్ని సరైన దిశగా నడిపిస్తూ తెలంగాణ సమాజానికి సేవ చేసే విధంగా ఉంటాము. తప్పకుండా ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇచ్చే బాధ్యత మా మీద వుందని మేము భావిస్తున్నాము.

అందుకే ఈ రోజు ప్రధానంగా రైతు రుణ మాఫీని నేను ప్రస్తావించదలుచుకున్నాను. టి.ఆర్.ఎస్. పార్టీ ఎన్నికల మానిఫెస్టోలో రైతు రుణ మాఫీ గురించి చెప్పడం జరిగింది. లక్ష రూపాయలు రుణం వున్న వారికి రుణ మాఫీ చేస్తామని ఆనాడు చెప్పడం జరిగింది. ప్రభుత్వం వచ్చిన తరువాత మేము రూ. 17,000 కోట్ల రుణాలను గుర్తించాము. ఈ రూ. 17,000 కోట్ల రూపాయలను ఒకేసారి

చెల్లించాలంటే ప్రభుత్వానికి అంత ఆర్థిక వెసులుబాటు లేదు. కాబట్టి 4 దఫాలుగా ప్రతి సంవత్సరం రూ. 4,250 కోట్ల రూపాయలతోనే రైతు రుణాలను మాఫీ చేయడం జరుగుతుందని ఈ ప్రభుత్వం హామీ ఇవ్వడం జరిగింది. అయితే రెండు దఫాలు రుణాలు చెల్లించిన తరువాత రైతు ఆత్మహత్యలు పెరిగిపోయాయి.

రైతు ఆత్యహత్యలకు సంబంధించి కూడా 2014లో 898 మంది రైతులు తెలంగాణ రాష్ట్రంలో ఆత్మహత్య చేసుకున్నారని ఎన్సీఆర్బి రిపోర్టు ఇచ్చింది. మహారాష్ట్రలో 2,000 పై చిలుకు రైతులు ఆత్మహత్య చేసుకుని మొదటి స్థానంలో వుంటే రైతు ఆత్మహత్యల విషయంలో తెలంగాణ రెండవ స్థానంలో వుందని చెప్పి National Crime Bureau Report నివేదికలు ఇవ్వడం జరిగింది. ఈ రోజు అందుకున్న సమాచారాన్ని బట్టి దాదాపుగా 2,500 మంది రైతులు తెలంగాణలో ఆత్మహత్యలు చేసుకున్నారు. ఆ ఆత్మహత్యలు చేసుకున్న వారి కుటుంబాలను ఆదుకోవడం కోసం ప్రతి కుటుంబానికి రూ. 6,00,000 ఇస్తామని ప్రభుత్వం ఉదారంగా ముందుకు వచ్చింది. కాని అలా ఆత్మహత్యలు చేసుకొనే వారిని ఆదుకోవడానికి కాని నిలువరించడానికి కాని ఏ రకమైన చర్యలు తీసుకుంటున్నారో ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించలేదు. అదేవిధంగా ఈ సంవత్సరానికి కూడా దాదాపుగా రూ. 4,250 కోట్ల రూపాయలను మూడవ విడతగా రైతు రుణ మాఫీ కోసం చెల్లించే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకొన్నదని ఒక సమాచారం అందింది అధ్యక్ష.

1.50 మ. ఈ సందర్భంగా ఒక సూచన చేయదలచుకున్నాను. ఆర్థికమంత్రిగారు ఈ అంశం మీద ప్రత్యేక దృష్టిసారించాలి. రాష్ట్రముఖ్యమంత్రిగారు ముఖ్యమంత్రి ప్రత్యేక నిధి అనే ఒక ప్రత్యేక అబివృద్ధి నిధిని వారు కొంత నిధిని కేటాయించుకోవడం జరిగింది. దాని కోసం రూ.4675 కోట్లు కేటాయించారు. తెలంగాణలో దాదాపు తొంబైశాతం రైతులు మెట్ట భూముల మీద , వర్షాధారిత పంటల మీద ఆదారపడ్డారు. గత రెండు సంవత్సరాలుగా సంపూర్ణస్థాయిలో కరువు ఉన్నది. 79 శాతం వర్షాంభావం తక్కువ ఉన్నది. మంత్రిగారు కరువు వచ్చిందని ఇదే సభలో ఒప్పుకున్నారు. తెలంగాణ ప్రాంతాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం ఉదారంగా ముందుకు రావాలి. ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులను బ్రతికించుకోవలసిన అవసరం, వారికి ఉపశమనం కల్పించవలసిన బాధ్యత, వారికి భరోసా ఇవ్వవలసిన అవసరం ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం మీద ఉంది. ఈ శాసనసభ మీద మనందరి సభ్యుల మీద బాధ్యత ఉంది.

ప్రభుత్వానికి నేను ఒక సూచన చేస్తున్నాను. మూడవ విడత రైతు రుణ మాఫీతోపాటు రూ.4675 కోట్లు ముఖ్యమంత్రిగారు ప్రత్యేక అభివృద్ధి నిధిని అందులో జమ చేస్తే రూ.8500 కోట్లు అవుతాయి. రూ.8500కోట్లు ఏకమొత్తంలో బ్యాంకులకు చెల్లిస్తే నూటికి నూరు శాతం రైతు రుణమాఫి జరుగుతుంది కాబట్టి మన ముఖ్యమంత్రి తెలంగాణ ప్రజల అభివృద్ధి కోసం కాంక్షిస్తున్నారు, వారి అభివృద్ధికోసం అహర్నిశలు కృషి చేస్తున్నారు, అవసరమైతే వారి అభివృద్ధి కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రాణత్యాగానికి కూడా వెనుకకు పోనని మన ముఖ్యమంత్రిగారు వివిధ సందర్భాలలో మనకు హామీ ఇవ్వడం జరిగింది. కాబట్టి ఈ సందర్భంగా ముఖ్యమంత్రిగారికి విజ్ఞప్తి చేస్తున్నాను. తెలంగాణ సమాజంలో ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులను ఆదుకోవడానికి రూ.500కోట్లు ప్రత్యేక అభివృద్ధి నిధి క్రింద పెట్టుకోండి ఫరవాలేదు. శాసనసభ్యులు కాని ఇతర సభ్యులు కాని ఎవరైనా అభివృద్ధి కోసం నిధుల కోసం వస్తే ఇవ్వండి. రూ.4250కోట్లు ముఖ్యమంత్రి ప్రత్యేక నిధి నుండి ఈ రైతు రుణమాఫీకి మళ్లిస్తే రూ.8500కోట్లు రైతు రుణమాఫీ చెల్లిస్తే నూటికి నూరు శాతం రైతు రుణమాఫీ జరుగుతుంది. అంటే ఈ రుణమాఫీ వల్ల రైతుల ఆత్మహత్యలు ఆగిపోతాయి. రైతుల జీవితాలు బాగుపడతాయని నేను అనడం లేదు. ఆ రైతుల పట్ల సానుబూతితో చనిపోతున్న రైతాంగ కటుంబాలను ఆదుకోవడానికి సభ చిత్తశుద్ధితో ఉంది. మిమ్ములను ఆదుకోవడమే తెలంగాణ ధ్యేయము. తెలంగాణ బిడ్డలను, తెలంగాణ రైతాంగాన్ని ఆదుకోవడానికి, మిమ్మలను బ్రతికించుకోవడానికి, మీ బ్రతుకులు బాగు చేయడానికి తెలంగాణ తెచ్చుకున్నాము కాబట్టి ఈ సభ పూర్తి విశ్వాసంతో మీకొక నమ్మకం కలిగించడానికి రూ.8500కోట్లు రైతు రుణమాఫీ చేస్తున్నామని మనం వాళ్లకు ఒక నమ్మకం కలిగించవలసిన అవసరం ఉంది. ముఖ్యమంత్రిగారి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ క్రింద రూ.500 కోట్లు పెట్టుకున్నా ఫరవాలేదు.

అదే విధంగా నీళ్లు, నిధుల, నియామకాలలో నీళ్లకు సంబంధించిన అంశం సాగునీటి పారుదల . ఈ రోజు సమైక్య పాలనలో నాగార్జునసాగర్, శ్రీశైలం, శ్రీరాంసాగర్ , నిజాంసాగర్ మొదలైన ప్రాజెక్టులు కట్టారు. వాటిలో గత ప్రభుత్వాలు ఏదైతే మొదలు పెట్టిన ప్రాజెక్టులున్నాయో, 80 శాతం, 90 శాతం పూర్తి అయిన సాగునీటి ప్రాజెక్టులను తక్షణమే 24 గంటలు ఫ్లడ్‌లైట్లు పెట్టి పనిచేసి , యుద్ధ ప్రాతిపదికన ఆ పనులను పూర్తి చేస్తే మనకు కొత్త సాగు

అందుబాటులోకి వస్తుంది. రైతులను ఆదుకున్న వాళ్లమవుతాము. రూ.25వేలకోట్లతొ కొత్త టెండర్లకు సంబంధించిన చాలా వాటిని ప్రస్తావించాము.

పాలమూరు జిల్లాకు సంబంధించి నెట్టెంపాడు, కల్వకుర్తి, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు రూ.1000కోట్ల నిధులతో ఒక్క సంవత్సరం సమయం 24 గంటలు పనిచేస్తే 8లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లు ఇచ్చే అవకాశం ఉంది. ముంబాయికి, దుబాయికి పోతున్న వలసలు పోతున్న రైతాంగాన్ని పాలమూరు బిడ్డలను ఆదుకోవడానికి రూ.1000కోట్లు ప్రత్యేకంగా పెట్టి హరీష్‌రావు గారు మంత్రిగా ఉన్నారు. కాబట్టి ప్రతి వారం సమీక్షించండి. పాలమూరు జిల్లా ప్రాజెక్టులను తక్షణమే వాటిని పూర్తి చేయండి . ప్రాధాన్యత క్రమంలో పాలమూరు రంగారెడ్డి జిల్లా ఎత్తిపోతల ప్రాజెక్టుకంటే కూడా కల్వకుర్తి, భీమా నెట్టెంపాడు, కోయిలసాగర్ ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేసి రైతాంగాన్ని ఆదుకోవలసిన అవసరం ఉంది. త్రాగునీటికి నీళ్లు ఇవ్వవలసిందిగా ప్రభుత్వానికి తమరి ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను.

అదేవిధంగా ఏ ఎన్నికలు వచ్చినా చంద్ర శేఖర్‌రావుగారి నాయకత్వానికి ప్రజలు బ్రహ్మరధం పట్టడానికి కారణం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు. పేద ప్రజలు ఒక్క రూమ్‌లో భార్యాభర్తలు, కొడుకు, అల్లుడు, బిడ్డ జీవించలేని పరిస్థితులు. ఆత్మగౌరవంతో ముందుకు వెళ్లవలసిన పరిస్థితులు.

శ్రీ జూపల్లి కృష్ణారావు: పాలమూరు పెండింగు ప్రాజెక్టుకు సంబంధించి నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, కల్వకుర్తి, భీమా ప్రాజెక్టులకు పూర్తి కావలసిన డబ్బులు బడ్జెట్‌లో కేటాయించడం జరిగింది. నెక్స్ట్ ఖరీఫ్ నాటికి పూర్తి చేసే పరిస్థితి ఉంది.

శ్రీ ఎ. రేవంత్ రెడ్డి: ఇకనుండి ఒక సంవత్సరం లోపల నూటికి నూరు శాతం ప్రాజెక్టులను పూర్తి చేసినట్లయితే, మా జిల్లా పరిషత్తు సమావేశంలో తప్పకుండా మంత్రిగారిని పార్టీలకు అతీతంగా మేము సన్మానిస్తాము. ఎందుకంటే మా బిడ్డల ఆవేదనలను, అక్కడున్న ఆత్మహత్యలను ఆపడానికి మంత్రిగారు కొంత సమయం అన్నారు, సంవత్సరం లోపల పూర్తి చేయాలని కోరుతున్నాను.

అదే విధంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఓట్లు, సీట్లు తెచ్చి పెట్టడంలో అక్షయపాత్ర లాంటిది. అటువంటి అక్షయపాత్ర గురించి చర్చించవలసిన అవసరం ఉంది. 2015-16 బడ్జెట్ సంవత్సరంలో 60 వేల ఇళ్లు కేటాయియచామని జీఓలు కూడా ఇవ్వడం జరిగింది. 2016-17లో 2లక్షల ఇళ్లను కేటాయిస్తున్నట్లుగా ముఖ్యమంత్రిగారు చెప్పారు, ఇందులో కూడా పెట్టారు. 60 వేల ఇళ్లు అర్బన్, రూరల్ ఏరియాలో కట్టాలంటే రూ.3500కోట్లు కావాలి. అలాగే రెండు లక్షల ఇళ్లకు కూడా లెక్క వేస్తే రూ.12 కోట్ల నుండి రూ.13కోట్లు అవసరం అవుతాయి. నికరంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించి రూ.16వేల కోట్లు అవసరం ఉన్నది. అయితే ఈ రోజు రూ.16వేల కోట్లు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లకు అవసరం అవుతాయి. పేదలు ఆత్మగౌరవంతో బ్రతకాలని, వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఉండవలసిందేనని మన ముఖ్యమంత్రిగారు గొప్పగా చెప్పారు. ప్రజలు దానిని మంచి అవకాశంగా భావించారు. ఈ బడ్జెట్‌లో ఎక్కడ నిధుల కేటాయింపు గురించి మాట్లాడలేదు. అప్పులు ఇతరత్రా బ్యాంకుల ద్వారా రుణాలు తెచ్చి పేద ప్రజలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిస్తున్నామని చెబుతున్నారో ఇక్కడే మాకు అనుమానం కలుగుతుంది. మన ఆర్థిక పరిస్థితులు ఏవీ కూడా మీరు ఆశించిన విధంగా లేవు. మీరు ఆశించిన విధంగా ఆదాయాలు లేవు. అలా అయితే ఏ బ్యాంకర్ అయినా ప్రభుత్వాలకు ఆషామాషీగా లోను ఇవ్వడు. తిరిగి ఏ విధంగా చెల్లిస్తావో, నీ ఆదాయ వనరులను చూస్తే తప్ప లోన్సు ఇచ్చే పరిస్థితి లేదు కాబట్టి తెలంగాణ సమాజంలో గౌరవంగా బ్రతకవలసిన బడుగు, బలహీన వర్గాలకు, దళిత, గిరిజన, మైనారిటీ వర్గాల కోసం కడుతున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు ప్రభుత్వం ఖచ్చితంగా నిధులు కేటాయించి, ఆ డబుల్ బెడ్ రూమ్ పథకాన్ని ముందుకు తీసుకువెళితే బాగుంటుందని ప్రభుత్వానికి సూచన చేస్తున్నాను. ఈ పథకానికి సంబంధించి నియమ నిబంధనలు ఈ సభ దృష్టికి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాను.

ఈ పథకం యొక్క అలకేషన్‌కు సంబంధించి బెనిఫిషయరీ లిస్టు 1978 ఆ ప్రాంతంలో శ్రీమతి ఇందిరాగాంధీగారు పేదలకు గుడిసెలు ఇచ్చే స్కీమ్ మొట్టమొదట ప్రవేశపెట్టినప్పటి నుండి మొదలు పెడితే, తమరు శాససభ్యుడిగా ఉన్న సందర్భంలో ఎన్.టి. రామారావుగారు పేదలకు పక్కా గృహ నిర్మాణం, రాజశేఖర్ రెడ్డిగారు మొదలు పెట్టిన ఇందిరమ్మ ఇళ్లు పొందిన వారికి అర్హత లేదన్నట్టుగా నిబంధనలున్నాయి. ఈ పరిణామ క్రమంలో ఎంతమందికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో అర్హత ఉందో అర్థం కావడం లేదు. అప్పుడు తీసుకున్న బెనిఫిషయర్స్ వాళ్లందరికీ అర్హత లేదన్నట్టుగా మీరు ఇచ్చిన నియమ నిబంధనలున్నాయి. గుడిసె తీసుకున్నవాళ్లు, పక్కా ఇళ్లు తీసుకుని ఇప్పటికి 30, 40 సంవత్సరాలైంది. ఈ రోజు వాళ్లందరికీ అర్హత ఇవ్వకపోతే ఈ రోజు పేదలు అన్యాయం అయిపోతారు. ఇందిరమ్మ ఇళ్లలో పెద్దయెత్తు అవినీతి జరిగిందని రాష్ట్రప్రభుత్వమే

ఈ రోజు సిబిసిఐడి విచారణకు చేపట్టారు. కాబట్టి సిబిసిఐడి విచారణలో ఉన్న బెనిఫిషియర్సును కూడా దీనిలోకి తీసుకురావాలి.

2.00 మ. అదే విధంగా స్కేటర్డ్ హౌసెస్ ఇవ్వమంటున్నారు. మాకు స్థలం ఉంది, ఇళ్లు కట్టుకుంటామంటే ఇవ్వడం లేదు. గ్రామాలలో ప్రభుత్వ స్థలాలు ఉంటే, అందులో 127 గజాలలో ఇళ్లు కట్టిస్తామంటున్నారు. ఈ రకంగా ప్రభుత్వ నియమనిబంధనలు ఉన్నాయి. పేద వాడికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వలేని పరిస్థితి ఉంది. మీరు స్కేటర్డ్ హౌసులు కట్టించి ఇవ్వడానికి, అంటే విడివిడిగా ఇళ్లు కట్టించి ఇవ్వడానికి ప్రభుత్వ నియమ నిబంధలను సరళతరం చేయవలసిన అవసరం ఉంది. గ్రామాలలో ప్రభుత్వ భూములు లేవు. ఎప్పుడో పేదలకు కేటాయించారు, ఆ భూముల్లో ఇళ్లు కూడా కట్టుకున్నారు. కాబట్టి ప్రభుత్వం, గ్రామాలలో భూములు కొనుగోలు చేసి, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టించవలసిందిగా చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది. ఎస్.సీ, ఎస్.టి, బీసి సబ్‌ప్లాన్స్, వ్యవసాయం, విద్య అనేవి ప్రధానాంశాలు. ఎస్.సి సబ్‌ప్లాన్‌కు సంబంధించి 2014-15లో రూ. 7579 కోట్లు కేటాయిస్తే, ఖర్చు చేసింది కేవలం రూ. 2404 కోట్లు మాత్రమే. అదే విధంగా 2015-16 లో రూ. 8089 కోట్లు కేటాయిస్తే, ఖర్చు చేసింది కేవలం రూ. 3773 కోట్లు మాత్రమే. ఎస్.టి సబ్‌ప్లాన్‌కి సంబంధించి 2014-15 లో రూ. 4559 కోట్లు కేటాయిస్తే, ఖర్చు చేసింది కేవలం రూ. 6043 కోట్లు మాత్రమే, 2015-16 లో రూ.5035 కోట్లు కేటాయిస్తే, ఖర్చు చేసింది మాత్రం రూ. 2671 కోట్లు మాత్రమే. సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం సమాజంలో యాభై రెండు శాతం ఉన్న బీసీలకు 2014-15లో రూ. 2022 కోట్లు కేటాయిస్తే, ఖర్చు చేసింది మాత్రం రూ.1090 కోట్లు మాత్రమే. 2015-16లో రూ.2172 కోట్లు కేటాయిస్తే, ఖర్చు చేసింది మాత్రం కేవలం రూ.725 కోట్లు మాత్రమే. ఎస్.సి, ఎస్.టి, బీసిలకు కేటాయింపులు గొప్పగా చేసినా, ఖర్చు పెట్టింది మాత్రం 25-30 శాతం మాత్రమే. టీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఎస్.సిలకు సంవత్సరానికి రూ.10,000 కోట్లు ప్రకారం, అయిదు సంవత్సరాలలో యాభై వేల కోట్ల రూపాయలు కేటాయించి దళితుల అభ్యున్నతి కోసం పనిచేస్తామని చెప్పారు. ఈరోజు రెండు సంవత్సరాలలో రూ.21,000 ఖర్చు పెట్టవలసి ఉంటే కనీసం అయిదు వేల కోట్ల రూపాయలు కూడా దళితుల కోసం ఖర్చు చేయలేదు. దళితులకు, గిరిజనులకు మూడెకరాల భూమిని కొనుగోలు చేసిస్తామని చెప్పారు. ఏ దళిత, గిరిజన బిడ్డలను తెలంగాణ ప్రభుత్వం ఆదుకోవాలో, ఈ శాసనసభ ఎవరి అభ్యున్నతి కోసం పాటుపడాలో, వారికి సంబంధించిన భూమి కొనుగోలు విషయంలో ప్రభుత్వం ఒక్క అడుగు కూడా ముందుకు వెయ్యలేదు. మూడు అడుగులు ముందుకు వేస్తే, ఆరడుగులు వెనక్కి వచ్చినట్లుగా ఉంది. అందుకు గతంలో బడ్జెట్‌లో వెయ్యి కోట్ల రూపాయలను ప్రభుత్వం కేటాయించింది. ఈ బడ్జెట్‌లో ఆ ఊసే ఎత్తలేదంటే, దళిత, గిరిజనులకు సంబంధించి భూమికొనుగోలు పథకాన్ని ఎత్తివేసినట్లేనా అని అడుగుతున్నాను. అదే విధంగా అప్పుల గురించి మాట్లాడతాను. ముఖ్యమంత్రి గారు ఒక మాట చెప్పారు. బాగా అభివృద్ధి చెందిన అమెరికా, చైనా లాంటి దేశాలు కూడా వేల కోట్ల రూపాయలు అప్పు చేశాయని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం కూడా అప్పు చేస్తుందని చెప్పారు. 1952-2014 జూన్ 2 వరకూ అంటే, ఈరాష్ట్రం ఏర్పడినప్పటివరకూ, దాదాపు 63 సంవత్సరాలలో 16 మంది ముఖ్యమంత్రులుగా పనిచేశారు. 63 సంవత్సరాలలో తెలంగాణకు మొత్తం తెచ్చిన అప్పులు అరవై తొమ్మిది వేల కోట్ల రూపాయలు అధ్యక్షా. రాష్ట్రాలు విడిపోయినప్పుడు మన రాష్ట్రానికి దాదాపుగా అరవై తొమ్మిది వేల కోట్ల రూపాయల అప్పు తెలంగాణాకి వచ్చింది. అంటే ప్రతి కుటుంబానికి అరవై తొమ్మిది వేల రూపాయలు అప్పు ఉన్నట్లు అన్నమాట. విద్యుత్ కొరత తీర్చామని ముఖ్యమంత్రి గారు చెప్పారు. బడ్జెట్‌లో రాబోయే మూడు సంవత్సరాలలో 23,912 మె.వా అదనపు విద్యుత్‌ను ఉత్పత్తి చేసి రైతులకు 24 గంటలూ విద్యుత్ ఇస్తామని అన్నారు. అందుకు రూ. 91,500 కోట్లు ఖర్చు అవుతుంది. అంచనాలు ఇంకా పెరిగే అవకాశం ఉంది కాని తగ్గవు అధ్యక్షా. లక్ష కోట్ల రూపాయల విద్యుత్ కోసం అప్పు చేశారు. అదే విధంగా వాటర్ గ్రిడ్ కోసం నలభై వేల కోట్ల రూపాయలు, ఇళ్లకు పదహారు వేల కోట్ల రూపాయలు అప్పు చేశారు. 63 సంవత్సరాలలో 69 వేల కోట్ల రూపాయలు అప్పు మనకు వస్తే, 21 నెలల్లో, చంద్రశేఖర్ రావు గారి పాలనలో లక్షా యాభై వేల కోట్ల రూపాయల అప్పుకు అన్నీ సిద్ధం చేశారు. అందుకు సంబంధించి బ్యాంకులతో ఒప్పందాలు కూడా దాదాపు ఒక కొలిక్కివచ్చాయి. ఉమ్మడి రాష్ట్రంలో 16 మంది ముఖ్యమంత్రులు, సీమాంధ్రా నాయకులు పాలకులు ఉన్నప్పుడు మనకు జరిగిన అప్పు రూ. 69, 000 కోట్లు అయితే, మన ముఖ్యమంత్రి గారు వచ్చిన తరువాత, తెలంగాణ బిడ్డ ముఖ్యమంత్రి అయిన తరువాత లక్షా యాభై వేల కోట్ల రూపాయల అప్పుకు పునాది పడింది. తెలంగాణలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అప్పిచ్చిన వారు ఇంటి ముందు వచ్చి అడుగుతుంటే, ఆత్మగౌరవం దెబ్బతింటుందని చెప్పి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

(అంతరాయం)

అధ్యక్షా, అభివృద్ధి చెందడం అంటే అద్దాల మేడలు, రంగుల గోడలు కాదు, పౌరుని నైతికాభివృద్ధే నిజమైన దేశాభివృద్ధి అని అంబేద్కర్ గారు చెప్పారు. తెలంగాణలో కూడా పౌరుల నైతికాభివృద్ధిని మేము కోరుకుంటున్నాము. అద్దాల మేడలు, సెక్రటేరియేట్, అసెంబ్లీ భవనాలను కొత్తగా నిర్మించడం వంటివి మేము కోరుకోవడం లేదు. పౌరుని జీవన ప్రమాణాలు పెరగాలి, దళిత, గిరిజన, మైనారిటీ, బడుగు, బలహీన వర్గాలను ఆదుకోవాలని మేము కోరుకుంటున్నాము.

శ్రీ ఇ. రాజేందర్ : అధ్యక్షా, రేవంత్‌రెడ్డి గారు చాలా అనర్గళంగా మాట్లాడారు. వారు సీనియర్ సభ్యులు. వారు ఎంఎల్‌సీగా కూడా పనిచేశారు. వాటర్ గ్రిడ్ పథకం కోసం అప్పు చేశామని అన్నారు. కార్పొరేషన్ నుండి అప్పు తెచ్చుకున్న మాట వాస్తవం. హౌసింగ్ కోసం, హడ్కో బ్యాంకు రుణాలను ఇవ్వడానికి ముందుకు వచ్చిన మాట వాస్తవం. కరెంట్ ఉత్పత్తి కోసం రూ. 91,500 /- కోట్లు అప్పు చేస్తున్నారని అన్నారు. అది వాస్తవమా అని అడుగుతున్నాను. మీకు తెలుసు. రూ. 91,500/- కోట్లు ఇన్వెస్ట్‌మెంట్ చేయడం జరిగింది, నిజమే. కాని ఎవరు చేస్తున్నారు? ఎన్‌టీపీసి 4000 మె.వా పవర్ ఉత్పత్తి కోసం ప్రయత్నం చేస్తుంది. అందుకు పెట్టుబడి ఎన్‌టీపీసి పెడుతుంది. గతంలో వరంగల్‌లోని భూపాల్‌పల్లిలో పవర్ ప్రొడక్షన్ కోసం పెట్టుబడి పెట్టారు. వయబుల్ ప్రాజెక్ట్ కాబట్టి పెట్టుబడులు పెడతారు. ప్రైవేట్ వ్యక్తులు సోలార్ పవర్ కోసం ఇన్వెస్ట్ చేస్తున్నారు. దానికి కూడా గవర్నమెంట్ ఇన్వెస్ట్ చేస్తుందని తప్పుడు సమాచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని మనవిచేస్తున్నాను.

2.10 మ. రెండవది పేదలకు సంబంధించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లకు సంబంధించి తెలంగాణ రాష్ట్రప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రం చేయని ప్రయత్నం చేస్తున్నందుకు మీరు అభ్యంతరం చెబుతున్నారా? మూడవది గతంలో రైతులకు కనీసం మూడు గంటలు కూడా నిరంతర విద్యుత్ సరఫరా లేక మోటర్లు కాలిపోయి, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకున్న ఈ రాష్ట్రంలో ఇప్పుడు క్వాలిటీ విద్యుత్ నిరంతరాయంగా ఏడు గంటలు సరఫరా చేస్తూ, భవిష్యత్తులో 9 గంటల విద్యుత్‌ను రైతులకు నిరంతరాయంగా సరఫరా చేయాలనే సంకల్పంతో మా ప్రభుత్వం ఉన్నది. దానికి మీరు అభ్యంతరం చెబుతున్నారా? ఒకవైపు ప్రజల గురించి మాట్లాడుతూనే మరోవైపు మా ప్రభుత్వాన్ని నిందించడం తగునా అని అడుగుతున్నాను. దయచేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయకండి. సభ్యులు వాస్తవాలు చెప్పే ప్రయత్నం చేస్తే రిప్లైలో తప్పనిసరిగా ప్రతి అంశానికి ప్రభుత్వం సమాధానం చెబుతుందని మనవి చేస్తున్నాను.

శ్రీ పాయం వెంకటేశ్వర్లు (పినపాక): అధ్యక్షా, ఈనెల 14వ తారీఖున గౌరవ ఆర్థిక శాఖామాత్యులు శ్రీ ఈటెల రాజేందర్ గారు తెలంగాణ శాసనసభలో మూడవసారి ముచ్చటగా 2016-17 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈసారి రూ.1,30,415.78 కోట్లతో ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌ను పరిశీలిస్తే భారీ అంకెలు, ప్రజలను ఆశల పల్లకిలో ఊరేగించే విధంగా భ్రమలు కల్పించే విధంగా ఉన్నదని అర్థమవుతున్నది. బడ్జెట్‌పైన గౌరవ ప్రతిపక్ష సభ్యులు చాలామంది మాట్లాడుతూ ఈ బడ్జెట్‌లో ఉన్న సారాంశాన్ని సభకు తెలియజేశారు. భారతదేశంలోనే మొదటిసారిగా ప్రణాళికా వ్యయం బడ్జెట్‌లో 51 శాతంగా అంచనాలు చూపారు. గతంలో ఎప్పుడూ ఇది 35 శాతానికి మించిలేదు. ప్రణాళికా వ్యయం రూ.65,630 కోట్లు, ప్రణాళికేతర వ్యయం కింద రూ.62,780 కోట్లు చూపించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు 2004-2009 మధ్యకాలంలో చూస్తే మన రాష్ట్రం ఆర్థికంగా పరిపుష్టిగా ఉన్న విషయం మనకు తెలుసు. అటువంటి సమయంలో కూడా ఇంతటి భారీ స్థాయిలో ప్రణాళికా వ్యయం లేదు. అప్పుడు కూడా ప్రణాళికా వ్యయం 35-40 శాతానికి మించిలేదు.

ఈ సంవత్సరం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రణాళికా వ్యయం 51 శాతానికి అంచనా వేయడం చూస్తే అభినందించాలో, జాలిపడాలో అర్థం కావడం లేదు. 2014-15 సంవత్సరానికి సంబంధించి 10 నెలల బడ్జెట్‌ను ప్రవేశపెట్టినప్పుడు రూ.1,00,637.96 లక్షల కోట్లు ప్రవేశపెట్టారు. రాబడిలో గ్రాంట్ ఇన్ ఎయిడ్ చూస్తే రూ. 21,781 కోట్లు వస్తాయని అంచనా వేశారు. ఉమ్మడి రాష్ట్రంలోనే 12 నెలలకు కలిపి 2012-13 లో చూస్తే రూ.7,500 కోట్లు, 2013-14 లో రూ.8,990 కోట్లు మాత్రమే గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా వచ్చిన పరిస్థితిని గుర్తు చేస్తున్నాను. పరిస్థితి ఈ రకంగా ఉంటే ఈ ప్రభుత్వం ఏ రకంగా పది జిల్లాల రాష్ట్రానికి పది నెలలకు రూ. 21,781 కోట్లు వస్తాయని అంచనా వేశారో ఆలోచించమని కోరుతున్నాను.

ఇప్పుడు అకౌంటింగ్ సిస్టం కూడా మారింది. వాస్తవంగా వచ్చింది కేవలం రూ.7,118 కోట్లు మాత్రమే. అంటే రూ.14,600 కోట్ల మేరకు అంచనాలు తప్పాయి. ఆ మేరకు మీరు చెప్పిన ప్రాజెక్టుల వ్యయం తగ్గినట్లుగా అర్థమవుతున్నది. అదే విధంగా నాన్ ట్యాక్స్ రెవెన్యూలో భూముల అమ్మకం ద్వారా రూ.13,242 కోట్లు

వస్తాయని అంచనా వేశారు. వాస్తవానికి వచ్చింది రూ. 6,446 కోట్లు మాత్రమే. వీటిలో సుమారు రూ.7వేల కోట్లు కోత పడింది. అంటే ఈ ప్రభుత్వం చెబుతున్నది ప్రగల్భాలని అర్థమవుతున్నది. 2014-15 కు సంబంధించి ట్యాక్స్ రెవెన్యూలో మీరు అంచనాలు వేసిన రూ.35వేల కోట్లకు బదులు వచ్చింది రూ.21వేల కోట్లు మాత్రమే. వీటన్నింటిని కలిపితే రెవెన్యూ రాబడులలో మొత్తం వాస్తవంగా వచ్చేది రూ.51 వేల కోట్లు మాత్రమే. సుమారుగా రూ.31వేల కోట్ల అంచనాలు తప్పయ్యాయి. ఇవి కాకుండా మీరు అప్పులుగా రూ.15,399 కోట్లు తీసుకొస్తామని అంచనాలు వేశారు. కానీ FRBM పరిమితికి లోబడి రూ.10వేల కోట్లకు మించి అప్పులు తెచ్చే అవకాశం లేదు కాబట్టి ఇది సాధ్యం కాదని మేం ఆనాడే చెప్పాం. వాస్తవానికి అప్పుల రూపంలో స్వీకరించింది రూ. 9,400 కోట్లు మాత్రమే. 2014-15 సంవత్సరానికి మొత్తం కలిపితే లక్ష కోట్లకు బదులు రూ. 62 వేల కోట్లు మాత్రమే ప్రభుత్వం ఖర్చు పెట్టగలిగింది. దీనికి కారణం ప్రభుత్వానికి తెలిసి కూడా మేం చెప్పింది ఏ మాత్రం వినకుండా భారీ బడ్జెట్‌ను కేటాయించామని చెప్పుకోవడానికి వాస్తవరూపం దాల్చని భారీ అంచనాలు వేసి ప్రజలను మభ్యపెట్టారు. 2015-16 లో బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు రూ.1,15,680 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టగా అందులో కేవలం రూ.90వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసే అవకాశమున్నది.

MR.SPEAKER: Please conclude.

శ్రీ పాయం వెంకటేశ్వర్లు: అధ్యక్షా, నేను అయిదు నిమిషాల క్రితమే మొదలు పెట్టాను. ఇటువంటి బడ్జెట్ వలన ఎవరికి లాభం వస్తుందని ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరుతున్నాను. 2015-16కు సంబంధించి సవరించిన అంచనాలను చూశాం. మీరు సవరించిన అంచనాలు బడ్జెట్‌కంటే రూ.15వేల కోట్లు తగ్గించారు. ఇవి కూడా వాస్తవాలకు చాలా దూరంగా ఉన్నది. నాకన్నా ముందు మాట్లాడిన పెద్దలు బడ్జెట్‌కు సంబంధించి చాలా విషయాలు చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలోని రైతాంగానికి సంబంధించిన ఆత్మహత్యల విషయంలో, రుణమాఫీ విషయంలో కూడా ఏక కాలంలో రుణమాఫీ చేస్తామని మీరే చెప్పారు. బడ్జెట్‌లో కూడా ఆర్థికశాఖ మంత్రిగారు రుణమాఫీ చేస్తామని చెప్పారు. కాబట్టి ఇప్పటికైనా గౌరవ మంత్రివర్యులు భరోసానిచ్చే విధంగా రుణాలను మాఫీచేసి రైతులకు భరోసా కల్పించాలని కోరుతున్నాను.

రాష్ట్రంలో కరువు పరిస్థితి విపరీతంగా ఉన్నది. ఎండాకాలం ఎండలు ఎక్కువయ్యాయి. భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. ఇటువంటి పరిస్థితులలో కరువుకు సంబంధించి ఏజెన్సీ ప్రాంతాలలో, మైదాన ప్రాంతాలలో మొత్తం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేకమైన నిధులు కేటాయించి ప్రత్యేకమైన అధికారులను నియమించడం ద్వారా ఎండాకాలం పరిస్థితులను, కరువు పరిస్థితులను అధిగమించే విధంగా, మంచినీటి ఎద్దడి నివారణ కోసం కూడా ప్రత్యేకమైన చర్యలు తీసుకునే ప్రయత్నం ప్రభుత్వం చేయాలి.

కేంద్ర ప్రభుత్వం మాట్లాడినా, రాష్ట్రప్రభుత్వం మాట్లాడినా దేశానికి వెన్నముక రైతు అని అంటారు. రైతే రాజని ప్రతి సమావేశంలో గొప్పలు చెప్పుకుంటాం. కానీ ఇప్పుడు రైతుల పరిస్థితి చాలా దారుణంగా ఉన్నది. మద్ధతు ధర గురించి చెప్పాలంటే పరిశ్రమలలో తయారయ్యే ప్రతి వస్తువుకు మద్ధతు ధర ఉంటుంది. కానీ రైతు పండించే ధాన్యానికి మాత్రం ఎందుకు మద్ధతు ధర ప్రకటించలేకపోతున్నామో ఆలోచన చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. మద్ధతు ధర అనే అంశం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో లేనప్పటికీ కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి రైతాంగానికి మద్ధతు ధర ముందే ప్రకటిస్తే వారు ధైర్యంగా పంటలు పండించుకొని ఆత్మహత్యలు చేసుకోకుండా ఉంటారనే విషయాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించాలని కోరుతున్నాను.

MGNREGSను వ్యవసాయానికి అనుసంధానం చేసి రైతాంగానికి కూడా గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు మేలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నాను. తెలంగాణ రాష్ట్రంలో ఈ మధ్య ప్రాజెక్టులను రీడిజైన్ చేశారు. ఖమ్మం జిల్లాలోని సీతారామ ఎత్తిపోతల పథకం, భక్తరామదాసు ఎత్తిపోతల పథకాలకు గౌరవ ముఖ్యమంత్రి గారు శంకుస్థాపన చేశారు..దానికి సంబంధించి కూడా స్పష్టత లేదు. కాబట్టి అక్కడ ఎన్నుకోబడిన ఎమ్మెల్యేలతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రజలలో ఉన్న ఆందోళనలను తొలగించే ప్రయత్నం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

2.20 మ. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల విషయంలో గౌరవ ముఖ్యమంత్రి గారు ఒక లక్ష్యం పెట్టుకొని, ఒక నమ్మకంతో ముందుకు పోతున్నారు. ఇది సంతోషకరం. ఈ ఇళ్లన్నింటిని యూనిఫామ్‌గా కట్టాలనే అంశాన్ని సవరించాలనే సూచనను చేస్తున్నాను. హైదరాబాద్ లాంటి నగరాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను యూనిఫామ్‌గా కట్టవచ్చు. కానీ, గ్రామీణ, మైదానా, ఏజెన్సీ ప్రాంతాల్లో ఇంటి స్థలాలు ఉన్నవాళ్లకు ఆస్థలాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కట్టించే విధంగా ఆలోచన చేయాలని కోరుతున్నాను. ఇందిరమ్మ ఇళ్ల బకాయిల పెండింగ్‌లను

చెల్లించి వారిని ఆదుకునే ఆలోచన చేయాలని, 4 లక్షల మంది లబ్ధిదారులకు రూ.2000కోట్లకు పైగా పెండింగ్ బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నారు. ఈ బిల్లులను చెల్లించి వారు ఇండ్లను పూర్తి చేసుకునే విధంగా చూడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఆనాడు రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సకాలంలో ఫీజు రియింబర్స్‌మెంట్‌ని చేయడం వల్ల విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవడానికి, ఉద్యోగాలు చేయడానికి దోహదం చేశారు. కావున, ఈ ప్రభుత్వం కూడా ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను ఒకేసారిగా చెల్లించి విద్యార్థులు మనోధైర్యంతో ఉండేలా చేయాలని ఈ ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అధికారంలోకి రాగానే ప్రతి గిరిజన కుటుంబానికి మూడెకరాల భూమిని ఇస్తామని మ్యానిఫెస్టోలో చెప్పారు. ఈరోజు వరకు ఆ మాటనే బడ్జెట్‌లో ఎక్కడా చెప్పలేదు. మాటలు చెప్పారు కానీ దీనిని ఎక్కడ అమలు చేయలేదు. దళితులకు కోసం చేపట్టిన ఈ విధమైన కార్యక్రమాన్ని గిరిజనులకు కూడా చేపట్టి వారికి కూడా మూడెకరాల భూమి ఇవ్వడానికి ప్రయత్నం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

MR. SPEAKER: Please conclude within one minute.

శ్రీ పాయం వెంకటేశ్వర్లు: ఐదు సంవత్సరాల్లో ఎస్సీల సంక్షేమం, అభివృద్ధి కోసం రూ.50000 కోట్లను ఖర్చు చేస్తారని చెప్పారు. కానీ, దళితులకు సంబంధించిన కేటాయింపులు, ఖర్చులు చాలా తక్కువగా ఉన్నాయి. ఈ విషయం గురించి కూడా ప్రభుత్వం సమాధానం చెప్పాలి. మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్స్‌ని ఇస్తామన్నారు, సచార్ కమిటి సూచనలను అమలు చేస్తామని చెప్పారు. ఈ విషయాలను గురించి కూడా ప్రభుత్వం ప్రస్తావించ లేదు. ఎస్టీలకు సంబంధించి సబ్‌ప్లాన్‌ని పెట్టారు. గత సంవత్సరం బడ్జెట్ సూచించిన నిధులను ఖర్చు చేయకుండా కేవలం 57 శాతం నిధులను మాత్రమే ఖర్చు చేశారు. ఈ విధంగా జరగకుండా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ విషయంలో ఒక కమిటీని ఏర్పాటు చేసి ఆ కమిటి ఆధ్వర్యంలో నిధులను ఖర్చు చేయడానికి ఆలోచన చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. బీసీలకు, మైనారిటీలకు సంబంధించిన సబ్‌ప్లాన్‌ని ఏర్పాటు చేసి కేటాయించిన నిధులను పక్కదారి పట్టకుండా ఆలోచన చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ...

MR. SPEAKER: The House is adjourned to meet at 10.00 a.m., tomorrow.

(Then the House adjourned at 2.24 p.m., to meet again at 10.00 a.m., on Saturday, the 19th March, 2016)

* * *

"Published under Rule 350 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Assembly and Printed at Assembly Press, Public Gardens, Hyderabad."